

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! | సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 22 - సంచిక 3
ఆగస్టు 2017


పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు

**040-23700722**
**94407 69798**



## జాతీయత - కర్తవ్యం

ఏ జాతికైనా ప్రతి ప్రాణి యొక్క అస్తిత్వమే జాతీయత. ఈరోజున మనం ఉన్నాం. 'రేపు' అనేది రాబోయే తరానిది. 'మనం' అన్న పదంలో 'మనది' అన్న భావం నిక్షిప్తమై ఉంటుంది. 'మనది' అన్న భావం చాలా విశాలమయింది. దానికి హద్దులు లేవు. ఉండకూడదు. దేశానికి సంబంధించిన భూమి, భూమిపై ఉన్న నదులు, పర్వతాలు, సెలయేర్లు, విశాలమైన సముద్రం, చిన్న చిన్న సరోవరాలు, దట్టమైన అడవులు, సుందరమైన ఉద్యానవనాలు, వీటిల్లో నివసించే చిన్న-పెద్ద ప్రాణులు, అడవుల్లో ఉన్న సకల వృక్ష సంపద - వనస్పతులు - జంతువులు, పైన ఉన్న ఆకాశం, ఆకాశంలో ఎగిరే పక్షులు, నదులలో ఉండే నీరు - జలచరాలు మొదలైనవన్నీ జాతీయ సంపదలే. అంతేకాదు, దేశంలో ఉన్న రాష్ట్రాలు, పట్టణాలు, గ్రామాలు, భాషలు, మాట్లాడే తీరుతెన్నులు, సంప్రదాయపు రీతి - రివాజులు, ధర్మము - మత ఆచారపరంపరలు మొదలైనవన్నీ దేశం నుండి విడదీయరాని అంశాలే. వీటిని గురించి 'మనది' అని ఆలోచించడమే జాతీయభావన.

ప్రపంచంలో ఏ దేశంలో అయినా జాతీయతను మించిన అంశం మరొక్కటి ఉండదు. "వందే భారతమాతరం" అన్న నినాదంలోనే భారతీయుల గుర్తింపు ఇమిడి ఉంది. ఏ జాతికైనా జన్మభూమి జననితో సమానం. మనందరినీ ఒక్కటిగా కట్టిపడేసేది జాతీయజెండా. మనకు ప్రియాతి ప్రియమైన మూడు రంగుల జెండా. ఆ జెండా గౌరవమే మన గౌరవం. జాతీయ జెండా యొక్క పేరు ప్రతిష్ఠలే మన పేరు ప్రతిష్ఠలు. జాతీయ భావాలను పెంపొందించే గౌరవ చిహ్నాలు, ఆచారాలు, శ్రద్ధా కేంద్రాలు మొదలైనవాటిని అన్నింటిని కలిసికట్టుగా రక్షించుకోవడంలోనే జాతీయత ప్రతిబింబిస్తుంది. అదే సమాజ ఉన్నతికి పరమపద సోపాన పటము. అప్పుడే దేశం ఐకమత్యంగా, ఐశ్వర్యవంతంగా అఖండతను సాధించుకోగలుగుతుంది.

జాతీయతను కాపాడుకోవడం జాతిలో జన్మించిన ప్రతి ఒక్కరి యొక్క ప్రధాన కర్తవ్యం. ఇది కేవలం హిందువులకే కాదు. భారతదేశవాసులైన ముస్లిములు, సిక్కులు, క్రైస్తవులు అందరు సమాన బాధ్యత వహించవలసి ఉంటుంది. జాతీయతలో కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, భాషలకు స్థానం ఉండదు. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ఒకటే క్షేత్రం. ఒకే శరీరం. ఈ శరీరంలో ఎక్కడ ముల్లు గుచ్చినా దేశ ప్రజలందరు బాధను అనుభవించవలసి వస్తుంది. మన శరీరంపై చూపించే శ్రద్ధనే దేశం మీద చూపించవలసి ఉంటుంది.

**15-8-1947**న మనకు స్వాతంత్ర్యం వచ్చింది. మూడు వన్నెల ముచ్చటైన జెండా మురిపెంగా ఎగిరింది. మనందరం మన జెండాను ప్రాణప్రదంగా చూచుకుంటామని ప్రతిన బూనడం, రక్షించుకోవడం మనందరి కర్తవ్యం.

# విషయసూచిక


1. **సంపాదకీయం:** జాతీయత - కర్తవ్యం 3
2. **విషయసూచిక & సద్గురు వచానమృతం** 4
3. **యుగనిర్మాణ చిత్రావళి-29:** 5
దుష్టశక్తులతో దుర్గతి
4. **గాయత్రీ మహావిజ్ఞానం-3:**
గాయత్రి సూక్ష్మశక్తుల ప్రవాహం 6
5. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-62:**
విచిత్రమైన ఆటంకం 10
6. **శ్రీకృష్ణాష్టమి ప్రత్యేకం:** కృష్ణం వందే జగద్గురుమ్ 14
7. **సమయదానమే యుగధర్మము - 8:**
జన జాగరణ - మన కర్తవ్యాలు 17
8. **మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-5:** మాతృత్వంతో
పాటు చేపట్టబడిన అలౌకిక దాంపత్యము 19
9. **శిష్య సంజీవని-5:** తనను తాను సమర్పించు
కున్నప్పటికీ ఇంకా ఏదో ఇప్పుడే ఇచ్చేట్టుగా చేస్తుంది
మనస్సు 22
10. **బోధకథ:** యజ్ఞం అంటే త్యాగం 24
11. **వినాయక చవితి ప్రత్యేకం :**
శ్రీ సిద్ధి వినాయక వ్రతకల్పము 26
12. **కుటుంబ నిర్మాణం:**
ఆచరణ ద్వారా బోధించడం మంచిది 31
13. **స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేకం :** భారతీయులు
జీవనాన్ని మరింత సంకల్ప నిష్ఠతో సాగించాలి 33
14. **బోధ కథ:** జీవితం క్షణభంగురం-జ్ఞానం శాశ్వతం 38
15. **వ్యక్తి నిర్మాణం:** విజయానికి మూడు మెట్లు 41
16. **పూజ్య గురుదేవుల అమృతవాణి:**
ఆధ్యాత్మికత యొక్క అసలైన సంపదలు-3 43
17. **నా వారితో నా మాట:** తొమ్మిది సంవత్సరాల
మాతృశక్తి శ్రద్ధాంజలి నవసృజన మహాపునశ్చరణ-2 46
18. **అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018** (కౌంట్‌డౌన్-5) 49
19. **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో 50
జరిగిన వివిధ కార్యక్రమాలు




## సద్గురు వచనామృతం

### దుష్కర్మ యొక్క ఫలితాన్ని అనుభవించవలసిందే

*ప్రపంచంలో మనిషి తన క్షణిక సుఖం కోసం రకరకాల దుష్ట కర్మలు చేసేస్తూ ఉంటాడు. ఆ దుష్ట కర్మల ఫలితాలను చివరికి తాను ఎలా అనుభవించవలసి వస్తుందో అతడికి తెలియదు. మనిషి పలు విధాలయిన కష్టాలను అనుభవించ వలసి వస్తుంది. సమాజము, దేశ కాల పరిస్థితులు అందుకు కొంత వరకు కారణాలు కావచ్చు. అయితే అతడు తన దుష్ట కర్మల ఫలితాలనే అనుభవిస్తాడు. మానవ శరీరం దుఃఖాలను అనుభవించ డానికి ఇవ్వబడలేదు. ఆత్మ కళ్యాణం కోసం కర్మలు చేయడానికి ముఖ్య సాధనం అది. కనుక మన ప్రవృత్తి కూడా ఆత్మ కళ్యాణం అనే లక్ష్యాన్ని చేరడానికి వినియోగ పడాలి. చెడ్డ స్వభావానికీ, చెడ్డ పనులకూ దూరంగా ఉండడం ఇందుకు అవసరం అవుతోంది.*

*సాధనాలను సంపాదించి, ఆత్మ వివేకాన్ని సద్వినియోగ పరచితే, వాటిని మంచి పనులకు ప్రయోగిస్తే - ఆత్మ తన శక్తులను పెంచుకుంటుంది; అనుకూల సాధనాలను నిర్మిస్తూ ఉంటుంది; చివరికి ప్రారబ్ధం నుండి విముక్తి పొంది, పూర్తిగా ఉన్నతిని పొందుతుంది.*

*సత్యం యొక్క ముఖం మూసి వేయబడి ఉంది. ఓ సత్య శోధకుడా! దానిని పొందాలంటే, నీవు ఆ మూతను తెరవ వలసి ఉంటుంది. ఆత్మజ్ఞానం చెడ్డ పనుల చేత అలా మూసి వేయబడి ఉంది. దాన్ని పొందాలంటే - ఆ చెడ్డ పనులను మానివేయాలి.*

★★★

**ప్రతి సమస్యకు సమాధానం ఉంటుంది**

యుగనిర్మాణ చిత్రావళి-29

# దుష్టశక్తులతో దుర్గతి



మానవ జీవనము భావనల అనుపమ కానుక. ఆలోచించగలగడం, మాట్లాడగలగడం, చదువుకోవడం, సంపాదన, చికిత్స, పరివారము, వస్త్రము, వాహనము, ఇంకా అనేక ఉపకరణాలు, సౌకర్యాలు మనిషికి లభించాయి. ఇలాంటి సౌకర్యాలు సృష్టిలోని ఏ ప్రాణికి లభించలేదు. ఈ అనుదానాలు ఆనందించటానికో, బాధపడటానికో మనిషికి ఇవ్వబడలేదు. అలా చేసినట్లయితే భగవంతుడు మనిషిపై పక్షపాతం చూపించి ఇతర ప్రాణులకు అన్యాయం చేసినట్లే. ఈశ్వరుని ఇచ్ఛ ఏమంటే తనవంటి భావనాత్మక మహోన్నత, విశేష విభూతులు కలిగిన ప్రాణిని తయారు చేసి, ఆ ప్రాణి సహయోగంతో సృష్టిని అందముగా, వికసించిన సువ్యవస్థగా తయారుచేయాలి. మనిషి యొక్క సృష్టి ఈ ప్రయోజనం కొరకే జరిగింది.

మనిషి సృష్టికర్త యొక్క ఉద్దేశ్యాన్ని జీవన లక్ష్యంగా చేసుకుని తన వ్యక్తిత్వాన్ని ఆదర్శవంతంగా, అనుకరణీయంగా తీర్చిదిద్దుకుని, లోకమంగళం కొరకు అధికాధిక సాహసం, పురుషార్థం, త్యాగం చేసి నరజన్మ యొక్క అనుదానం - సౌభాగ్యం పొందగలుగుతాడు. కానీ దుర్బుద్ధి గురించి ఏమి చెప్పగలము? దుర్బుద్ధి మనిషిని అజ్ఞానిగా, వ్యామోహగ్రస్తునిగా చేసి పొట్ట నింపుకోవడం, పిల్లలను కనడం వంటి పశు ప్రయోజనముల కొరకు పరిమితము చేసింది, నికృష్టస్థాయి ప్రాణుల వలే జీవించేందుకు వివశం చేసింది.

ఈ విధంగా మనిషిని భ్రష్టం చేసే దుర్బుద్ధిని వాసనగా, తృష్ణగా చూడవచ్చు. దీన్ని ఇంద్రియములలో వాసన రూపంలో, మనస్సులో తృష్ణగా చూడవచ్చు.

ఇంద్రియములు రకరకాల రుచులు కోరతాయి. అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉచిత పరిధిలో ఇంద్రియాలకు సుఖాన్ని ఇవ్వ వచ్చు. కానీ వాటి లోభం అపరిమితం అయి, నియంత్రణ లేకపోతే విశృంఖలమైపోతే అవి శరీరాన్ని దుర్బలం చేస్తాయి, మనస్సును దీనంగా చేస్తాయి, అనేక రోగాలు చుట్టుముడతాయి. నైతిక మర్యాదలు పాటించకపోవడం అనేక కలహాలకు దారితీస్తుంది. ఇక్కడ చెప్పబడుతున్నది తృష్ణకు సంబంధించినది. శరీర యాత్రకు కావలసిన సాధనములు సమకూర్చుకొనుట అవసరమే. లోభి మనస్సు అధికాధికంగా కూడబెట్టటానికి లాలస (ఆశ)లో కూరుకుపోతే అనుచిత మార్గంలో సంపాదించడానికి ఎటువంటి సందేహం ఉండదు. ఈ సంపాదన తన కుటుంబం కొరకు, సమాజ ఉన్నతి కొరకు కాక తన విలాసాలకు, తన గొప్పదనం చాటేందుకు ఉపయోగిస్తాడు తనను, తన పిల్లలను ధనవంతులుగా చెప్పుకోవాలని, ధనం ఇంకా ఇంకా కూడ బెట్టాలని చూస్తాడు. మనస్సు యొక్క ఈ తీవ్రమైన కోరికనే తృష్ణ అంటారు.

తృష్ణ మనస్సును, శరీరాన్ని తన వలలో వేసుకుని ఇలాంటి ఆలోచనలను, కార్యపద్ధతిని పాటించేందుకు వివశం చేస్తుంది. ఇలాంటి పరిస్థితి మానవజీవనాన్ని జీవన లక్ష్యం నుంచి దూరం చేస్తుంది. లోభి, కాముకుడైన మనుష్యుడు నికృష్ట స్వార్థసంకుచిత జీవనంలో రోజులు గడుపుతాడు. తనకు తాను అశాంతి బీజాన్ని నాటుకుంటాడు, ఇతరులను చెడు మార్గంలో వెళ్ళేందుకు ప్రేరణ ఇస్తాడు. ఈ దుష్టచక్రంలో ఇరుక్కున్న వ్యక్తి నరకం యొక్క అగ్నిలో మాడిపోతాడు, పతనం యొక్క గోతిలో పడి దుర్గతి పొందుతాడు.

*- అనువాదం: ముక్కామల రత్నాకర్*

**దుఃఖం తరువాత సుఖం ఖాయం**



గాయత్రీ మహావిజ్ఞానం-3

# గాయత్రి సూక్ష్మశక్తుల ప్రవాహము

గత సంచికలో ఒక అవ్యయము, నిర్వికారం అజరం-అమరం అయిన పరమాత్మకు 'ఒకటి నుండి అధికం కావాలి" అనే ఇచ్ఛ కలిగింది అని చెప్పుకున్నాము. బ్రహ్మదేవునికి "ఏకోஉహం బహుశ్యామ్" నేను ఒంటరిగా ఉన్నాను, అధికం అవుతాను" అనే స్ఫురణ కలిగింది. అతని ఇచ్ఛయే శక్తిగా అయింది. ఈ ఇచ్ఛ, స్ఫురణ లేక శక్తినే బ్రహ్మపత్నిగా చెప్తారు. ఈ ప్రకారంగా బ్రహ్మ రెండు అయ్యాడు. ఇప్పుడు వారిని లక్ష్మీనారాయణుడు, సీతారాములు, రాధాకృష్ణులు, శివపార్వతులు మొదలైన పేర్లతో పిలవడం మొదలుపెట్టారు.

ఈ శక్తి ద్వారా అనేక పదార్థములు, ప్రాణుల నిర్మాణము మూడు భాగములలో జరుగవలసి ఉన్నది. అందువలన బ్రహ్మదేవుడు తనను మూడు భాగములుగా విభజించుకోవలసి వచ్చింది. అప్పుడు అనేక రకముల సమ్మిశ్రణము తయారయి, వివిధ గుణ కర్మ స్వభావములు గల జడచేతన పదార్థములు తయారుచేయ గలిగాడు. బ్రహ్మ యొక్క ఈ మూడు ముక్కలను 1) సత్ (సత్త్వ), 2) రజ్ (రజస్సు), 3) తమస్ (తమస్సు) పేర్లతో పిలుస్తారు. సత్ అంటే అర్థము-ఈశ్వరుని దివ్యతత్త్వము. తమస్ (తమస్సు) యొక్క అర్థము-నిర్జీవ పరమాణువులలోని అస్తిత్వం. రజ్ (రజస్సు) అంటే అర్థము జడపదార్థముల, ఈశ్వరీయ దివ్యతత్త్వముల సమ్మిశ్రణముతో ఉత్పన్నమైన ఆనందదాయక మైన చేతనత్వము. ఈ మూడు తత్త్వములు స్థూలసృష్టి యొక్క మూలకారణములు. దీని తరువాత స్థూల రూపంలో మట్టి, నీరు, గాలి, అగ్ని, ఆకాశం-ఈ ఐదు స్థూల పంచతత్త్వములు కూడా ఉత్పన్నమయ్యాయి. ఈ తత్త్వముల పరమాణువులు, వాటి శబ్ద, రూప, రస, గంధ, స్పర్శ, తన్మాత్రల ద్వారా సృష్టి కార్యం మొత్తం నడుస్తున్నది. ప్రకృతికి రెండు భాగములు ఉన్నాయి. సూక్ష్మ ప్రకృతి, స్థూల ప్రకృతి. సూక్ష్మ ప్రకృతి - ఇది శక్తిప్రవాహ రూపములో, ప్రాణసంచార రూపములో పనిచేస్తుంది. అది సత్, రజ్, తమములతో కూడుకున్నది. స్థూలప్రకృతిలో ఏ దృశ్య (కనిపించే) పదార్థముల నిర్మాణము, ఉపయోగం ఉంటుందో, అవి పరమాణు మయమైనవి. ఈ మట్టి, నీరు, గాలి మొదలైనవి స్థూల పంచ తత్త్వాల ఆధారంపై తమ పనులు నిర్వర్తిస్తాయి.

పైన చెప్పిన పంక్తులలో మొదట ఒక బ్రహ్మ ఉన్నాడు. అతని స్ఫురణలో ఆదిశక్తి ఆవిర్భావం జరిగింది. ఈ ఆదిశక్తి పేరే గాయత్రి. బ్రహ్మ గాయత్రిని మూడు భాగములుగా విభజించాడు.

1) సత్ (సత్త్వ) - దీనిని హ్రీం లేక సరస్వతి అంటారు.

2) రజ్ (రజస్సు) - దీనిని శ్రీం లేక లక్ష్మి అంటారు.

3) తమస్ (తమస్సు) - దీనిని క్లీం లేక కాళీ అంటారు.

వస్తుతః సత్త్వ, తమస్ (తమస్సు) అనే రెండు భాగములే ఉన్నాయి.

ఈ రెండు కలవడం వలన ఉత్పన్నమైన ధారను రజ్ అంటారు. గంగా యమునల సంగమము వలన ఏర్పడిన మిశ్రమధారను సరస్వతి అంటారు. సరస్వతి అనే నది వేరుగా లేదు. ఎలా రెండు నదుల కలయిక సరస్వతి అయిందో అలాగే సత్, తమల (తమస్సుల) కలయికతో రజ (రజస్సు) ఉత్పన్న మయింది. దీనినే త్రిధా (త్రివిధ) ప్రకృతి అని అన్నారు.

అద్వైతము, ద్వైతము, త్రైతవాదముల మధ్య చాలా గొడవలు జరిగాయి. వస్తుతః ఇది అర్థం చేసుకోవడంలో తేడా మాత్రమే. బ్రహ్మ, జీవి, ప్రకృతి - ఇవి మూడే అస్తిత్వంలో ఉన్నాయి. మొదట బ్రహ్మ ఉన్నాడు. ఇది సరియైనదే. అందువలన అద్వైతము కూడా సరియైనదే. తరువాత బ్రహ్మ ప్రకృతి రెండుగా అయ్యాయి. అందువలన ద్వైతము కూడా సరియైనదే. ప్రకృతి, పరమేశ్వరుడి సంస్పర్శతో (संस्पर्श) రసాను భూతి, చైతన్యం కలిసిన రజ సత్తా (రజోశక్తి) ఉత్పన్నమయింది. దీనినే జీవుడు అని అన్నారు. ఈవిధంగా త్రైతవాదం కూడా సరియైనదే. ముక్తి చేకూరినంతనే జీవసత్తా (జీవశక్తి) నశిస్తుంది. జీవధారి వర్తమాన సత్తా మనస్సు, బుద్ధి చిత్తం, అహంకారంపై ఆధారపడి ఉన్నది. అది ఒక మిశ్రమం మాత్రమేనని స్పష్టమవు తుంది.

**ప్రతి కష్టం ఒక మార్పుకు కారణం**

తత్త్వదర్శనం వంటి గంభీరమైన విషయములలో ప్రవేశించి ఆత్మ యొక్క సూక్ష్మవిషయములపై వివరణకు ఇక్కడ అవకాశం లేదు. ఈ పంక్తులలో స్థూల సూక్ష్మ ప్రకృతుల భేదం చెప్పబడింది. ఎందుకంటే విజ్ఞానం యొక్క రెండు భాగములు ఇక్కడి నుండే ఏర్పడుతున్నాయి. మనిషి యొక్క దివ్య ప్రకృతి ఇక్కడి నుండే తయారవుతుంది. పంచతత్త్వముల ద్వారా పనిచేసే స్థూల ప్రకృతి యొక్క అన్వేషణ చేసే మనుష్యులను భౌతిక విజ్ఞాన వేత్తలని అంటారు. వారు తమ బుద్ధిబలముతో పంచతత్త్వముల భేద-ఉపభేదములను తెలుసుకుని అనేక లాభదాయక వస్తువులు పొందారు. రసాయనము, వ్యవసాయము, విద్యుత్తు, బాష్పం (వాయువు), శిల్పము, సంగీతము, భాష, సాహిత్యము, వాహనము, గృహ నిర్మాణము, చికిత్స, శాసనం, ఖగోళవిద్య అస్త్ర-శస్త్రములు, దర్శనము, భూ పరిశోధన, మొదలైన వాటిని పరిశోధించి అనేక సుఖసాధనములను తయారుచేసుకున్నాడు. రైలు, కారు, తంతి తపాల, రేడియో, టెలివిజన్, కెమెరా మొదలైన వస్తువులను తయారుచేయడానికి పెద్ద పెద్ద యంత్రములు తయారుచేశాడు. ధనము, సుఖము, వసతులు, విశ్రాంతి పొందే సాధనములు సులభతరమయ్యాయి. ఈ మార్గములో లభ్యమయ్యే లాభములను భోగము అని అంటారు. ఈ విజ్ఞానమును భౌతిక విజ్ఞానమని అంటారు. ఇది స్థూల ప్రకృతిని ఉపయోగించుకునే విద్య.

ఆద్యశక్తి (ఆదిశక్తి) గాయత్రిని ఉత్పన్నం చేసి సరస్వతి, లక్ష్మి, దుర్గగా విభజింపబడినదే సూక్ష్మ ప్రకృతి. ఈ సర్వ వ్యాపకమైన శక్తి - నిర్ఝరిణి. పంచతత్త్వముల కన్నా అధిక సూక్ష్మమైనది. నదీ ప్రవాహములలో నీటి కెరటములపై వాయువు (గాలి) యొక్క తాకిడి వలన "కలకల"తో కలిసిపోయే ధ్వనులు వినిపిస్తాయి. అలాగే సూక్ష్మశక్తిధారలతో మూడు రకాల శబ్ద-ధ్వనులు వినిపిస్తాయి. సత్ ప్రవాహములో 'హ్రీం', రజ ప్రవాహంలో 'శ్రీం', తమ (తమస్సు) ప్రభావంలో 'క్లీం' శబ్దములతో కలసిపోయే ధ్వనులు ఉత్పన్నమవుతాయి. అంతకన్నా కూడా సూక్ష్మమైనది సూక్ష్మ బ్రహ్మ ఓంకార (ఓం) ధ్వని ప్రవాహము. నాదయోగ సాధన చేసేవారు ధ్యానములో ఈ ధ్వనులను పట్టుకుంటారు, వాటి సహాయంతో సూక్ష్మప్రకృతిని కూడా దాటి బ్రహ్మ సాయుజ్యం వరకు వెళ్తారు.

ప్రాచీన కాలంలో మన పూజనీయ పూర్వీకులు, ఋషులు తమ తమ తీక్షణ దృష్టితో విజ్ఞానం యొక్క ఈ సూక్ష్మతత్త్వాన్ని పట్టుకున్నారు. దాని పరిశోధనలో తమ శక్తులను ఉపయోగించారు, సఫలత పొందారు. వర్తమాన కాలంలో పేరుగాంచిన భౌతిక విజ్ఞానుల కన్నా అనేకరెట్లు లాభాన్ని పొందారు. వారు ఆదిశక్తి యొక్క సూక్ష్మ ప్రవాహములపై పట్టు సాధించారు. మనిషి శరీరంలో అనేక రకాల శక్తుల ఆవిర్భావం జరుగుతుంది. మన ఋషిగణములు యోగసాధన ద్వారా విభిన్న భాగములలో దాచిపెట్టబడిన శక్తికేంద్రములను, చక్రములను, గ్రంథులను, మాతృకలను, జ్యోతులను, భ్రమరములను జాగృతం చేసేవారు. వాటి జాగరణతో ఉత్పన్నమైన శక్తి ప్రవాహములను ఆదిశక్తి యొక్క త్రివిధ ప్రవాహములలో అవసరమైన వాటితో సంబంధం స్థాపించు కునేవారు. రేడియో ట్రాన్స్‌మీటర్ స్టేషన్‌తో సంబంధం స్థాపించు కున్నప్పుడు ఆ స్టేషన్ నుండి ప్రసారములు వినగలుగుతాము. అలాగే శరీరంలో అంతర్గతంగా దాచిపెట్టబడిన నిద్రావస్థలో పడి ఉన్న కేంద్రములను జాగరణ చేసి సూక్ష్మప్రకృతి యొక్క శక్తి ప్రవాహములతో సంబంధం స్థాపించుకొనవచ్చు. మనిషి ఆద్యశక్తి పరస్పరం సంబంధం స్థాపించుకొనవచ్చు. ఈ సంబంధం వలన మనిషి ఆద్యశక్తి గర్భంలో నిండి ఉన్న రహస్యములను అర్థం చేసుకొనగలుగుతాడు, తన ఇచ్ఛానుసారం వాటిని ఉపయోగించుకుని లాభాన్వితుడు కాగలడు. ప్రపంచంలో ఏమేమి ఉన్నాయో, అవి అన్నీ ఆదిశక్తి లోపల ఉన్నాయి. అందువలన ఆద్యశక్తితో సంబంధం ఏర్పరచుకున్న వ్యక్తి కూడా ప్రపంచంలోని అన్ని పదార్థములపై, సాధనములపై సంబంధం పెట్టుకోగలుగుతాడు.

వర్తమాన కాలంలో వైజ్ఞానికులు పంచతత్త్వముల పరిధి వరకు స్థూలప్రకృతితో సంబంధం ఏర్పరుచుకుని గ్యాస్, పెట్రోలు, విద్యుత్తు, ఆవిరి మొదలైనవాటిని ఉపయోగించే పెద్ద పెద్ద ఖరీదైన యంత్రాలను ఆవిష్కరించారు, కొంచెం లాభం పొందగలిగారు. ఈ పద్ధతి శ్రమతో కూడిన కష్టసాధ్యం, ధనసాధ్యం, సమయసాధ్యం. ఈ యంత్రములు పాడయి పోతుంటాయి. ఈ యంత్రములను స్థాపించడానికి, నిర్మాణానికి సంరక్షించడాన్ని నిరంతరం దృష్టిలో ఉంచుకోవాలి. ఈ యంత్రములను వేరేచోటికి మార్చాలన్నా కూడా చాలా కష్టము. ఇలాంటి ఝంఝాటం భారతీయ యోగ విజ్ఞానులు ఎదుర్కొన లేదు. వారు ఎటువంటి యంత్రముల సహాయం లేకుండా, నడిపేవారు ఎవరూ లేకుండా, విద్యుత్తు, పెట్రోలు అవసరం లేకుండా, కేవలం తమ శరీరంలోని శక్తికేంద్రాల సూక్ష్మ

**ఓర్పులో ఉన్నది విజయం**

ప్రకృతితో సంబంధం స్థాపించుకుని ఆశ్చర్యకరమైన కార్యములు చేసేవారు. నేటి భౌతిక విజ్ఞానవేత్తలు అటువంటి సామర్థ్యము లను ఊహించే పరిస్థితిలో లేరు.

మహాభారతం, లంకాయుద్ధంలో ఉపయోగించబడిన అస్త్ర శస్త్రములలో కొన్ని చాలా కొద్దిగా మసకమసకగా కనిపిస్తున్నాయి. రాడార్, గ్యాస్ బాంబులు, అశ్రుబాంబులు, రోగ కీటాణువుల బాంబులు, పరమాణు బాంబు, మృత్యు కిరణములు మొదలైన మసక మసక చిత్రాలు తయారవు తున్నాయి. ప్రాచీనకాలంలో సమ్మోహనాస్త్రం, బ్రహ్మాపాశం, నాగపాశం, వరుణాస్త్రం, ఆగ్నేయాస్త్రం, శత్రువును చంపి తిరిగి వచ్చే బాణములు మొదలైనవాటిని విస్తారంగా ఉపయోగించే వారు. శబ్దభేది బాణములు ఉండేవి. ఈ అస్త్రశస్త్రములు ఖరీదైన యంత్రము లతో కాక మంత్రబలంతో పనిచేసేవి. ఇవి శత్రువు ఎక్కడ దాక్కుని ఉన్న వెతికి వెతికి వాడిని చంపేసేవి. లంకలో కూర్చుని ఉన్న రావణుడు అమెరికాలో ఉన్న అహిరావణుడు పరస్పరం చక్కగా మాట్లాడుకునేవారు. వారికి ఎటువంటి రేడియో పరికరముల అవసరం లేదు. విమానాలు పెట్రోలు లేకుండా ఎగిరేవి.

అష్టసిద్ధులు - నవనిధుల గురించి యోగశాస్త్రములలో అనేకచోట్ల వర్ణన ఉన్నది. అగ్నిలో ప్రవేశించడం, నీటిమీద నడవటం, వాయువుతో సమాన వేగంతో పరిగెత్తడం, అదృశ్యం కావడం, మనిషి పశుపక్షుల రూపం ధరించడం, పశుపక్షులు మనుష్య శరీరంలోకి మారడం; శరీరాన్ని చిన్నదిగా లేక పెద్దదిగా, శరీరాన్ని తేలికగా లేక బరువుగా చేసుకోవడం, శాపంతో అనిష్టములను ఉత్పన్నం చేయడం, వరదానములతో ఉత్తమ లాభముల ప్రాప్తి, మృత్యువుని ఆపడం, పుత్రేష్టి యజ్ఞములు, భవిష్యజ్ఞానం, ఇతరుల ఆంతర్యమును గుర్తించుట, క్షణములో కావలసిన ధనమును పొందుట; ఋతువులను, నగరములను, జీవ జంతువులను, దానవులను మొదలైన వానిని ఉత్పన్నం చేయడం, సమస్త బ్రహ్మాండములోని క్రియాకలాపములను తెలుసుకొనుట, ఏ వస్తువునయినా రూపాంతరం చేయటం; ఆకలి-దాహం, నిద్ర-చలి-వేడిపై విజయము, ఆకాశంలో ఎగరడం మొదలైన ఆశ్చర్యకరమైన కార్యములు కేవలం మంత్రబలంతో, యోగశక్తితో, ఆధ్యాత్మిక విజ్ఞానంతో జరిగేవి. ఈ వైజ్ఞానిక ప్రయోజనాలకు ఎటువంటి యంత్రములు, పెట్రోలు, విద్యుత్తు మొదలైనవి అవసరం అయ్యేవి కావు. ఈ పనులు శారీరిక విద్యుత్తు, ప్రకృతి యొక్క సూక్ష్మ ప్రవాహాలను ఉపయోగించుకుని అతి తేలికగా జరిగేవి. ఇది భారతీయ విజ్ఞానము. దాని ఆధారము సాధన.

సాధన ద్వారా కేవలం తమ తత్త్వ (తమస్సు) సంబంధిత భౌతిక చమత్కారాలే కాక రజ్, సత్ క్షేత్ర లాభం, ఆనందం కూడా ఎక్కువగానే ప్రాప్తించుకోవచ్చు. హాని, శోకము, వియోగము, విపత్తులు, రోగము, ఆక్రమణ, విరోధము, దెబ్బలు మొదలైన విపత్కర పరిస్థితులలో పడినప్పుడు సాధారణ మనోభూమికల ప్రజలు మృత్యుతుల్యమైన మానసిక కష్టముల బారిన పడతారు. కానీ ఆత్మశక్తులను ఉపయోగించే విద్య తెలుసుకున్న వ్యక్తులు వివేకము, జ్ఞానము, వైరాగ్యం, సాహసం ఆశ, ఈశ్వరునిపై విశ్వాసం ఆధారంగా ఈ కష్టములను నవ్వుతూ నవ్వుతూ తేలికగా దాటివేస్తారు. ఇబ్బందికర పరిస్థితులలో, సాధారణ పరిస్థితులలో కూడా ఆనందాన్ని పెంచుకునే మార్గాన్ని వెతుకుతారు, సాధిస్తారు. అటువంటి వ్యక్తి జీవనాన్ని ఎంత ఉత్సాహంగా, ఆనందంగా, మనో రంజకంగా జీవిస్తాడంటే, అలాంటి జీవితం కోటీశ్వరులకు రాసిపెట్టి ఉండదు. ఆత్మబలం వలన ఎవరి శారీరిక, మానసిక స్వాస్థ్యము (ఆరోగ్యము) చక్కగా తయారయిందో, వారు గొప్ప ధనవంతుల కన్నా కూడా అధిక ఆనందమయ జీవనం జీవించే సౌభాగ్యం అనాయాసంగా ప్రాప్తిస్తుంది. రజ (రజస్సు) శక్తి యొక్క ఉపయోగం తెలుసుకోవడం వలన కలిగే లాభము, భౌతిక విజ్ఞానం ద్వారా లభించే జ్ఞానం కన్నా అనేకరెట్లు అధిక మహత్త్వపూర్ణమైనది.

సత్తతత్త్వ లాభాలను వర్ణించటానికి మాటలు చాలవు. ఈశ్వరీయ దివ్యతత్త్వములు ఆత్మలో వృద్ధి చెందినప్పుడు దయ, కరుణ, మైత్రి, ప్రేమ, త్యాగం, సంతోషం, శాంతి, సేవాభావం, ఆత్మీయత, సత్యనిష్ఠ, నిజాయితి, సంయమము, నమ్రత, పవిత్రత, శ్రమశీలత, ధర్మపరాయణత మొదలైన సద్గుణములు వేగముగా దినాదినాభివృద్ధి చెందుతాయి. ఫలస్వరూపంగా ప్రశంస, కృతజ్ఞత, ప్రత్యుపకారం, శ్రద్ధ, సహాయం, సన్మానం లభిస్తాయి. సంతోషం లభిస్తుంది. ఇంతేకాక ఈ సద్గుణములు ఎంత మధురమైనవి అంటే ఇవి ఎవరి హృదయములో నివాసముంటాయో అతనికి ఆత్మసంతోషం అనే చల్లని ప్రవాహము నిరంతరం ప్రవహిస్తుంటుంది. అటువంటివారికి జీవనముక్తి, స్వర్గం, పరమానందం, బ్రహ్మానందం, ఆత్మ

**గెలిచిన వాడికి గతం ఉంటుంది**

దర్శనం, ప్రభుప్రాప్తి, బ్రహ్మనిర్వాణం, తురీయస్థితి, నిర్వికల్ప సమాధి సుఖం ప్రాప్తిస్తుంది. ఇదే జీవన లక్ష్యం, ఇది చూసి ఆత్మతృప్తితో ఆనంద సాగరంలో లీనమవుతుంది.

ఆత్మికం, మానసికం, ప్రాపంచిక అనే మూడు రకాల సుఖసాధనములను ఆదిశక్తి గాయత్రి యొక్క సత్, రజ్, తామసికధారల వరకు వెళ్ళగలిగే సాధకుడు తేలికగా పొంద వచ్చు. సరస్వతి, లక్ష్మి, కాళీల సిద్ధులు వేరువేరుగా ప్రాప్తించు కోవాలి. పాశ్చాత్య దేశములలో భౌతిక విజ్ఞానవేత్తలు 'క్లీం' తత్త్వం కాళీశక్తిని అన్వేషించడంలోను, ఆరాధనలోను నిమగ్న మయ్యారు. బుద్ధివాదులు, ధర్మప్రచారకులు, సంఘ సంస్కర్తలు, గాంధేయవాదులు, సమాజసేవకులు, వ్యాపారులు, కార్మికులు, ఉద్యోగులు, సమాజవాదులు, కర్మనిష్ఠులు, 'శ్రీం' శక్తి సువ్యవస్థలో, సంపాదనలో (లక్ష్మి, ధనము) నిమగ్న మయ్యారు. యోగులు, బ్రహ్మవేత్తలు ఆధ్యాత్మికవాదులు, తత్త్వ దర్శకులు, దార్శనీకులు పరమార్థవ్యక్తులు 'హ్రీం' తత్త్వం యొక్క సరస్వతీ ఆరాధన చేస్తున్నారు. ఈ మూడు వర్గములే గాయత్రి యొక్క ఆద్యశక్తి యొక్క ఒక్కొక్క చరణం యొక్క ఉపాసకులు. గాయత్రిని త్రిపద అని అన్నారు. దీనికి మూడు చరణములు ఉన్నాయి. ఈ త్రివేణి పైన చెప్పిన మూడు ప్రయోజనములను పూర్తిచేస్తుంది. తల్లి పిల్లవాడి అన్ని పనులు చేస్తుంది. అవసరం బట్టి పిల్లవాడి పాకీపనిదానిగా, వంట మనిషిగా, దాసిగా, గుర్రంగా, దర్జీగా, చాకలిగా, కాపలా మనిషిగా పనిచేస్తుంది. అలాగే ఎవరైతే ఆత్మశక్తిని ఆద్యశక్తితో జోడించే విద్య తెలుసుకుంటారో ఆమెకు తాను సుసంతతిగా అనుభవంలోకి వస్తుంది. అతను గాయత్రీ రూపంలో ఉన్న సర్వశక్తివంతమయిన మాత నుండి కావలసిన లాభం ప్రాప్తించుకుంటాడు.

ప్రపంచంలో దుఃఖానికి మూడు కారణములు ఉన్నాయి. 1) అజ్ఞానం 2) అశక్తి 3) అభావము. ఈ మూడు దుఃఖములను గాయత్రి యొక్క సూక్ష్మప్రకృతి యొక్క మూడు ధారలను సదుపయోగం చేసి నివారించుకోవచ్చు. హ్రీం అజ్ఞానమును, శ్రీం అభావమును, క్లీం అశక్తిని దూరం చేస్తాయి. భారతీయ సూక్ష్మవిద్యా విశేషజ్ఞులు సూక్ష్మ ప్రకృతిపై అధికారం సాధించి అభీష్ట ఆనందాన్ని ప్రాప్తించుకోవడానికి ఆవిష్కరించిన విజ్ఞానము అసాధారణము, అతి మహత్వం గలది. ఈ ఆవిష్కారం పేరు సాధన. గాయత్రీ సాధన అనేక సిద్ధుల జనని.

– *అనువాదం:* *ముక్కామల రత్నాకర్*

## అజ్ఞానపు గాడిదలాగా బానిసలుగా బ్రతుకవద్దు

*ఒకానొకప్పుడు అడవిలో ఒక గాడిద ఉండేది. అది స్వేచ్ఛగా జీవిస్తూ, పొట్టనిండా తింటూ, నెమరువేస్తూ ఆనందంగా కాలం గడుపుతూ ఉండేది. అదే అడవిలో ఉన్న ఒక జిత్తులమారి నక్కకు ఒక మోసపూరిత ఆలోచన వచ్చింది. ఆ నక్క నిరాశను మోముపై పులుముకొని, గాడిదను సమీపించి ఇట్లన్నది. "నీకు సంభవించనున్న ఆపదను తలచుకొని భయపడి చస్తున్నాను. నీవేమో బాగా తిని నిర్భీతిగా ఉన్నావు. ఇంతటి భయంకరమైన ఆపద మన నెత్తి మీద పడింది. విన్న గాడిద ఇలా అన్నది – "చెల్లీ! ఏమి జరిగింది? ఆ వివరాలు నాకు చెప్పు!" నక్క జవాబిస్తూ "నేను నా చెవులతో విని, కళ్ళతో చూసి వచ్చాను! చేపలంతా ఒక సేనగా తయారై, నీపై మూకుమ్మడిగా దాడిచేయనున్నాయి. వాటి ఎదుట నీవు నిలచి వాటి దాడిని ఎదుర్కొనుట అసంభవం!" అన్నది. దీనిని విన్న గాడిద భయంతో వణికిపోతూ, ఇలా వ్యర్థంగా చనిపోవుటవలన లాభమేమి? అనుకొన్నది. మరోచోటికి వెళ్ళి ప్రాణాలను రక్షించుకోవాలి! అరణ్యాన్ని వీడి, గ్రామం దారి పట్టింది. భయంతో పారిపోయి వస్తున్న గాడిదను చూసి, ఆ ఊరి చాకలి జాలితో దానిని చేరదీసి ఆశ్రయమిచ్చాడు. దాని మెడకు తాడు బిగించి ఒక మేకుకు కట్టివేశాడు. "ఏమాత్రం భయపడకు, చేపల దాడి నుండి నిన్ను నేను రక్షిస్తాను. నా ఇల్లు విడచి వెలుపలికి వెళ్ళకు. కాస్తంత నా బరువులు మోస్తూ నాకు సాయం చెయ్యి" అన్నాడు చాకలి. ఇట్టి అజ్ఞానంతో కూడిన మాటలే జనుల మానసాలలో వ్యాప్తిలో ఉన్నాయి. గాడిదలా పరావలంబులుగా జీవించుటకై జనులు సిద్ధంగా ఉన్నారు.*


*– యుగనిర్మాణయోజన, జూన్ 2017*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## ఓడిన వాడికి భవిష్యత్తు ఉంటుంది

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-62

# విచిత్రమైన ఆటంకం



కొన్నాళ్ళ తరువాత వల్లభరామ్ సందులోనే శ్రీరామ్ మరో గది అద్దెకు తీసుకున్నారు. అది దుకాణం లాంటిది. రోడ్డు వైపుకి పెద్ద పెద్ద తలుపులుం టాయి. ఆయన అక్కడ ఆయుర్వేద వైద్యాలయం మొదలుపెట్టబోతున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ఆవల్‌ఖేఢాలో ఉన్నప్పుడు కూడా ఔషధాలతో ప్రయోగం చేశారు. చుట్టుపక్కల వాళ్ళకు విషయం తెలిసింది. కొందరు దీనికి అభ్యంతరం చెప్పారు. హోలీగేట్ నుండి ద్వారకాధీశుని ఆలయానికి వెళ్ళే దారిలో మూడు ఆయుర్వేద ఔషధాలయాలు ఉన్నాయి. వాటిలోని ఇద్దరు వైద్యులు పక్క సందు లోనే ఉంటారు. ఆ కుటుంబాలే శ్రీరామ్ సంకల్పానికి అడ్డు చెప్పాయి. వారి ప్రభావంతో మిగిలినవారు కూడా వ్యతిరేకించారు.

శ్రీరామ్ ఔషధాలయం పెట్టేది ప్రజల సేవ కోసం. వ్యాపారం కోసం కాదు, ఒకరితో పోటీ పడడానికి అంతకన్నా కాదు. ఈ మాటే వారందరితో చెప్పారు. శ్రీరామ్ ఎటువంటి ఆయుర్వేద శిక్షణ తీసుకోలేదు. వైద్యవిద్య చదవలేదు. కుటుంబంలో ఎవరికీ ఆరోగ్యశాస్త్రంలో ప్రావీణ్యం కూడా లేదు. మూలికలను ఉపయోగించి చిన్న చితక ఇబ్బందులను దూరం చేయాలన్నది ఆలోచన. అభ్యంతరం చెప్పిన వాళ్ళందరికీ ఈ విషయం చెప్పారు. కానీ, వారు మాత్రం రవ్వంత కూడా సమాధానపడలేదు. శ్రీరామ్ వేరేదైనా పని మొదలుపెడితే అందుకు సహకరిస్తాం. కానీ ఔషధాలయం మాత్రం నడపడానికి వీలులేదంటూ వైద్య కుటుంబాలు కబురుపెట్టాయి. ఆరోగ్య సేవను వ్యాపారంగా చేసే ఉద్దేశ్యం లేదని ప్రతిసారి జవాబిచ్చారు. ప్రజలకు సేవ చేస్తానే గానీ వారి నుండి ఏమీ ఆశించను. క్లిష్టమైన రోగాలకు వైద్యం చేయనన్నారు. అటువంటి రోగులు ప్రతిష్ఠాత్మక ఔషధాలయాలకే వెళ్తారు. ఎంత స్పష్టంగా చెప్పినా ఎవరికీ మింగుడుపడటం లేదు.

ఒకరోజు తెల్లవారక ముందే భగవాన్‌దాస్‌గారు శ్రీరామ్ ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఆయన ఉపాసన చేసుకుంటు న్నారు. పూర్తయ్యేంతవరకు అరుగు మీద కూర్చుని వేచి ఉన్నారు. తాయీజీ వచ్చి పలకరించారు. కుశల ప్రశ్నలయ్యాక ఆయన వచ్చిన పని గురించి చెప్పారు. మీ అబ్బాయిని ఒప్పించండి అంటూ మొదలుపెట్టారు. ఔషధాలయం తెరవకుండా చూడండి, లేకపోతే మాకు చాలా ఇబ్బందిగా ఉంటుంది అన్నారు.

"అయ్యామీరెందుకు కంగారుపడుతున్నారు. శ్రీరామ్‌కు నాడి చూడడం కూడా రాదు. ఏదో జలుబు, తలనొప్పి, దగ్గు, అజీర్తి వంటి వాటికి మందులిస్తాడు. మందులు కూడా కాదు, వంటింటి చిట్కాలతో పని కానిస్తాడు. మీ పనికి ఎలాంటి ఇబ్బంది రాదు" అని తాయీజీ జవాబు ఇచ్చారు.

"అమ్మ! మీకు తెలియనిది కాదు. శ్రీరామ్ హస్తవాసి గురించి మాకు తెలుసు. మాలలు తిప్పీ తిప్పీ చేసిన జపంతో వచ్చిన పుణ్యం ఉందే, దాంతో ఆయన మట్టిని మందుగా ఇచ్చినా పుచ్చుకున్నవాళ్ళ జన్మ ధన్యమైనట్టే" అంటూ బాధ వెళ్ళబోశారు భగవాన్‌దాస్.

"అంటే రోగులు బాగుపడకూడదంటారా?" అన్నారు తాయీజీ. ఆయన – "భేషుగ్గా బాగుపడాలమ్మ. మీ చిరంజీవి ప్రజలని ఆశీర్వదించాలి. తల మీద చేయి పెట్టాలి. ఆశీస్సులు పంచమనండి, మందులు మాకు వదిలేయమనండి" అన్నారు.

సంభాషణ కొనసాగుతూనే ఉంది. శ్రీరామ్ ఉపాసన ముగించుకుని బయటకొచ్చారు. కొన్ని మాటలు ఆయన చెవిన పడ్డాయి. దానికి జవాబు చెప్తూ, "అయ్యా! నా చేతిలో ఎలాంటి సిద్ధులు, చమత్కారాలు లేవు. ఒకవేళ ఉన్నా, నేను వాటిని రోగాలు నయం చేయటానికి వాడను. మీరు నిశ్చింతగా ఉండండి. రెండో విషయం ఏంటంటే, నేను ఏ కారణం వల్లనైనా నా నిర్ణయాన్ని మార్చుకోను. రోగుల సేవ చేయాలన్నది సంకల్పం. దానిని పూర్తిచేసి తీరతాను. కానీ, ఎవరైనా సామాన్య సమస్యతో వచ్చినా, గంభీరమైన రోగాల సంకేతాలు కనిపిస్తే మాత్రం వారిని తప్పకుండా మీ దగ్గరకే పంపిస్తాను.

**ఆరాటం ముందు పోరాటం ఎంత?**

ఇది నా మాట. అంతేగానీ వైద్యం అందకుండా ఊరికే ఉండ నివ్వను."

ఈ వాగ్దానం భగవాన్‌దాస్‌ని తృప్తిపరచలేదు. "మరో విషయం కచ్చితంగా గుర్తుంచుకోండి. ఏ మందు వేసుకోకుండా, వైద్యుల దగ్గరకు వెళ్ళకుండా, ఇంట్లోనే ఉండి ఇబ్బందిపడుతూ ఉండేవాళ్ళను మాత్రమే నేను చూస్తాను."

ఈ వాగ్దానం కూడా వైద్య సమాజ ప్రతినిధి భగవాన్‌దాస్ గారిని సంతృప్తిపరచలేదు. మందులతో ఉపచారం చేసే విషయాన్ని మర్చిపోవాలంటూ ఖరాఖండీగా చెప్పున్నారు. శ్రీరామ్ కూడా అంతే దృఢంగా తన నిర్ణయాన్ని సమర్థించు కున్నారు. చివరికి భగవాన్‌దాస్‌గారు మరో ప్రస్తావనతో లేచి నిలబడ్డారు. "మీరు ఈ చోటు వదిలేసి ఇంకెక్కడికైనా వెళ్ళండి, మా నెత్తిన పాలు పోసినవాళ్ళవుతారు. దానికి అవసరమైన ఏర్పాట్లు కావాలంటే కూడా మేమే చేసిపెడతాం. ఇంకో చోట మీరు ప్రజలకు ఆరోగ్య సేవ చేయండి. ఇక ఏ అభ్యంతరాలు చెప్పకండి." ఈ ప్రస్తావనను శ్రీరామ్ తప్పుపట్టలేకపోయారు. ఇక్కడ కాకపోతే మరో చోట. కొంతసేపు ఏదో ఆలోచించారు. తాయీజీ వైపు చూసి ఇలా అన్నారు, "సరే, మేము వేరే చోటకు మారిపోతాం. కానీ ఇక్కడ మూడు నెలలు సేవ చేయనివ్వండి. ఆ తరువాత మేము ఇక్కడ నుండి మారిపోతే, మీ మాట నిలబడుతుంది, ఒక పేద బ్రాహ్మణుడిని వెళ్ళగొట్టారన్న అపఖ్యాతి మీకు రాదు" అంటూ నవ్వారు శ్రీరామ్. భగవాన్ దాస్‌కి కూడా నవ్వొచ్చింది. ఆ నవ్వుకి మనసులోని క్లేశమంతా తొలిగిపోయినట్టు హాయిగా అనిపించింది ఆయనకి.

శ్రీరామ్ అనుకున్న చోటనే ఔషధాలయం మొదలుపెట్టారు. ఆయుర్వేద మందులిచ్చే చిన్నపాటి వైద్యులు కూడా ఆయన దగ్గరకొచ్చారు. వాళ్ళు కూడా ఒత్తిడి చేయడానికి ప్రయత్నిస్తే శ్రీరామ్ ఒకటే జవాబిచ్చేవారు. "నేను ఎవరితోను పోటీ పడటం లేదు. డబ్బివ్వలేని రోగులకు నాటువైద్యం చేస్తానంతే. ఎవరు భయపడనక్కర్లేదు. ఎవరైనా భయపెట్టి ఇక్కడినుంచి తరిమేయా లని ప్రయత్నించినా, కదిలేది లేదు."

పొద్దున 10 నుండి 12 గంటలవరకు మాత్రమే శ్రీరామ్ ఔషధాలయంలో కూర్చునేవారు. దానికి 'గాయత్రి ఆరోగ్య కేంద్రం' అని పేరు పెట్టారు. బోర్డు, బ్యానరులాంటివేమీ పెట్ట లేదు. ఎవరో అడిగితే నోటినుండి ఠక్కున ఆ పేరు వచ్చింది. అదే పేరు అందరి నోట ఆడింది. అక్కడి వైద్యులందరికీ శ్రీరామ్ విద్వత్తు గురించి తెలుసు, పరిచయస్తులు ఎంతమందు న్నారో తెలుసు. అందుకే వారి వ్యాపారం దెబ్బతింటుందేమో అని భయపడ్డారు. కానీ ఆయన రోజుకి రెండు గంటలు మాత్రమే కూర్చోవడం చూశాక భయం తగ్గింది. శ్రీరామ్ ధార్మిక, సాహిత్య కార్యకలాపాలు కూడా ఇదివరకు లాగానే కొనసాగించడం చూసి మరింత స్థిమితపడ్డారు. వాటి కోసం మనుషుల రాకపోకలు పెరిగాయి.

భగవాన్‌దాస్‌కు మాటిచ్చిన విధంగా మూడు నెలలు పూర్తి కాగానే శ్రీరామ్ ఆ ఇల్లు విడిచిపెట్టారు. చౌక్ దగ్గర మరో ఇల్లు తీసుకుని ఉండసాగారు. ఘియామండి (ఇప్పటి అఖండజ్యోతి కార్యాలయం)కి 500 మీ. దూరంలో ఈ ఇల్లు ఉంది. యమునకి చాలా దగ్గర. మేడ మీద నుండి నదీ ప్రవాహం చూడవచ్చు. తాయీజీకి నచ్చింది. యమునానది, ద్వారకాధీశుని ఆలయం రెండూ దగ్గరే. కానీ రానురాను ఈ ఇల్లు చిన్నదైంది. అఖండజ్యోతి పాఠకులు తరచూ వచ్చేవారు. 'గాయత్రీ ఆరోగ్య కేంద్రం' కూడా విస్తరించుకుంది. జలుబు, దగ్గు, జ్వరం మొదలైన బాధలతో 8-10 మంది రోజూ వచ్చేవారు.

## మృత్యువాతపడ్డ భార్య

1942 మే నెలలో కుటుంబం మీద పిడుగు పడింది. సరస్వతీదేవికి ఉన్నట్టుండి ఆరోగ్యం దెబ్బతిన్నది. మధ్యలో ఎప్పుడు శ్రమ పడినట్టు ఫిర్యాదు చేయలేదు. యజ్ఞాలు, హవనాలు, మందులు దంచడం, నూరడం, అఖండజ్యోతి ప్యాకింగ్, లేబుల్స్ అంటించడం అన్నిటిలోను సహాయం చేసే వారు. ఆరోజు కూడా అన్ని పనులు చేశారు. మధ్యాహ్నానికి ఏదో చిన్న ఇబ్బంది అనిపించింది. ప్రాకృతిక ఉపచారాలను నమ్మే ఆవిడ, చిన్న చిన్న ఇబ్బందులను అసలు పట్టించుకునేది కాదు. కడుపు నొప్పి వచ్చిన సంగతి ఇంట్లో ఎవరికీ చెప్పనైనా లేదు. రెండు రోజుల తరువాత ఇబ్బంది ఎక్కువైంది. అప్పుడు కూడా చెప్ప లేదు. ఆవిడముఖంలో బాధను శ్రీరామ్ గమనించారు. అడిగితే గానీ చెప్పలేదు. అప్పటికీ మందులు వేసుకోవడానికి ఒప్పుకోలేదు.

మూడో జాముకి ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. అమ్మ నొప్పితో తల్లడిల్లడం పిల్లలు మౌనంగా చూస్తున్నారు. పరిస్థితి బాగుపడకపోవడం చూసి శ్రీరామ్ వైద్యుడి దగ్గరకెళ్ళారు.

**దృఢ చిత్తం ముందు దురదృష్టం ఎంత?**

ధనీరామ్‌గారు నాడి నిపుణులు. రోగితో మాట్లాడకుండా, కేవలం నాడి చూసి శరీరం పరిస్థితి చెప్పేయగలరు అని అందరు అంటుండేవారు. వారికి దూతనాడి కూడా తెలుసు అనేవారు. కబురు తీసుకుని వచ్చినవారి నాడి చూసి కూడా రోగి పరిస్థితి కనిపెట్టేవారట. ధనీరామ్‌గారు వచ్చారు. సరస్వతీదేవి నాడి చూశారు. ఆవిడ కడుపులో పుండైంది. అది పగలబోతోంది. ఈశ్వరుడిని స్మరించడం తప్ప వేరే దారి లేదు. ఆవిడను సాగనంపడానికి ఏర్పాట్లు చేసుకోండి అన్నారు.

రోగి గురించి నిరాశాజనకంగా మాట్లాడటం నైతిక వైద్య విలువలకు విరుద్ధం. కానీ శ్రీరామ్ పట్ల గౌరవం, అభిమానం ఉండడం వల్ల, ఆయనకి నిజం తెలియాలి అన్న ఉద్దేశ్యంతో చెప్పారు. అందుకే ధనీరామ్‌గారు "దేవుడు తలుచుకుంటే ఆవిడకు నయం అవుతుంది... అయ్యో! అయినా ఇవన్నీ నేను చెప్పకూడదు. ఏమైంది నాకు? ఎందుకైంది?"

ఆయన మాటలు వింటూనే శ్రీరామ్ చలనం లేకుండా నిలబడిపోయారు. నోట మాట రాలేదు. తాయీజీ పరిస్థితి కూడా అదే. ఇక పిల్లల పరిస్థితి చెప్పనక్కర్లేదు. చావుకి ముందే ఇంట్లో శోక వాతావరణం ఏర్పడడం చూసి ధనీరామ్ బాధపడ్డారు. తన వల్లనే ఇదంతా అనుకున్నారు. శ్రీరామ్ తనలోని బాధను దిగమింగుకుని, ధనీరామ్‌గారిని కూడా ఊరడించారు. "ధనీరామ్‌గారు, మీరే అలా డీలాపడిపోతే ఎలా? మమల్ని ఎవరు ఓదారుస్తారు. పిల్లల పరిస్థితి చూడండి, గుండె పగిలి పోయింది, వారిని సముదాయించండి."

తరువాత సరస్వతీదేవి దగ్గరకు వెళ్ళి ఆవిడను పలకరించారు, "ఎలా ఉంది? కాస్త ఉపశమనం ఉందా?"

"బాగైపోతుంది. మీరు బాధపడకండి" అంది. మరేవో కొన్ని సాధారణ ఇంటి విషయాలు మాట్లాడి నిద్రలోకి జారుకుంది. వైద్యుడిని పంపించేశారు శ్రీరామ్. ఎనిమిదిన్నర, తొమ్మిది గంటల కల్లా పిల్లలు పడుకున్నారు. తాయీజీ, శ్రీరామ్ మేలుకునే ఉన్నారు. తాయీజీ పిల్లలను చూసుకుంటున్నారు. శ్రీరామ్ సరస్వతీదేవి పక్కనే కూర్చుని ఏదో చదువుకుంటున్నారు. మధ్యమధ్యలో ఆవిడను చూస్తున్నారు. ఆవిడ నిశ్శబ్దంగా పడుకున్నారు.

రాత్రి పదిన్నర, పదకొండు గంటలకు ఆవిడ ఉన్నట్టుండి లేచింది. వాంతి వస్తునట్టు అనిపించింది కాని ఏమీ రాలేదు. అలా రెండుసార్లు లేచి, మళ్ళీ మంచం మీద ఒరిగిపోయింది. శ్రీరామ్ వంక చూసింది. 'ఓం, దయ, శ్రద్ధ ఎక్కడున్నారు' అని అడిగింది.

పిల్లలు పడుకున్నారు అన్నారు శ్రీరామ్. విని ఊరుకున్నారు. కానీ తరువాత తాయీజీకి నమస్కరించుకోవాలి అనిపిస్తోంది అన్నారు. పక్క గదిలోంచి తాయీజీ వచ్చి పక్కన నిలబడ్డారు. ఆవిడ పాదాలు తాకడానికి ప్రయత్నించింది. కానీ లేవలేక పోయింది. తాయీజీ స్వయంగా దగ్గరకొచ్చారు. సరస్వతీ దేవి తాయీజీని, శ్రీరామ్‌ను కళ్ళారా చూసుకుంది. మెల్లిగా మాట్లాడారు – "మీకు నేను ఏం చెప్పగలను. కాని చేతులు జోడించి ఒక్క మాట చెప్పాలనుంది. ఏదైనా జరగకూడనిది జరిగితే పట్టించుకోకండి" ఇలా అంటూ ఆగిపోయింది. ధైర్యం కూడబెట్టుకుంటున్నట్టు అనిపించింది. కొంతసేపు అయ్యాక, "పిల్లలకి తల్లి లోటు తెలియనివ్వకండి. ముగ్గురు తల్లి మీదే ఆధారపడ్డవాళ్ళు." ఇవే ఆవిడ చివరి మాటలు.

### బాధ్యతా యోగం మొదలైంది

ఇల్లు, కుటుంబం పనుల పట్ల ఇంతకు ముందు కూడా శ్రీరామ్ పెద్దగా అభిరుచి చూపించేవారు కాదు. ఆయన ఇంటి బాధ్యతలనెప్పుడు చిన్నచూపు చూడలేదు. అలా అని ధ్యాసంతా దాని మీదే ఏమీ ఉండేది కాదు. అనుబంధానికీ, ఉదాసీనతకీ మధ్యమార్గాన్ని ఎన్నుకునేవారు. మధ్యమార్గాన్ని ఎన్నుకున్నా ఎప్పుడూ ఉదాసీనతవైపే మొగ్గుచూపేవారు. భార్య మృత్యువు ఆయన్ని మరింత ఉదాసీనంగా మార్చింది. అంతిమ సంస్కారాలు, మరణానంతర సంస్కారాలు పూర్తయ్యాక తాయీజీ శ్రీరామ్‌లో ఈ మార్పు బాగా గమనించారు. చిన్నప్పటి నుండే భోజనం విషయంలో చాలా నిష్ఠతో క్రమశిక్షణ పాటించేవారు. జొన్నరొట్టె, ఆవుపాలతో చేసిన మజ్జిగ తప్ప వేరే ఏదీ తీసుకునేవారు కాదు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నప్పుడు నియమాలను పాటించడం కుదిరేది కాదు. ఎంత కష్టపడ్డా, కొన్నిసార్లు ఏర్పాట్లు కుదిరేవి కాదు. కానీ 'అఖండజ్యోతి' ముద్రించాలని నిర్ణయం తీసుకునే రెండు సంవత్సరాల ముందు నుండి మళ్ళీ ఆహార నియమాలు పాటించారు. ముందునుండే ఆయన జీవితం తపస్వులు, విరాగుల వలే ఉండేది. కానీ దాంపత్య జీవితంలో శూన్యం ఏర్పడినప్పటి నుండి మనుష్యులతో మాట్లాడడం, కలుపుగోలుగా ఉండడం తగ్గింది. అన్యమనస్కంగా ఉండేవారు.

**ఎదురీత ముందు విధిరాత ఎంత?**

రచనలు, సేవ, లోకకళ్యాణం కోసం సాధన మొదలైన వాటిలో మునుపటి లాగానే సక్రియంగా ఉండేవారు. కానీ ఇందులో కూడా తాయీజీ చిన్న మార్పు గుర్తించారు. నలుగురితో మాట్లాడేటప్పుడు ఎప్పుడు నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారు. చమత్కారంగా మాట్లాడే మాటలు రోగుల ముఖాలలో బాధని పోగొట్టేవి, హాయిగా నవ్వేసేవారు. కోడలు వెళ్ళిపోయాక శ్రీరామ్ మాట్లాడడం, నవ్వడం, నవ్వించడం మానేసినట్టు తాయీజీ గమనించారు. మౌనంగా తన పని చూసుకునేవారు. కలవడానికి వచ్చినవారితో గంభీరంగా మాట్లాడేవారు. రోగులు వస్తే లక్షణాలు కనుక్కుని మందులిచ్చి, పథ్యం చెప్పి పంపించేసేవారు. ఇది వరకు శ్రీరామ్‌ను చూసినవారు ఈ మార్పు బాగా గమనించారు. బాగా పరిచయమున్నవారైతే తాయీజీతో నేరుగా చెప్పారు కూడా.

ఇంట్లో కూడా చాలా నిశితంగా పరిశీలించడం మొదలు పెట్టింది. ముగ్గురు పిల్లలు ఆవిడ దగ్గరే పడుకునేవారు. తండ్రితో కలుపుగోలుగా ఉండలేకపోతున్నారు. అసలు మొదటినుండే తండ్రితో పెద్దగా చనువు లేదు. ఇప్పుడు తల్లి కూడా లేకపోయే సరికి వయసుకు మించి ఎదిగిపోయారు. తండ్రిగారు జపం, రచనలు, పలకరింపులకి చాలా సమయం కేటాయించేవారు. తమకి తాము కూడా ఏ సమయాన్ని కేటాయించుకునేవారు కాదు. అంతకు ముందు కూడా వాళ్ళు నానమ్మతోనే ఉండేవారు. భార్య పోయాక ఇంట్లో చిన్నపాటి పనులు కొన్ని ఆయనే స్వయంగా చూసుకోవడం మొదలుపెట్టారు. మొదట్లో తాయీజీ అడ్డుకుంది. అప్పుడు ఏమీ మాట్లాడకపోయినా, ఆవిడ చూడనప్పుడు ఆ పనులు చేసేవారు. ఒక్కోసారి తనవి, పిల్లలివి, తాయీజీవి కూడా బట్టలు కనిపిస్తే ఉతికేసేవారు.

ఒకరోజు అలా బట్టలు ఉతికేటప్పుడు ఆయన ఇబ్బంది పడుతున్నట్టు అనిపించింది ఓం ప్రకాశ్‌కి. వెంటనే ఆయన దగ్గరకెళ్ళి – "నాన్నగారు నాకివ్వండి, నేను చేస్తాను" అన్నాడు. కొడుకుని చూసి శ్రీరామ్ వారించి, వెళ్ళి చదువుకోమన్నారు. ఈ పనైపోతుందిలే అన్నారు. కాని ఓం ప్రకాశ్ "లేదు నాన్న గారు, నాకివ్వండి, చిటికెలో చేసేస్తాను, మీరు అలిసిపోతున్నారు" అన్నాడు.

– *'చేతనా కీ శిఖర్ యాత్ర'* పుస్తకం నుంచి

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

---


# యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**

**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఇతర SBI బ్రాంచీల నుండి మా ఎకౌంట్‌కు చెక్ ద్వారా ఉచితంగా ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. ఇతర బ్యాంకుల నుండి కూడా NEFT ద్వారా ఉచితంగా డబ్బును పంపించవచ్చు. Cheque, Draft, Payable at Hyderabad ద్వారా కూడా డబ్బును పంపించవచ్చు. తరువాత బ్యాంక్ చలానా కాపీని మాకు పూర్తి వివరములతో పంపించగలరు. మా ఎకౌంట్‌లోని ఇతర బ్యాంకుల నుండి క్యాష్‌గా పంపినప్పుడు అదనంగా అదనంగా రూ. 50/- కలిపి పంపవలసి ఉంటుంది. M.O. ద్వారా కూడా డబ్బులు పంపించవచ్చును. అలా పంపించినప్పుడు మీ వివరములు ఈ క్రింది నెంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయగలరు.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**

బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**

ఖాతా నెం.: **32506416087**

IFSC Code: **SBIN-0013272**

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట, అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు – 500018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175


ప్రయత్న లోపం లేకుంటే విజయాన్ని ఎవరు ఆపలేరు

శ్రీకృష్ణాష్టమి ప్రత్యేకం

# కృష్ణం వందే జగద్గురుమ్

**వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।**
**దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥**



శ్రీకృష్ణుడు జగత్తు అంతకూ గురువు. ఎందుకంటే – యుగ సమస్యల పరిష్కారానికై ఒక విరాట్‌సంకల్పంతో ఆయన అవతరించారు. మన పెద్దలు మరే అవతారాన్ని జగద్గురువుగా పరిగణించలేదు. శ్రీకృష్ణుడిని యోగిరాజుగా, మహాయోగిగా కూడా పేర్కొన్నారు.

పరమపూజ్య గురుదేవులు అఖండజ్యోతి ఆగస్టు 1969 సంచికలో అవతార ప్రక్రియ గురించి ఇలా వ్రాశారు. "జన మానసంలో అవాంఛనీయతల పట్ల తిరుగుబాటు ఇదే అవతారం యొక్క వాస్తవిక స్వరూపం... ఈశ్వరీయ శక్తులు ఒక ఆలోచనా ప్రవాహంగా, ఒక కార్య ప్రవాహంగా అవతరిస్తాయి. సమకాలీన సమస్యలను పరిష్కరిస్తాయి." జగద్గురువు స్థాయి గల అవతార చేతనతో పరమపూజ్య గురుదేవులు కూడ ఈ భూమికి దిగివచ్చారు. ఆయన జ్ఞాన– కర్మ–భక్తి–నీతులను ఉపదేశించారు. అంతేకాదు. ఎన్నోన్నో ఉపాసనా పద్ధతులను రూపొందించారు. వాటిని యుగధర్మంతో జోడించి, ఆరాధన యొక్క బ్రహ్మాండం యొక్క సేవా సాధన యొక్క విరాట్ రూపం ఇచ్చారు. భావ విప్లవం ద్వారా అసుర చింతనను ఓడించేందుకై ఆయన భారీఎత్తున జ్ఞాన యజ్ఞాన్ని నిర్వహించారు. అన్నిటినీ మించి–గాయత్రికీ, యజ్ఞానికీ ఏర్పడిన సంకుచిత పరిధులను తొలగించి వాటిని సామాన్య ప్రజానీకానికి అందుబాటులోనికి తెచ్చారు. అవతార స్థాయి కలిగిన, జగద్గురువు స్థాయి కలిగిన చేతనయే" ఈ పనిచేయ గలుగుతుంది. గురుదేవులు ఇలా అన్నారు. "ప్రతి అవతారమూ ఆనాటి వికృతులను తొలగించడంలో నాయకత్వం వహించింది. అయితే దానివెనుక అపారమైన జనశక్తి ఉంది. అసురత్వాన్ని సమగ్రంగా నిర్మూలించే సామర్థ్యం కలిగిన చండిక జనశక్తియే." ఇక్కడ సమగ్రంగా నిర్మూలించడం అనే పదాన్ని ప్రత్యేకంగా గమనించాలి. పూర్తిగా నిర్మూలించక పోతే అది తిరిగి తలెత్తుతుంది. పరమపూజ్య గురుదేవులు కూడా 'ఎర్ర కాగడా' అనే ప్రతీక క్రింద ఒక విరాట్ జనశక్తిని నిర్మాణం చేశారు. తద్వారా సమగ్ర విప్లవానికి రూపురేఖలను తీర్చిదిద్దారు. భావ సంగ్రామం అనే మహాభారత యుద్ధం ద్వారా నవయుగం యొక్క సంకేతాలను సాకారం చేయాలని చెప్పారు. "ఈనాడు పార్థసారథి యొక్క ఉద్వేగాన్ని స్పష్టంగా అనుభూతి పొంద గలుగుతున్నాము" – అని ఆగస్టు 1969 నాటి అఖండ జ్యోతి భావ విప్లవ ప్రత్యేక సంచికలో వారు వ్రాశారు. అర్జునుని విషాదాన్ని, వైకల్యాన్ని చూచి ఆయన ఎంతగా ఉద్విగ్నత పొందారో అంతగా అనుభూతి పొందేవారు అరుదు గానే ఉంటారు. మనం ఈ వాక్యాన్ని అర్థం చేసుకోగలిగితే – పార్థుని సారథి అయిన శ్రీకృష్ణుడు పరమపూజ్యగురుదేవులేననీ, ప్రజ్ఞాపరిజనులమైన మనమంతా అర్జునులమనీ, మనం విషాదంతో, వైకల్యంతో శూద్రస్థాయి జీవనం గడపడం చూచి వారు ఎంతగా వ్యధ చెందినది మనం గుర్తించగలుగుతాము. "కృష్ణం వందే జగద్గురుమ్" అని పైన చెప్పబడింది. తన కాలంలోని సమస్యలను ఆచరణ–తపస్సు–క్రియల ద్వారా, తన ఆధ్యాత్మిక శక్తిద్వారా పరిష్కరించి ఇతరులకు నమూనాగా రూపొందిన వ్యక్తినే జగద్గురువు అని పిలవాలి. శ్రీకృష్ణుడు బాల్యంలో బకాసురుణ్ణి, పూతనను వధించారు. గోవర్ధన పర్వతాన్ని నిలిపి గోపబాలకులను రక్షించారు. సాందీపని ఋషి యొక్క పుత్రులను విముక్తి చేశారు. కంస, చాణూరులను వధించారు. జీవితమంతా ఆయన ఈ లీలనే చూపుతూ వచ్చారు. సమాజంలో అవాంఛనీయ ధోరణులు పెరగ కూడదనేదే, ప్రజలకు వాటినుండి రక్షణ అందాలనేదే ఆయన లక్ష్యంగా సాగింది. రాజసూయ యాగంలో తనకు నచ్చినవిగా అతిథుల కాళ్ళు కడగడం భోజనం తర్వాత విస్తళ్ళు ఎత్తివేయడం అనే పనులను స్వీకరించి, అహంకారాన్ని రూపుమాపాలని

**నువ్వు ప్రయత్నమే చేయకుంటే ఆ దేవుడు కూడా ఆదుకోలేడు**

బోధించడం ఆ స్థాయి గల మహాపురుషులకే సాధ్యపడుతుంది. ఇంతలో అగ్రపూజ కార్యక్రమం వచ్చింది. భీష్మ పితామహుడు కృష్ణుడిని పేర్కొన్నారు. కర్మయోగి అయిన శ్రీకృష్ణుడే జగత్ పురుషుడు కాగలుగుతాడు.

కృష్ణ భగవానుని మరో ప్రత్యేకత భక్తవాత్సల్యం. మయ్యర్పితమనోబుద్ధిర్ యో మద్భక్తః స మే ప్రియః (నా భక్తులను నేను ప్రేమిస్తాను) అని గీత (12/14) లో ఆయన అన్నారు. మహాభారత యుద్ధం తర్వాత జరిగిన ఒక సంఘటన. యుధిష్ఠురుడు శ్రీకృష్ణుణ్ణి కలుసుకోవడానికి వెళ్ళారు. శ్రీకృష్ణుడు తన అంతఃపురంలో ధానం చేస్తున్నారు. బయట యుధిష్ఠిరుడు వేచిచూస్తూ కూర్చున్నారు. ఆయన బయటికిరాగానే ఆయనను మీరే పరమాత్మ, ధ్యానం చేయవలసిన అవసరం ఏముంది, అని అడిగారు. శ్రీకృష్ణుడు ఇలా అన్నారు: నేను నా భక్తుడైన భీష్మపితామహుణ్ణి గురించి ధ్యానిస్తున్నాను. ఆయన ఇప్పుడు అంపశయ్యపై ఉన్నారు. నీతికి కట్టుబడడం వల్ల – భీష్మునిపై బాణం వేయమని మేము చెపుతూ వచ్చాం. భీష్ముడు సైతం తప్పనిసరి అయి యుద్ధం చేశారు. అయితే లోలోపల ఆయనకు మా పరమాత్మ భావం పట్ల అనురక్తి ఉంది. ఆయన ఇప్పుడు అంపశయ్యపై ఉండి మమ్మల్ని ధ్యానిస్తూ తన బాధను తొలగించుకుంటున్నారు.

ఎంతటి విలక్షణమైన సమయం! భక్తుడు భగవానుణ్ణి ధ్యానిస్తున్నారు. భగవానుడు భక్తుణ్ణి ధ్యానిస్తున్నారు. భగవానునికి తన భావనలను సమర్పించిన భక్తునికి భగవానుడు దాసుడు అవుతాడు. సదా అతడిని స్మరిస్తూ ఉంటాడు. రక్షిస్తూ ఉంటాడు.

పరమపూజ్య గురుదేవులు కూడా ప్రేమ సాగరులు. పూజ్య గురుదేవులు నివసించే గది వెనుక గోశాల ఉంది. ఆవునూ, దూడనూ వేర్వేరు శాలలలో చూచినప్పుడల్లా, దానిని రానివ్వనప్పుడల్లా వేదనతో ఆయన కళ్ళ నుండి కన్నీళ్ళు కారేవి. అఖండజ్యోతిలో వారిలా వ్రాశారు. తన దూడకు దూరమైన ఆవు చెందే వ్యధ దాని అరుపు చూచినవారికీ, విన్నవారికి – ఆవుకన్నా భావనామయుడూ, మోహమమతలు నిండిన ప్రాణి అయిన మనిషి మరింత ఆర్ద్రంగా ఉండాలో అర్థమవుతుంది. వీతరాగులమనీ, పరమహంసలమనీ, స్థిత ప్రజ్ఞులమనీ, సమదర్శులమనీ మేము ఎన్నడూ చెప్పుకోలేదు. మా ప్రత్యేకత ఒక్కటే. మమత ఆత్మీయతల స్నేహ సద్భావనల పాలు ఇతరులకన్నా కొంచెం ఎక్కువగా ఉండడం. ఇదే మమ్మల్ని రోదించేటట్లు చేస్తుంది. అలాంటి వ్యధలో స్థిరంగా ఉండడం పాషాణ హృదయులకూ పరమహంసలకూ సాధ్యమవుతుంది. మనస్సుపై అదుపులేని వ్యక్తి ఏమి చేయగలడు. ఈ ప్రేమ. ఆత్మీయత భక్తవత్సలతలలో పరమపూజ్య గురుదేవులు శ్రీకృష్ణునికి సమ ఉజ్జీగానిలుపుతాయి.

మహాభారత యుద్ధం తర్వాత శ్రీకృష్ణుడు పాండవులతోపాటు గాయాలతో అంపశయ్యపై ఉన్న భీష్మపితామహుని వద్దకు వచ్చాడు. పాండవులకు తత్వజ్ఞానాన్ని, రాజధర్మాన్ని ఉపదేశించవలసిందిగా ఆయనను కోరాడు. అందుకు భీష్ముడు ఇలా అన్నాడు. ప్రభూ మిమ్మల్ని మించిన ఉపదేశకులు ఎవరున్నారు? ఆ గౌరవాన్ని నాకివ్వాలన్ని మీ ఉద్దేశ్యం. నాకీ విషయం అర్థమయింది. కానీ, నా శరీరం గాయాలతో నిండి ఉంది. మనస్సు నిలకడగా లేదు.

అప్పుడు కృష్ణ భగవానుడు భీష్ముని తలను చేతితో నిమురుతూ ఇప్పుడు మిమ్మల్ని యోగసమాధిలోకి పంపాను. ఇక బాధ ఏమాత్రం ఉండదు అన్నాడు. అప్పుడు భీష్ముడు ఇచ్చిన ఉపదేశం మహాభారతంలోని శాంతిపర్వంగా రూపొందింది. భక్తవత్సలుడైన భగవానుడు తన శిష్యునిపై ఇలా కృపను కురిపిస్తాడు.

కృష్ణ భగవానుని జీవితం అనంతం, అతి విస్తృతం. ఆ జీవితంలోని వివిధ కోణాలను వివరిస్తూ స్వామి శ్రీరామకృష్ణానంద మహారాజ్ (స్వామి వివేకానందుని సహచరులు) ప్రాఫెట్ ద కింగ్‌మేకర్ (ప్రవక్త, పాలకుల నిర్మాత) అనే గ్రంథాన్ని రచించారు. రాజులను సింహాసనాలు ఎక్కించిన శ్రీకృష్ణుడు ఎన్నడూ తాను రాజ్యం చేయలేదు. జన్మకర్మమే దివ్యం అని భగవానుడు గీతలో చెప్పాడు. అనగా నా జన్మ, కర్మ రెండూ పరమ పావనము, అలౌకికము అయినవి. ఆయన బాల్యలీలల నుండి అనురోద్ధార రూపం వరకు భక్తవత్సల రూపం వరకు యశోదనూ గోపికలనూ గోపబాలకులనూ ప్రేమించే రూపం వరకు అంతటా దివ్యత్వం కానవస్తుంది. పరమపూజ్య గురుదేవుల జీవితంలో కూడ ఇలాంటి ఘట్టాలు అనేకం కనిపిస్తాయి.

కృష్ణ భగవానుడు ఎక్కడ సద్గుణం కానవచ్చినా దానిని

**ఒక మంచి పుస్తకం వెలుగు దివ్వెలా పనిచేస్తుంది**

గౌరవించాడు. ప్రశంసించాడు. దుర్యోధనుని పట్ల కర్ణుని మైత్రిని ఆయన ప్రశంసించాడు. యుద్ధంలో కర్ణుని యుద్ధ కౌశల్యం చూచి దానిని మెచ్చుకున్నాడు. ఈ ప్రత్యేకత భగవంతుని స్థాయి కలిగిన సత్తాలలోనే ఉంటుంది.

భగవానుడు మహాభారత యుద్ధంలో సారథి. సారథి అంటే అర్థం మన మనస్సు యొక్క కళ్ళేమునే భగవానుని చేతుల్లో పెట్టడం. శ్రీకృష్ణునికి మరోపేరు హృషీకేశుడు. హృషీక అనగా ఇంద్రియాలు. ఈశ అనగా స్వామి హృషీకేశుడు అనగా ఇంద్రియాలకు అంతఃకరణకు స్వామి. మనం ఆయనను ఈ రూపంలో ప్రతిష్ఠించుకుంటే, మన జీవన నౌకకు ఆయన సారథిగా చేసుకుంటే మనకు ఎక్కడా ఎలాంటి కష్టమూ ఉండదు. అయితే అందుకు మనం అర్జునులం కావాలి. రిజు+న శబ్దం నుండి అర్జున శబ్దం ఏర్పడింది. అనగా వంకర లేనివాడు. సూటిగా, సరళంగా ఉండేవాడు. సందేహం వస్తే దానిని స్పష్టంగా బయటపెట్టేవాడు. అర్థం కాకపోతే నేను శిష్యభావంతో మిమ్మల్ని శరణుజొచ్చాడు. నాకు కర్తవ్య మార్గాన్ని ఉపదేశించండి. (శిష్య స్నేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్) అని సూటిగా అడిగేవాడు. ఈ భావన మనస్సులో ఏర్పడి ఆచరణలోకి వస్తే భగవానుని గీతా సందేశం ప్రారంభమవుతుంది.

శరణాగతి గీతలోని రహస్యం. అహంకారాన్ని కర్మల యొక్క ఫలాన్ని కర్మ ఆసక్తిని సమర్పణ చేయాలనే భగవానుడు అర్జునునికి పలుమారులు బోధించాడు. మనమంతా జీర్ణించు కోలేము. నేటి మహాభారత యుద్ధం ఆనాటి మహాభారత యుద్ధం కన్న పెద్దది. ఆనాడు దేశ విదేశాలలోని ప్రజలు ఆ యుద్ధంలో పాల్గొన్నారు. నేడు రెండు ప్రపంచ యుద్ధాలు జరిగి మూడవ యుద్ధానికి అంచున మనం నిలచి ఉన్నాం. కనుక శ్రీకృష్ణుని సందేశం నేటి యుగానికి అక్షరాలా అన్వయిస్తుంది. పరమపూజ్య గురుదేవులు జీవన విద్యపై ఇచ్చిన నిర్దేశక సూత్రాలు శ్రీమద్ భగవద్గీత యొక్క వివరణలే. కనుక మనం భగవద్గీత భాష్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా శ్రీకృష్ణుని యొక్క గురుదేవుల యొక్క వ్యక్తిత్వాలను, కర్తృత్వాలను, వారి జీవితాలలోని ప్రతి ఘటాన్ని అవగాహన చేసుకోవాలి. మనం అర్జునులం కాగలిగితే భగవద్గీత మన ప్రతిశ్వాస నుండి పలుకుతుంది.

## నేతాజీ సమయస్ఫూర్తి

*సాహసం అనేది ఉంటే ప్రతికూల పరిస్థితులలో కూడా సంతులనాన్ని కోల్పోకుండా పనులు సాధించవచ్చు. సుభాష్‌చంద్రబోసు మొదటి తరగతి పెట్టెలో పయనిస్తూ ఉండగా ఆ కదిలే బండిలోకి హఠాత్తుగా ఒక విదేశీ మహిళ ఎక్కి "నీ దగ్గరున్న విలువైనవన్నీ నోరు మూసుకొని నాకిచ్చేయి. లేదా గోలచేసి నీవు నన్ను అల్లరిపెడుతున్నావని చెప్పి అందరిముందు నిన్ను అప్రతిష్ఠ పాలు గావిస్తాను" అని బెదిరించింది. క్షణాలలో గొప్ప నిర్ణయాలు తీసికోగల మేధస్సు, సమయస్ఫూర్తి కలిగిన బోసుకు వెంటనే ఆమె ఎత్తుగడ ఏమిటో అర్థమైంది. చెవిటివానిలా బ్రహ్మాండంగా నటించసాగాడు. తనకేమీ అర్థం కావటంలేదని దయ ఉంచి మీరు చెప్పేదేమితో కాగితం మీద వ్రాసి ఇమ్మని వినయంగా కోరేడు. ఆమె ఆతృత వల్ల బధిరుని మాటను గట్టిగా విశ్వసించి ఏ మాత్రం సందేహించకుండా ఆ విషయం కాగితం మీద వ్రాసి చేతిలో పెట్టింది. అంతే, బోసు పకాపకా పెద్దగా నవ్వసాగాడు. సాక్ష్యాధారాలతో సహా ఆమె మోసం అతని గుప్పెటలో ఉండటం వలన ఆమె అరవాలన్నా అరవలేదు. ఈ మహాపురుషుడు తన చాకచక్యం, మేధాశక్తి ద్వారా ఎంత దారుణమైన మోసాన్నైనా ఇలాగే క్షణంలో చిత్తుచేసి పడేసేవాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

## పండుగలు

**ఆగస్టు 2017**

07-08-2017 రాఖీపూర్ణిమ

15-08-2017 శ్రీకృష్ణ జన్మాష్టమి, స్వాతంత్ర్య దినోత్సవం

25-08-2017 వినాయక చవితి

**సెప్టెంబర్ 2017**

06-09-2017 వందనీయ మాతాజీ భగవతీదేవిశర్మ మహాప్రయాణం

10-09-2017 వందనీయ మాతాజీ భగవతీదేవిశర్మ జయంతి

30-09-2017 విజయదశమి

**మనను మనము నిజాయితీగా విశ్లేషించుకోవాలి**

## సమయదానమే యుగధర్మము - 8

# జన జాగరణ - మన కర్తవ్యాలు

ఈ ప్రపంచంలో అతి మహత్త్వపూర్ణమైన సామర్థ్యం గలవారికి లోటులేదు. కానీ విధివైపరిత్యం ఏమిటో వారు సుషుప్త (నిద్ర) స్థితిలో కునికిపాట్లు పడుతుంటారు. మనుష్యజీవితం నిర్వహణ ఎలాగోలా నడుస్తుంటుంది, వారి సామర్థ్యములు అంతవరకే క్రియాశీలంగా ఉంటాయి. ఏదైనా విశేషమైన లక్ష్యములు సాధించాలంటే విశేష ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది.

సముద్రంలో అంతులేని సంపద అనాదికాలం నుండి దాగి ఉన్నది. దానిని గురించి ఎవరికి తెలియదు. కానీ ప్రజాపతి యొక్క సలహాపై దేవదానవులు కలిసిమెలిసి ప్రయత్న పురుషార్థము చేసినప్పుడు 14 రత్నములు బయటకు వచ్చాయి. వీటివలన ధరిత్రి నుండి స్వర్గం వరకు అపారమైన చమత్కార వంతమైన సంపదలతో నిండిపోయింది. మనిషిని మించిన వాడు ఎవరు లేరని శాస్త్రములు చెప్తున్నాయి. మనిషి విచిత్ర స్థితిని చూసిన దార్శనీకులు "మనిషి దారితప్పిన దేవత" అని అంటారు. కానీ మనిషిని నడిపించగల నేర్పరియైన మావటి వాడు లభించితే వాడు ఎంతో ఎత్తుకు ఎదుగగలడు. తన సమర్థతతో అందరిని ఆశ్చర్యపరచగలడు.

ఇబ్బందికరమైన ఒత్తిడి, పైకి ఎదగాలన్న తపన ప్రతివారికి ఉంటుంది. కానీ దైవత్వానికి ప్రతీక, ప్రతినిధి అయిన మానవుని క్షమతను మేల్కొల్పే ప్రయత్నాలు ఎక్కడా కనిపించడం లేదు. నారదుని వంటి వారు జాగృతి కార్యక్రమంలో లీనమయి ఉంటే మానవ పరాక్రమము, దైవీ అనుగ్రహము, సుయోగము సహజంగా జరిగి తీరుతాయి. పరివర్తనతో కూడిన వాతావర ణము తయారు అయ్యేది. దీనిని యుగపరివర్తన వంటి కాయకల్పమని అనేవారు.

పాలను కాచినప్పుడు మీగడ తేలి పైకి వస్తుంది. మహాకాలుని ఝుంకారం వినగలిగే చెవులు ఉన్నవారు ఈ రోజులలో ఏమి చేయకుండా ఉండలేరు. విజిల్ శబ్దం వినగానే సైనికులు డేరాలను వదలి మైదానంలో వరసలలో నిలబడతారు. ఆదేశం రాకముందే యూనిఫాం వేసుకుని, బెల్టు పెట్టుకుని తయారుగా ఉంటారు.

జన జాగరణ కొరకు ప్రచండ పురుషార్థం చేయడమే నేటి యుగధర్మము. ఇదే జరుగుతున్నది, ప్రతిభలు ఏకత్రిత మవుతున్నాయి. జనజాగరణ కొరకు ఒక సువ్యవస్థితమైన ప్రణాళిక తయారుచేయబడుతున్నది. వికృతంగా ఉన్న ఆలోచనా విధానం మారుతుంది. తల్లక్రిందులుగా ఉన్న దిశను వదిలివేయవలసివస్తుంది. సవ్యమైన, శ్రేయస్కరమైన ఆలోచనా పద్ధతి అవలంబించబడుతుంది.

ఆలోచనల పరివర్తన 'బ్రైన్ వాషింగ్' స్థాయిలో జరగాలి అంటే దాని పరిధి ప్రపంచమంతట నివసించే వ్యక్తులు సుమారు 600 కోట్లయితే, దీని కొరకు పెద్ద అడుగు వేయవలసి వస్తుంది. ఈ పనిలో వానరములు, ఎలుగుబంట్లు వలె చిన్నాపెద్దా తమ తమ పద్ధతులలో యోగదానం అవసరమవు తుంది. ఆలోచనలను వికసింపచేసేందుకు వ్రాతపని, మాట్లాడటం దృశ్య శ్రవ్య (audio visual) అన్ని మాధ్యమాలను ఉపయోగించాలి. ఈ సందర్భములో యుగసాహిత్యమును జనసామాన్యమునకు పరిచయం చెయ్యాలి. కార్ల్‌మార్క్స్, రూసో వంటి క్రాంతి లేఖకుల చమత్కారం, పరిణామము గడిచిన రోజులలో ప్రత్యక్షముగా చూశాము.

యుగసాహిత్యమును సంచి పుస్తకాలయాల ద్వారా, జ్ఞానరథముల ద్వారా ఇంటింటికి, చదువుకున్నవారి దగ్గరకు పంపించే ప్రయత్నం జరుగుతున్నది. దీనితోపాటే చదువులేని వారికి ఈ సాహిత్యమును వినిపించే ప్రయత్నం జరగాలి. ఈ పని ముఖ్యంగా హిందీ భాషా ప్రాంతములలో జరుగుతున్నది. రాబోయే రోజులలో దేశం యొక్క, విశ్వం యొక్క సమస్త భాషలలో సముద్రపు పొంగువలె ఉప్పొంగి కోలాహలం చేయడం చూడగలరు.

శ్రేయస్కరమైన లక్ష్యముల కొరకు తక్కువ ఖర్చుతో దీప యజ్ఞముల పెద్ద ప్రణాళిక నడుస్తున్నది. యుగ చేతనత్వం యొక్క వెలుగును పంచిపెట్టే క్రమం వేగంగా నడుస్తున్నది.

**మనలోని ప్రతిభను సానబెడితే సాధించలేనిది ఏమి ఉండదు**

ఆలోచనాపరులైనవారి సభలు కూడా వేరుగా జరుగుతాయి. దీని ఆధారంగా ఇంగితజ్ఞానము, బాధ్యత, నిజాయితి, సాహస ములను జీవితములో అనుసరించి చూపెట్టగలిగే ప్రతి జాగృత ఆత్మ యొక్క ప్రాణం సంతోషిస్తుంది. టేపురికార్డర్ ద్వారా (సిడి ద్వారా) ఉద్బోధనలను, సంగీతమును ఇంటింటికీ పంపించే ప్రణాళిక తయారవుతున్నది. అభినయంతో నిండిన సంగీతం యొక్క ప్రణాళిక క్రొత్త రూపంలో స్వీకరించబడింది. వీడియో వంటి ప్రభావం చూపగలిగే కార్యక్రమం కూడా చేపట్టాలి.

సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు. భారతదేశం కూడా కాలానుగుణ్యంగా అనేకసార్లు విశ్వప్రగతికి మార్గదర్శనం చేసిందనేదానికి ఇతిహాసమే సాక్షి. ఈసారి కూడా అదే జరుగబోతున్నది. భారతదేశవాసులే కాక నవయుగం యొక్క ఆలోచనాధారలో ప్రపంచమంతట ఉన్న ప్రతిభావంతులు రాబోయే రోజులలో సర్వతోముఖ పరివర్తన కొరకు తమ తమ పద్ధతులలో యోగదానం ఇవ్వడం చూడగలము.

ప్రచార ప్రక్రియతోపాటు లోకసేవ కార్యక్రమం ముఖ్య మైనది. క్రైస్తవ మిషనరీలు ఈ పద్ధతిలోనే ఒక సహస్రాబ్దిలో కనీసం ప్రపంచంలోని సగభాగంలో తమ మతాన్ని వ్యాప్తి చేశారు. యుగనిర్మాణం యొక్క జన జాగరణ యోజనకు రెండు రకాల కార్యక్రమాలు ఉన్నాయి. ఒకటి విధేయాత్మకమైనవి (చేయవలసినవి), రెండు నిషేధాత్మక కార్యక్రమములు

## చేయవలసిన పనులు

1. ప్రతి చదువుకున్నవాడు కనీసం ఇద్దరు చదువులేనివారికి చదువు చెప్పాలి. ఇలా చేయకపోతే దేశంలోని నిరక్షరాస్య తను పోగొట్టలేరు. దీని అంతర్గతంగా పుస్తకాల ప్రణాళిక కూడా కలసి ఉంటుంది. దీనివలన వర్తమాన సమస్యల స్వరూపం, సమాధానం తెలుసుకునే అవకాశం లభిస్తుంది.
2. నారీ జాగరణ: ఇది దేశ జనాభాలోని సగమును అధోగతి నుండి బయటకు తీసి సమర్థత అనే సింహాసనంపై కూర్చో బెట్టడం వంటి క్రాంతిమయ అడుగు. 21వ శతాబ్దము నారీ ప్రధానంగా ఉంటుంది. ఆమె భూమిక ప్రతి క్షేత్రం లోను నరుని కంటే ప్రముఖమైనదిగా ఉంటుంది. అందు వలన వారిని శిక్షణ, ఆరోగ్యం, స్వావలంబనం దృష్టితో సరియైన స్థాయికి తీసుకువెళ్ళాలి. ఇందుకొరకు ఆమెకు రెండు రకాల సౌకర్యాలు ఇవ్వాలి. 24 గంటలు చేసే ఇంటి పనుల నుండి కొంచెం విరామం ఇవ్వాలి. ఇలా చేయడం వలన ఆమె తన ప్రగతి కొరకు ఏదో ఒకటి చేయగల అవకాశం లభిస్తుంది. రెండవది ఆమెకు సంతా నోత్పత్తి యొక్క భారం తక్కువ చేయడం. ఇలా చేయడం వలన జనసంఖ్య వృద్ధిపై అంకుశం వేయవచ్చు. మహిళలు వారి యోగ్యతలను పెంపొందించుకునేందుకు అవకాశం కూడా ప్రాప్తించుకోవచ్చు.

ఈ రెండు పనులు చేయవలసిన పనుల ప్రణాళికలో తమ తమ స్థితికి అనురూపంగా చేతిలోకి తీసుకోవాలి. ఈ ఉపాయాలకు కూడా సంతోషంగా సమయదానం ఇవ్వాలి.

ఏవిధముగా సృజనాత్మక పుణ్య కార్యక్రమాలు అనేకం ఉంటాయో, అదేవిధంగా దుష్ప్రవృత్తి నిర్మూలన క్షేత్రంలో అసంఖ్యాక కార్యములు చేయవలసి ఉన్నది. వీటిలో రెండు ప్రముఖమైన పనులు ఉన్నాయి. ఒకటి మత్తుపదార్థముల నివారణ, రెండవది వివాహములలో జరుగుతున్న అపవ్యయము. సమాజం దిగజారిపోవడానికి, దరిద్రం రావడానికి ఈ రెండే ప్రముఖ కారణములు, **త్రాగుడు త్రాగను, తాగనీయను అనే ప్రతిజ్ఞ చేయాలి.** అది చేసే హాని గురించి జనులందరికి అవగతం చెయ్యాలి. దానిని వదిలించేందుకు ఉపాయాలు స్వీకరించాలి. వాటిని కార్యాన్వితం చేయాలి.


ఇదేవిధంగా వివాహాలలో చేసే ఖర్చు మనలను దరిద్రులుగా, మోసగాళ్ళుగా చేస్తుంది. యుగనిర్మాణ యోజన ప్రచార ప్రక్రియ మాత్రమే కాకుండా నిరక్షరాస్యత నిర్మూలన, వివాహాలు ఖర్చు లేకుండా చేయాలనే కార్యక్రమాలు కార్యకర్తలు చేపట్టాలి.

మహాకాలుడు కొంచెం సమయాన్ని యాచించాడు. ప్రతిభా వంతులు ఈ క్లిష్ట సమయంలో ఉదారంగా సమయాన్ని ఇచ్చి అనుకరణీయమైన, అభినందనీయమైన సాహసం చూపిస్తారని ఆశిస్తున్నాము.

– *అనువాదం:* *ముక్కామల రత్నాకర్*

**కలలు కనండి - సాకారం చేసుకోండి**

# మాతృత్వంతోపాటు చేపట్టబడిన అలౌకిక దాంపత్యము



అమ్మ యొక్క మాతృత్వము ఆవల్‌ఖేడాలో కాలు పెడుతూనే పొంగిపొరలింది. అప్పగింతలయ్యాక పెళ్ళి వారు ఇక్కడికే తిన్నగా వచ్చారు. పూర్వికుల గడప, తన ఆరాధ్యుని జన్మస్థలము మరియు ఆయన యొక్క ప్రారంభిక తపఃస్థలంలోకి పెళ్ళికూతురిగా పల్లకీ దిగారు మాతాజీ. ఎఱుపురంగు జరీ అంచు గల ఎంబ్రాయడరీ చీర కట్టుకున్న అన్ని సౌభాగ్య చిహ్నాములతో దిగుచున్న ఆమె సాక్షాత్తు జగదంబ వలెనే అనిపించుచున్నది. హిమవంతుని పుత్రిక పార్వతి తన పితృగృహము వీడి భగవాన్ భోలేనాథ్‌తో పాటు తన అత్తవారింటికి వచ్చే దృశ్యము ఆ క్షణములలో సాకారమైనది. బాలమండలి శివ గణముల వలె ఆమెవంక అత్యంత శ్రద్ధ మరియు ఆశ్చర్యములతో చూస్తున్నారు. తాఈజీ (ఆమె అత్త మరియు పూజ్యగురుదేవుల తల్లి) శుభ శకునములు గల అన్ని లోకాచారములు పూర్తిచేయుటలో నిమగ్నమై ఉన్నది. ఇది పూర్తిచేయుటకు చాలా సమయము తీసుకున్నది. ఒకదాని తర్వాత ఒకటి అన్ని రీతిరివాజులు, విధివిధానాలు పూర్తైపోయాయి.

ఆ తరవాత ఆమెను ఒకచోట చాప వేసి కూర్చోపెట్టారు. పిల్లలు ఆమెను ఇంకా చుట్టబెట్టే ఉన్నారు. ఈ పిల్లలలో దగ్గర బంధువుల పిల్లలతో పాటు దయ మరియు ఓంప్రకాష్ కూడా ఉన్నారు. శ్రద్ధ అప్పటికి చాలా చిన్నపిల్ల. ఆమె ఈ బాలమండలిలో లేరు. కేవలము ఆశ్చర్యము మాత్రమే ఈ పిల్లల మనస్సుల్లో మెదులుతున్నది. దీనికి వశీభూతులై వారిలో వారు చాలా నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. అప్పుడే దయా ముందుకు వెళ్ళి దగ్గరగా నుంచుంది. అప్పుడు భగవతి ఆ చిన్నారి చేయి పట్టుకుని తన దగ్గర కూర్చోబెట్టుకుని చాలా ప్రేమగా ఇలా అన్నది. "అమ్మా! నేను నీకు అమ్మను తల్లీ! నా నుంచి నీవు ఏ విషయములోను, ఏవిధముగాను సంకోచించ వలసిన పనిలేదు."

ఈ మాటలు దయకు చాలా ధైర్యానిచ్చింది. చాలా మెల్లగా తడబడుతున్న స్వరంతో దయ "అమ్మా" అని పిలిచింది. ఈ ఒక్క పిలుపు తల్లీ, పుత్రికల ఇరువురి అంతర్ భావనలను ఏకీకృతము చేసింది. అపరిమితమైన తీయదనము వారి జీవితములో, ఇంటిలో వెదజల్లబడినది. అమ్మ ఉన్నది అన్న భావన ఎంత ఆశ్వాసన, బలము, విశ్వాసము, నిశ్చింతత, ఆలంబనము, చేయూత ఇస్తుందో దయ యొక్క ముఖ మండలము మీద స్పష్టం గా కనిపించింది. ప్రసన్నంగా ఉన్న దయను చూసి అది తెలుసుకోవచ్చు. ఈ కొద్దికాలం లోనే ఆమె తన మనస్సులో మా! – మా! అనే ఏకాక్షరీ మహామంత్రము స్మరించుచున్నది. 'మా' యొక్క ప్రేమ యొక్క తరళత ఆమె యొక్క అంతరంగమును భావభరితం చేసినది. ఆమెను చుట్టుకుని, ముదుచుకొని దగ్గరగా కూర్చుంది.

దయ యొక్క ఈ భావముద్ర ఓంప్రకాష్‌ను ఆశ్చర్యంలో పడవేసింది. అతనికి తన చెల్లెలు అకస్మాత్తుగా ఇంత ఆనందంగా ఎందుకు కనిపిస్తున్నదో అర్థము కాలేదు. కొన్ని నిమిషముల లోనే ఆమె మీద ఏ చమత్కారము జరిగింది? ఇలా ఆలోచించుకుంటూ అతను కూడా ధైర్యము చేసి ముందుకు వెళ్ళాడు. అప్పుడు అతను నిక్కరు, చొక్కా వేసుకుని ఉన్నాడు. కొన్ని అడుగులు వేసి ఆమె దగ్గరికి వెళ్ళి నుంచున్నాడు. ఇంతలో తాఈజీ అటువైపు నుంచి వెళుతోంది. తన స్వభావానుసారము ఆమె పెద్దగొంతుకతోనే అన్నది. "నుంచుని ఏమి చూస్తున్నావు. వంగి మీ అమ్మ కాళ్ళు ముట్టుకో." తాఈజీ గొంతుక విని కొద్దిగా జంకుతూ ఓంప్రకాష్ వెళ్ళి పాదాలకు నమస్కరించాడు.

అతను చరణములను స్పృశిస్తున్నప్పుడే మాతాజీ "నీవు ఏ తరగతి చదువుతున్నావు?" అని అడిగారు. చాలా నెమ్మదియైన గొంతుకతో ఓంప్రకాష్ ఈ ప్రశ్నకు జవాబిచ్చాడు. "నా పేరు ఓం ప్రకాష్. నేను ఏడవతరగతి చదువుతున్నాను."ఈ

**ఎన్ని కష్టాలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి**

ప్రశ్న జవాబు మాతాపుత్రులిద్దరినీ భావముల కోమల తంతువులతో కలిపింది. తన ప్రథమ కలయిక యొక్క అనుభూతులను గుర్తుచేసుకుంటే ఈనాడు కూడా ఓంప్రకాష్‌గారి కళ్ళు చెమ్మగిల్లుతాయి. ఆయన ఏమంటారంటే "కుపుత్రో జాయతే క్వచిదపి కుమాతా నభవతి" (చెడ్డ పుత్రుడు ఉండవచ్చు. కాని చెడు అమ్మ ఉండదు.) అనేదానిని సార్థకము చేస్తూ అమ్మ తన యొక్క ఈ పుత్రుని మీద ఎప్పుడు కరుణ చూపించేది. లెక్కపెట్టలేనన్ని తప్పులను నవ్వుతూ విస్మరించేది. ఆ క్షమా మయి అన్ని అపరాధాలను క్షణంలో క్షమించి, నిరంతరము తన స్వభావమైన కోమలత, మృదులత నాకు పంచిపెట్టేది."

ఓంప్రకాష్ మరియు దయాలతో కలసి 'మా' శ్రద్ధను కలిసింది. తన యొక్క ఈ పుత్రికకు పూర్తి ప్రేమను పంచింది. ఆమె మీద అపరిమితమైన ప్రేమను కురిపించింది. కొద్ది రోజులలోనే ఈ ముగ్గురు 'మా'తో కలిసిపోయారు. మాతాజీ కూడా తన హృదయంలో స్థానమిచ్చింది. ఇంటి వాతావరణము ఆమె వచ్చిన కొన్ని రోజులలోనే మారిపోయింది. ఆకురాలు కాలంలోనే వసంతదేవత వచ్చిందా! అన్నట్లు అనిపించింది. ఇంటి పనులు, పిల్లలను చూసుకొనుటలో ఒక విశిష్టత కనిపించేది. అన్ని వైపులా సౌందర్యము, సువ్యవస్థ కనిపించింది. ఈ మార్పు ప్రతి ఒక్కరి మనస్సును, ప్రాణాలను, అంతఃకరణాలను స్పృశించింది. ఈ స్పర్శ అనేకులలో సజల భావనలను రేకెత్తించింది.

తన ఆరాధ్యుని అంతఃచేతన, అంతర్ భావనలతో మొదటే కలిసినది. ఆమె ధ్యానదృశ్యముల యొక్క ప్రతి క్షణములో, ప్రతి నిమిషములో ఒక అపూర్వమైన అలౌకికత ఉన్నది. ఇది సామాన్య వివాహితులైన దంపతుల కలయిక కాదు. పతి పత్ని యొక్క సామాన్య సంసారికుల కలయికలాంటి స్థూలమగు లౌకికదృష్టి ఇక్కడ లేదు. పరమపురుషుడు, ప్రకృతిమాతలాంటి అద్భుతమైన కలయిక ఇది. ఈ కలయికలో సర్వేశ్వరుడైన సదాశివుడు మరియు భగవతి మహాశక్తి యొక్క అలౌకికత ఉన్నది. నూతన సృష్టి యొక్క సృజన బీజారోపణ ఈ కలయికలోని క్షణములోనే జరిగినది. ఈశ్వరుడిని గురించి ధ్యానము మరియు చర్చల మధ్యలో వీరిరువురు కలిసి కూర్చున్నప్పుడు భవిష్యత్తులో జరగబోవు నూతన అవకాశాలను గురించి చర్చించుకునేవారు. ఆమె ఆరాధ్యదైవము ఆమెను ఈ క్రొత్త భూమికకు తయారుచేస్తున్నారు.

ఇది గురుదేవుల యొక్క తీవ్రసాధనా కాలము. గాయత్రీ మహాపురశ్చరణల శృంఖల తమ అంతిమ చరణములలో ఉన్నది. అఖండజ్యోతి మాసపత్రిక నియమపూర్వకముగా వెలువడుచున్నది. ఈనాటి విశాలగాయత్రి పరివారము అప్పుడు అఖండజ్యోతి పరివారముగా అంకురించుచున్నది. దీనిని సవ్యముగా పోషించడానికి, పాలించడానికి, భరించడానికి ఒక తల్లి అవసరము. 'అమ్మ' అనగా ఒకరిద్దరు సంతానానికి జన్మనిచ్చుటకే పరిమితము కాదు. జన్మ ఇచ్చినంత మాత్రాన ఎవ్వరూ అమ్మ కాలేరు. తన సంతానాలకు శ్రేష్ఠసంస్కారాలను ఇచ్చేదే అమ్మ. వారిలో తమ ప్రాణములు పోసి వారి భావ వికాసము చేయాలి. వారిని విశ్వ ఉద్యానవనంలోని శ్రేష్ఠమైన పుష్పములు గల వృక్షములుగా వికసింపజేయుటకు అవసరమైన ఎరువు మరియు నీటి వ్యవస్థ చేయాలి.

ఈ పని అంత సులువైనది కాదు. దీనికొరకు అత్యంత కఠోరసాధన మరియు ఆధ్యాత్మిక ఉపార్జిత ఆత్మశక్తి అవసరము. తన రాబోవు కాలానికి అనుసారంగా మాతా భగవతీ ఈ రోజులలో ఇదే చేయుచున్నది. తన ఆరాధ్యుని సంసర్గములో అనేక గోప్య మంత్రములు, బీజాక్షరాలు, యోగము యొక్క గహన ప్రక్రియల జ్ఞానము ఆమెకు ఈకాలములోనే ఇవ్వబడినది. ఆమె యొక్క తన విశిష్టమైన సాధనలు ఒకప్పుడు తపస్వులలో ఉత్తముడైన శ్రీరామ్ అఖండ సాధనా దీపప్రజ్వలనం చేసినప్పటి నుంచే మొదలైనాయి. కానీ ఇక్కడ ఆమె సాధనాకాలము చాలా తక్కువ ఉన్నది. అఖండజ్యోతి యొక్క ప్రచురణ వల్ల పరమ పూజ్యగురుదేవులు మథురలో ఉండటము అనివార్యమైనది. మొదట కొన్ని సంచికలు ఆగ్రానుంచి ప్రచురించిన తరవాత ఇప్పుడు అఖండజ్యోతి మథుర నుంచి ప్రచురింపబడుతోంది. సాధకులు, జిజ్ఞాసువులు, ఆగంతకుల యొక్క రాక పెరిగింది. మథురలో ముందు తీసుకున్న అద్దె ఇల్లు ఇరుకైనది. నూతన పరిస్థితులకు అనురూపంగా నేడున్న అఖండజ్యోతి ఇల్లు అద్దెకు తీసుకున్నారు. మాతా భగవతీ, తాయీజీ, పిల్లలు తన ఆరాధ్యునితో పాటు అఖండజ్యోతి సంస్థాన్ (నేడు ఘియా మండీలో ఉన్న ఇల్లు) యొక్క ప్రాంగణములోకి వచ్చి నివసించారు.

**ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలి**

### కుటుంబానికే కాదు అందరికీ మాతాజీయే

అఖండజ్యోతి సంస్థానం యొక్క ప్రాంగణంలో మాతా భగవతీ అందరికీ "మాతాజీ" అయింది. చుట్టుప్రక్కలున్న పిల్లలేకాక, అఖండజ్యోతి కార్యాలయానికి వచ్చి వెళ్ళే వారందరు ఆమెను మాతాజీ అనటము మొదలెట్టారు. ఇక్కడికి రాగానే ఆమె అనేక బాధ్యతలను ఒకేసారి తీసుకున్నది. ప్రేమ, సదాశయములు, ఓర్పు, శ్రమశీలత యొక్క ప్రకాశ కిరణముల పుంజము ఆమె వ్యక్తిత్వమును ఇంకా ఎక్కువగా కాంతివంతము చేయసాగింది. ఆమె అందరికంటే చివర పడుకుని అందరికంటే ముందు లేచేది. ఆమె నిద్రలేచే సమయము నిశ్చితముగా ఉన్నప్పటికి నిద్రకు ఉపక్రమించే కాలము స్థిరంగా ఉండేది కాదు. ఎందువల్లనంటే ప్రతిరోజు క్రొత్తక్రొత్త పనులు వచ్చి కాలాతీతమయ్యేది. ఏపనీ లేకపోయినా సమయా సమయాలు చూడకుండా వచ్చే ఆగంతకులకు భోజనవసతి ఏర్పాట్లు చేయటంలోనే సరిపోయేది. రాత్రి పడుకోవటానికి ఆలస్యము అగుటకు కారణమేమైనా ఆమె కచ్చితంగా 3 గంటలకు నియమ పూర్వకంగా మేలుకొనేది.

నిద్రలేచాక నిత్యకర్మలు పూర్తిచేసుకుని ఆమె యోగసాధనకు కూర్చునేది. ఆమె పూజావేదిక మీద ఎల్లప్పుడు పరమపూజ్య గురుదేవులు మరియు గాయత్రీమాత చిత్రము ప్రతిష్ఠితమై ఉండేవి. వారే ఆమె యొక్క జీవిత సర్వస్వము, ఆరాధ్యదైవాలు. తన ఆరాధ్యదైవమైన భర్తలోనే ఆమె జగన్మాత గాయత్రి యొక్క అనుభూతి పొందేది. ఈ పటము యొక్క పంచోపచారపూజ చేశాక ఆమె కొన్ని విశిష్ట ప్రాణాయామ ప్రక్రియలు చేసేది. అవి పూర్తైపోగానే గాయత్రీమంత్ర జపం ఆమె అంతశ్చేతనలో జరగటం మొదలెట్టేది. ఆమె కఠిన సాధనలతో జాగృతము, చైతన్యము అయిన గాయత్రీమహామంత్రం యొక్క ప్రతి బీజాక్షరము యొక్క విస్ఫోటన ఆమె అస్తిత్వం యొక్క విభిన్న గుహ్యకేంద్రములలో జరుగుతూ ఉండేది. ఆమె చేసే గాయత్రీ జపము ఈ అద్భుత ప్రణాళికలో జరిగేది. అనంతరం ఆమె ధ్యానస్థమయ్యేది. ధ్యానము యొక్క భావదశలో తన మహాశక్తి స్వరూపము యొక్క పరిపూర్ణతలో నిమగ్నమై ఉండేది. సాధన యొక్క ఈ క్రమము సాధారణంగా సూర్యోదయము వరకు జరిగేది.

ఆ తరువాత ఇంటి పనులు, కార్యాలయము యొక్క మిగతా బాధ్యతలు మొదలయ్యేవి. ఈ పనులను కూడా ఆమె కచ్చితంగా యోగసాధనల కంటే తక్కువగా తీసుకునేది కాదు. ఏ పనైనా సరే అది చిన్నదైనా పెద్దదైనా నిజమైన భక్తిభావముతో భగవానునికి అర్పణచేసి చేస్తే అది నిజమైన యోగసాధనగా మారుతుంది అని చెప్తుండేది. తద్వారా ధ్యానసమాధిలో జరిగేటట్టే యోగవిభూతులు ప్రకటితమౌతాయి. మాతాజీ యొక్క ఈ మాటలు శబ్దములు మాత్రమే కాదు. ఆమె అనుభూతుల యొక్క సత్యదర్శనము. తను చేసే ప్రతిపని ద్వారా ఆమె నిరంతరము సాధన చేస్తూ ఉండేది. స్వార్థము మరియు అహంకారముల విషాక్తత వల్ల సాధారణముగా మనము చేసే ప్రతిపని కూడా కలుషితమౌతుందని ఆమె అంటుండేది. ఈ రెండు ఉన్నంత వరకు ఏ పని కూడా యోగముగా మారదు. వీటిబదులు తమ ఆరాధ్యుని పట్ల నిష్ఠ మరియు సమర్పణా భావనలు పనిలో నిమగ్నమైతే అంతా మారుతుంది. అటువంటి స్థితిలో ఎవరైనా ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా అంట్లు తోమడము, చీపురుపట్టి ఊడవటము, కడగటం లాంటి తుచ్ఛము అనుకునే పనులు కూడా ధ్యానసాధనగా మారతాయి.

ఈ అనుభవం యొక్క సత్యము ఆమె జీవితంలో రోజు ప్రకటితమయ్యేది. అంట్లుతోమటం, ఇల్లు ఊడ్చటంతో పనులు మొదలెట్టి వండటం, అందరికి వడ్డించటం కూడా తానే స్వయంగా చేసేవారు. ఇంట్లో కుటుంబసభ్యులే కాక వచ్చి పోయేవారు ఉండేవారు. వచ్చేవారి సంఖ్య కచ్చితంగా తెలిసేది కాదు. ఒకసారి 5,10 మందైతే ఒకొక్కసారి 30,40 మంది వరకు అయ్యేవారు. ఎలాంటి పరిస్థితైనా వీరందరికీ భోజన వ్యవస్థ అన్నపూర్ణ వలే మాతాజీయే చేయవలసివచ్చేది. తన యొక్క ఈ బాధ్యతలను ఆమె చాలా ఉత్సాహంగా నిర్వర్తించేది. భోజనము చేసేవారికి వండిన భోజ్యపదార్థాలతో పాటు తల్లి ప్రేమ యొక్క అలౌకిక ప్రేమ కూడా లభించేది. నిరంతరము శ్రమపడాల్సివచ్చేటటువంటి ఇంటి పనులలో ఎప్పుడు ఆమె విసుక్కోవటం కానీ, కోపగించుకోవటం కాని చేయటం ఎవరు చూడలేదు. స్నేహమయ చిఱునవ్వుతో ఆమె నిరంతరం పనులలో నిమగ్నమై ఉండేవారు.

– అనువాదం : డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ

**అంగ వైకల్యం ఎంతమాత్రం శాపం కారాదు**

శిష్య సంజీవని-5

# తనను తాను సమర్పించుకున్నప్పటికీ ఇంకా ఏదో ఇప్పుడే ఇచ్చేట్టుగా చేస్తుంది మనస్సు

'శిష్య సంజీవనీ'ని నియమముగా సేవించడము వలన శిష్యులకు క్రొత్త ప్రేరణ లభిస్తుంది. వారు తమ హృదయము లలో సద్గురువు యొక్క ప్రేమ ప్రవాహమును అనుభూతి చెందుతుంటారు. వారి అంతరంగ చేతనత్వములో నిత్యనూతన మైన దివ్య అనుభూతులనే అంకురము ఉదయిస్తూ ఉంటుంది. 'సద్గురువు యొక్క నిజమైన శిష్యులు' కావలెననే కోరిక మన దేవ పరివార్‌లోని పరిజనులకు ఎప్పుడు ఉంటుంది. 'కానీ అది ఏవిధముగా సాధ్యపడుతుంది?' అనే ప్రశ్న వారిని ఎప్పుడూ కలతకు గురిచేస్తుంటుంది. హృదయములో అశాంతి, అంత రంగభావనలలోని వేదనల మధ్య ఏ సమాధానము కోసమైతే వారు అన్వేషిస్తున్నారో అది ఇప్పుడు లభించింది. శిష్య సంజీవనీ ద్వారా శిష్యులకు, వారి శిష్యత్వమునకు కొత్త ఊపిరిలు లభిస్తున్నాయి. ఇందులోని ప్రతి ఒక్క సూత్రము లోను సారగర్భితమైన ఆదేశములున్నాయి. శిష్యత్వమనే మహా సాధనలో పారంగతులైన సిద్ధపురుషుల అనుభూతులు ఈ సూత్రములలో ఇమిడి ఉన్నాయి. ఈ సూత్రములలోని ప్రతి ఒక్క అక్షరము ద్వారా చెప్పబడిన అంశములలో లోతైన సార్ధకత ఉన్నది. సార్ధకమైన ఆదేశములను జారీచేస్తున్న ఆ స్వరము ఈ క్రింది విధముగా నాలుగవ సూత్రమును అందిస్తున్నది.

'ఉత్తేజమును పొందాలనే కోరిక వదలిపెట్టు. ఇందుకోసం ఇంద్రియజన్యమైన అనుభవముల ద్వారా పాఠములను నేర్చుకో! వాటిని పరిశీలించు. ఆత్మవిద్యకు చెందిన బోధన ఈవిధము గానే ప్రారంభమవుతుంది. ఈ ప్రకారముగా ఈ మార్గములోని మొదటిమెట్టు మీద అడుగుపెట్టగలవు.'

జీవితములో బాగా అభివృద్ధి చెందాలనే మహత్త్వాకాంక్షను కూడా వదిలివెయ్యి. నువ్వు పుష్పం వలే వికసించు. పుష్పమునకు తాను వికసిస్తున్నట్లు తెలియదు. పుష్పము తన ఆత్మను వాయువు సమక్షములో స్వేచ్ఛగా విప్పుకొనటానికి ఉత్సాహపడుతుంది. నీవు కూడా నీ ఆత్మను శాశ్వతత్వము ముందు విప్పుకొనటానికి ఉత్సుకత చూపించు. కానీ ఏదో ఒక మహత్త్వాకాంక్షతో మాత్రము కాదు. శాశ్వతత్వమే నీ యొక్క శక్తి-సౌందర్యములను ఆకర్షించగలదు. శాశ్వతత్వము వైపు ఆకర్షించబడుతూ నీవు పవిత్రముగా ముందుకు సాగగలవు. అలాకాక కేవలము వ్యక్తిగతమైన కోరికలకే ప్రాముఖ్యత ఇచ్చినట్లయితే సంవేదనా హీనమైన, ఆధ్యాత్మిక భావనలు లేనటువంటి జడము-కఠోరము అయిన అనుభూతులను మాత్రమే పొందగలవు.

గురువు పట్ల అపారమైన ప్రేమ కలిగినవారికి మాత్రమే ఈ సూత్రము అర్థమౌతుంది. గురువు యొక్క ప్రేమ కోసము తన సర్వస్వమును త్యాగము చెయ్యటానికి తపనపడే అతడి హృదయము అనుక్షణం ప్రగాఢమైన ఆధ్యాత్మిక అనుభవముల కోసము తహతహలాడుతుంటుంది. అతని తపనకు ఈ సూత్రములో సమాధానము దొరుకుతుంది. ఆధ్యాత్మిక అనుభవములు పొందవలెనంటే ఎంతో స్వచ్ఛమైన సూక్ష్మభావ చేతనత్వము అవసరమని గొప్పగొప్ప సాధకులు తమ అనుభవ సారంగా వెల్లడిచేస్తున్నారు. సద్గురువు యొక్క ప్రేమ ద్వారా లభించే ఆనందము ఎంతో సూక్ష్మమైనదని గుర్తుంచుకోండి. గురుదేవుల చేతనత్వముతో నిరంతరము స్పందిస్తుండే అంతర్ స్వరం అతి మంద్రంగా ఉంటుంది. వ్యర్థమైన శబ్దములు, అనవసరమైన ధ్వనుల తాలూకు ఆకర్షణల నుండి తనను తాను విముక్తుడిని గావించుకున్న వ్యక్తికి మాత్రమే పైన చెప్పిన అంతర్-స్వరం వినపడుతుంది. అలాగే సద్గురుని కృప యొక్క రుచి కూడా బహుసూక్ష్మముగా ఉంటుంది. రుచి యొక్క శక్తి తగ్గకుండా ఉన్నవారు మాత్రమే దాని అనుభూతిని పొందగలరు.

సాధారణముగా ఇంద్రియములు, మనస్సు ఉత్తేజితము కావటానికి ఆత్రుతగా ఉంటాయి. ఎంత ఎక్కువగా ఉత్తేజిత మవుతామో దాని అవసరము అంతకంతకూ అధికమవుతూ ఉంటుంది. ఆ స్థితి ఎంతదాకా వస్తుందంటే ఉత్తేజితులం కావటానికి మనం తీసే పరుగు చివరకు మనలను జడులుగా చేస్తుంది. ఉదాహరణకు భోజనములో మనము తీసుకునే ఎక్కువ ఉత్తేజనకారకమైన పదార్థములు మనస్సును ప్రభావితము

**విషయ పరిజ్ఞానం లేనివ్యక్తి మౌనంగా ఉండటం మంచిది**

చేస్తాయి. ఎక్కువ ఉప్పు, కారం తినటము అలవాటైతే మరింతగా వాటిని తినటానికి నాలుక ప్రేరేపించబడుతూ ఉంటుంది. తర్వాతి కాలములో ఉప్పు–కారం లేని భోజనము మట్టితో సమానముగా తోస్తుంది. భోజనములోని సహజమైన రుచి లుప్తమైపోతుంది. మానసికపరమైన, ఇంద్రియపరమైన విషయములో కూడా ఇదే వర్తిస్తుంది. ఫాస్ట్ మ్యూజిక్ వినటానికి ఇష్టపడే వ్యక్తి ప్రకృతి యందలి సహజ సంగీతములోని ఆనందమును ఆస్వాదించలేడు.

అందుచేతనే అనుభవజ్ఞులైన సాధకులు అత్యంత సూక్ష్మమైన స్వచ్ఛమైన తత్త్వమును అనుభూతిచెందాలనుకుంటే ముందు మన మనస్సును, ఇంద్రియములను ఉత్తేజితము వైపు పరుగుతీయకుండా కాపాడుకోవాలి' అని తెలియజేస్తున్నారు. మానసికచేతనత్వము, ఇంద్రియచేతనత్వము అత్యంత సూక్ష్మము, స్వచ్ఛము కాగలిగినప్పుడే ఆయా తత్త్వముల అనుభూతి లభిస్తుంది. శిష్యులు, సాధకులు అయిన మహానుభావులు ప్రవచించిన 'ఏహి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవతే!' అనే మహావాక్యము చిరపరిచితమైనదే. అనగా 'ఉత్తేజన వల్ల ఏ సుఖమైతే లభిస్తుందో అది కాలక్రమేణా దుఃఖమును హెచ్చిం చేది మాత్రమే!' అని అర్థము. ఉత్తేజితులం కావాలి అన్న కోరికను విడచిపెట్టనిదే ఏ వ్యక్తీ సాధనాజగత్తులోకి ప్రవేశించ లేడు. ఎందుకంటే 'సాధన' అంటే అతి సూక్ష్మమైన, స్వచ్ఛమైన అనుభూతి. ఈ అనుభూతి మనం స్వయముగా స్వచ్ఛముగా తయారయినప్పుడు మాత్రమే మనకు లభిస్తుంది.

ఉత్తేజితులం కావాలనే కోరిక కేవలము ఇంద్రియాలకే పరిమితము కాదు. మనస్సనే మహాప్రదేశములో కూడా దీని అంకురము మొలకెత్తుతుంది. మానసిక ఉత్తేజ ఉన్నతిని సాధించాలనే మహత్త్వాకాంక్షగా రూపొందుతుంది. ఇది శిష్యత్వానికి ప్రబల శత్రువు అని అనుభవజ్ఞులైన సాధకుల అభిప్రాయము. ఉన్నతస్థాయికి చేరుకోవాలనే కోరిక కలిగిన వారెవ్వరూ తమ గురువు పట్ల అంకితభావమును పొందలేరు. వారికి ప్రేమ, సమర్పణ తాలూకు రుచి ఎప్పటికీ లభించదు. ఉన్నతికి సంబంధించిన కోరిక అది ఎటువంటిదైనా సరే శిష్యులకు వర్జనీయమే!

లౌకిక, ఆధ్యాత్మికపరమైన అభివృద్ధికి సంబంధించిన ఎటువంటి కోరికలకైనా సరే వారు దూరంగా ఉండవల్సినదే. ఆధ్యాత్మిక ఔన్నత్యానికి సంబంధించిన కోరికలకు దూరంగా ఉండమని చెప్పటము కొంత విచిత్రముగానే అనిపిస్తుంది కానీ ఇది నూటికి నూరుపాళ్ళూ వాస్తవము! నిజానికి కోరికలన్నీ అహంకారము యొక్క చుట్టుప్రక్కలే పరిభ్రమిస్తుంటాయి. అవి కాలక్రమేణా అహంకారమును బలోపేతము కావిస్తాయి. అసలు 'ఆధ్యాత్మికతకు' అహంకారమనేది ఎప్పుడూ శత్రువే.

ఇది పుష్పము వలె విచ్చటము, వికసించడము వంటిది. పుష్పమునకు తాను వికసిస్తున్నట్లు తెలియదు. నిజానికి మొగ్గ ఎప్పుడు పుష్పంగా మారుతుందో దానికి తెలియదు. అది ఎప్పుడూ తన ఆత్మను వాయువు యొక్క, కాంతి యొక్క సమక్షములో విప్పుకొనటానికి ఉత్సుకతతో ఉంటుందనేది నిజం. వెలుగు (కాంతి) పట్ల, గాలిపట్ల, యావత్ ప్రకృతి పట్ల మొగ్గ ఎప్పుడూ సమర్పణాభావంతో ఉంటుంది. అంతకు మించి అది మరింక ఏ పనినీ చెయ్యదు. తనలో ఉన్న సుగంధమును గాలిలో వ్యాప్తిచెందించటానికి అది ఎంతో ఆత్రుతపడుతుంది. ఈ క్రమములో అన్నింటికన్నా విలువైన అంశమేమిటంటే పువ్వుగా వికసించే క్రమములో ఎంతో ఆత్రుత నిండిన ఆ క్షణములలో కూడా మొగ్గ కేవలము ప్రతీక్షిస్తుందే తప్ప ఎలాంటి పని చెయ్యదు. వికసించిన పిదప అది తనలోని పరిమళమునంతటినీ గాలిలో వ్యాపింపజేస్తుంది.

శిష్యులకు కూడా ఇదే మార్గము నిర్దేశించబడినది. ఉత్తేజమును, ఉన్నతిని పొందాలనే కోరికనూ త్యాగము చేసి తన గురుదేవులకు నిరంతరము తనను తాను సమర్పణ చేసుకొని ఉండటం ఒక్కటే శిష్యుని కర్తవ్యము. గురుదేవుల కృప ఎడల శిష్యునికి నిరంతరము విశ్వాసము ఉండాలి. గురుకృప పట్ల విశ్వాసము కలిగినప్పుడే శిష్యుని చేతనత్వమనే మొగ్గ పుష్పంగా వికసిస్తుంది. అప్పుడే అతని జీవితమునకు సార్థకత ఏర్పడు తుంది. శిష్యుని జీవితము లోని రహస్యమిదే. ఈ రహస్యమునకు చెందిన కోణములు మరెన్నో ఉన్నాయి.

– అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి &*
*శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఏ విషయం గురించి అయినా పూర్తిగా తెలుసు అని అనుకోవడం అవివేకం**

బోధకథ

# యజ్ఞం అంటే త్యాగం

మహాభారత యుద్ధం సమాప్తమైన పిదప పాండవులు గొప్ప యజ్ఞం చేశారు. ఆ రోజులలో అంత గొప్ప యజ్ఞం ఎవ్వరు, ఎన్నడు ఇంతవరకు చేసినవారు లేరని గొప్పగా ప్రజలంతా చెప్పుకొనేవారు. పేదవారికి భారీగా దానాలు లభించి వారి గృహాలన్నీ బంగారంతో నిండిపోయాయి. ఆ యజ్ఞంలో ప్రజలందరికి అన్ని దానాలు లభించుట చూచి అందరు ముక్కు మీద వ్రేలు వేసుకొని ఆశ్చర్యపోయారు.

ఈ యాగ విషయం దేశదేశాలకు విస్తరించి అందరు దీనిని గురించే చర్చించుకునేవారు. అంతేగాక పశుపక్షులు కూడా ఈ యాగం గురించి తెలుసుకొన్నాయి. ఒక ముంగిస ఈ యాగం గురించి విని ఎంతో ఆనందించింది. ఎందుకనగా ఒకసారి చిన్న యజ్ఞంలో నేలపై రాలిన ఎంగిలి మెతుకులు దాని శరీరానికి అంటినంతనే దాని శరీరంలోని ఒక భాగం బంగారంగా మారిపోయింది. **ఇంత చిన్న యజ్ఞం ద్వారా లభించిన అతికొద్ది ఎంగిలి పదార్థంతో ఒక ప్రక్క బంగారంగా మారడంతో పాండవులు చేసిన అంత గొప్ప యజ్ఞం ద్వారా తన శరీరములోని రెండవ భాగం బంగారంగా ఎందుకు మారిపోదని అనుకొన్నది.** అంతకు క్రితం ఈ ముంగిస ఎన్నో యాగాలను చూసింది. ఎక్కడ యజ్ఞం జరిగిందని తెలిసినా అక్కడకు పరుగులు తీసి తన శరీరం బంగారంగా మార్చు కొనుటకు ఎంతో ప్రయత్నించి సఫలం పొందలేకపోయింది. నేలపైన పడిన యాగంలోని పదార్థాలమీద పొర్లిగింతలు పెట్టేది. ఎంతచేసిన తన శరీరంలోని రెండవ భాగం మాత్రం బంగారంగా మారలేకపోయింది. ఈసారి ఇంత పెద్ద యజ్ఞం జరిగిన వార్త వినగానే ఎంతో ఆనందించి; ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన కోర్కె తీర్చుకొనుటకు ఆ ముంగిస సంతోషంతో యజ్ఞం జరిగిన ప్రదేశానికి బయలుదేరింది.

చాలా రోజులు కఠినమైన యాత్రచేసి చివరకు యజ్ఞశాలకు చేరి అక్కడ నేల మీద ఉన్న ఎంగిలి పడినచోట దొర్లుట ప్రారంభించింది. యజ్ఞవాటిక మొత్తం అన్నిచోట్ల ఎంతో వ్యాకులంతో దొర్లుకుంటూ ఎన్నోసార్లు తిరిగి తన శరీరాన్ని కళ్ళు విప్పార్చుకొని బంగారంగా మారింది లేనిది చూసుకొంది గాని ఏమాత్రం ఫలితం లభించక, ఒకచోట కూర్చుని తలబాదు కొంటూ దుఃఖించుట మొదలుపెట్టింది.

ముంగిస చేస్తున్న పనులను గమనించిన ప్రజలు దాని చుట్టు మూగి అది అలా చేయుటకు కారణమేమని అడిగారు. అది ఎంతో దుఃఖంతో జవాబు ఇస్తూ ఈ యజ్ఞం గురించి విని నేను చాలా దూరదేశం నుండి ఎన్నో కష్టాలుపడి ఇక్కడకు చేరాను. కాని అసలు ఇక్కడ యజ్ఞమనేది ఏదీ జరగలేదని ఇప్పుడు నాకు తెలిసింది. **ఒకవేళ నిజంగా యజ్ఞం జరిగి ఉంటే నా శరీరంలో మిగిలిన భాగం బంగారంగా ఎందుకు మారలేదు?** ముంగిస మాటలు వినిన ప్రజలలో ఉత్సుకత పెరిగి, ఆ ముంగిసతో నీ శరీరం బంగారమగుటకు, ఈ యజ్ఞం వల్ల దానికి సంబంధ రహస్యమేమని, దయచేసి వాస్తవాన్ని మాకు వివరించమన్నారు.

అప్పుడా ముంగిస ఇలా చెప్పింది. మీరంతా వినండి. మా దేశంలో ఒక చిన్న గ్రామముంది. ఒక పేద బ్రాహ్మణుడు తన పాత కుటీరంలో కుటుంబంతో నివసిస్తున్నాడు. అతని కుటుంబ సభ్యులు మొత్తం నలుగురు. ఆయన, ఆయన భార్య ఇంకా కుమారుడు, కోడలు. ఆ బ్రాహ్మణుడు గ్రామంలోని పిల్లలకు విద్యను బోధించేవాడు. దానితో ఏదోకొద్ది మొత్తం ధనం లభిస్తే తన కుటుంబాన్ని పోషించుకొంటూ ఉండేవాడు. ఒకసారి మూడు సంవత్సరాల వరకు వర్షాలు కురవనందున పెద్ద కరువు వచ్చింది. ఆకలితో చాలామంది చనిపోతున్నారు. అప్పుడు బ్రాహ్మణ కుటుంబం కూడా చాలా కష్టం సహించ వలసి వచ్చింది. ఎన్నో రోజులు సగం ఆకలితో ఎంతో కష్టంతో జీవిస్తూ ఉన్నారు. వారి శరీరాలన్నీ ఎముకల గూడుల్లాగా ఎండిపోయాయి. ఇలా ఎన్నో రోజులు ఉపవాసంతో గడిపిన పిదప ఏదోవిధంగా ఆ బ్రాహ్మణుడు కొంత బార్లీపిండిని సంపాదించగలిగాడు. దానితో నాలుగు రొట్టెలు చేశారు. నలుగురు ఒక్కో రొట్టెని పంచుకొని తమ పళ్ళాలలో ఉంచుకొని తినటానికి కూర్చున్నారు. ఇంతలో గుమ్మం ముందు ఒక అతిథి వచ్చి నిలిచాడు.

శత్రువులు మిత్రులుగా మారేంతవరకు ప్రేమించడం నేర్చుకోవాలి

వచ్చిన అతిథిని ఆదరించుట గృహస్థ ధర్మం కాబట్టి బ్రాహ్మణుడు అతిథిని లోనికి దయచేయవలసినదిగా ప్రార్థించాడు. భోజనం చేయమని తన పళ్ళెమును అతిథిముందు ఉంచాడు. ఆ రొట్టెను అతిథి రెండు మూడు ముద్దలతో తిని బ్రాహ్మణునితో నేను 10 రోజుల నుండి ఆహారం తినక చాలా ఆకలిగా ఉన్నాను. ఈ ఒక్క రొట్టెతో నా ఆకలి తీరకపోగా ఇంకా ఎక్కువైంది అనగానే బ్రాహ్మణుని భార్య తన వంతు ఆహారాన్ని అతిథి ముందు ఉంచి భోజనం చేయమని కోరింది. ఆ అతిథి దాన్ని కూడా తిని ఆకలి తీరలేదనగా అతని కుమారుడు తన రొట్టెను అతిథికి సమర్పించినప్పటికి అతిథి తృప్తిపడనందున కోడలు కూడా తన వంతు రొట్టెను సమర్పించింది. నాలుగు రొట్టెలు తిన్న అతిథి ఆకలి తీరిన పిదప ఎంతో ఆనందంగా వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి ఆకలిబాధతో ఆ కుటుంబంలోని నలుగురు మరణించారు. నేను వారి కుటీరం ప్రక్కనే ఒక బొరియలో నివసిస్తూ ఉండేదానిని. నేను నా కలుగు నుండి బయటకు వచ్చి అతిథి రొట్టెలు తిన్నచోట నేల మీద కొన్ని ఎంగిలి కణాలు రాలి ఉండుట చూశాను. ఎంతో ఆకలిగా ఉన్న నేను ఆ కణాలను తిందామని వాటి మీదకు దూకాను. ఆ దూకటంలో కొన్ని కణాలు నా శరీరానికి అంటుకున్నాయి. అవి నా శరీరానికి ఎంత భాగంలో అంటుకున్నాయో అంత భాగం బంగారంగా మారిపోయింది. నా తల్లి నాతో అనేది. "యజ్ఞం జరిగినచోట రాలిన మెతుకులు శరీరానికి అంటుకుంటే బంగారంగా మారుతుందని" చెప్పేది. ఈ ఆశతోటే నేను ఇక్కడకు వచ్చాను. పాండవులు జరిపిన ఈ యజ్ఞం అప్పుడు బ్రాహ్మణుడు యజ్ఞంతో సమానంగా ఉండి ఉంటుందని నమ్మాను కాని, నా నమ్మకం వమ్ము అయింది. నా శ్రమ అంతా వృథా అయ్యిందని అందుకు వాపోతున్నానని ముంగిస చెప్పింది.

పెద్దలు చెబుతూ ఉంటారు – దానం, ధర్మం, యజ్ఞం మహత్యం దాని పరిమాణం మీద కాదు, దానిని జరిపినవారి భావనల మీద ఆధారపడి ఉంటుంది. ధనవంతుడు గర్వంతో చేయు దాన ధర్మాలు పేదవాడు ఇచ్చే త్యాగపూరితమైన గుప్పెడు అన్నంతో సరిపోజాలదు. పరమాత్మ సన్నిధిలో వెండి బంగారాలకు విలువ లేదు, కాని పవిత్ర భావనల విలువ ఎంతో ఎక్కువ.

*– అఖండజ్యోతి, జులై 1941*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

## కర్తవ్యపరాయణురాలైన చిలుక

*ఒక జమిందారు యొక్క పొలంలో వరిపంట నాటబడి, నాలుగు దిక్కుల దండిగా కాపలాదారులు నియమించబడ్డారు. అయినప్పటికి చిలుకల గుంపులు రావటం, తినిపోవటం జరిగేది. ఒక చిలుక మాత్రం తిన్నంతతిని కొన్ని ధాన్యపు కంకెలను ముక్కుతో పీక్కొని పోయేది. ఆ చిలుక ప్రత్యేకంగాను, చూడముచ్చటగాను ఉండటం వలన కాపలాదారులు వలపన్ని దానిని యజమానివద్దకు తీసికొని వెళ్ళి విషయాన్ని వివరించారు. అతను అందమైన చిలుకను చేతిమీద ఎక్కించుకొని కడుపు నిండా తిన్నది చాలక ముక్కుతో ఎక్కడికి మోసుకుపోతున్నావని ముద్దుగా ప్రశ్నించాడు. దానికి చిలుక ఆరు కంకెలు మాత్రమే తీసికొని వెళుతున్నానని, వాటిలో రెండు అప్పు తీర్చటానికి, రెండు అప్పు ఇవ్వటానికి, రెండు పరమార్థానికి ఉపయోగిస్తున్నానని వేదాంతిలా బదులు పలికింది. జమిందారు అర్థం కానట్లు చిలుక వంక చూడగా, చిలుక ముద్దుపలుకులతో అర్థం కాలేదా! అప్పు తీర్చడమంటే ముసలివారైన అమ్మానాన్నల కోసం తీసికెళ్తున్నాను. నా పిల్లలు ఇంకా ఎగురలేని చిన్నవి. వాటికి రెండు కంకెలు తినిపించి అప్పు ఇస్తున్నాను. కొన్ని చిలుకలు జబ్బుపడి ఎగర లేకుండా ఉన్నాయి. వాటికి ఇచ్చే రెండు కంకెలు పరమార్థం క్రిందకు వస్తాయి అని పలికి గగనమార్గంలోకి ఎగిరిపోయింది. భావనాశీలి అయిన ఆ చిలుకను, చిలుక పలుకులను జమిందారు హృదయ మందిరంలో నిలుపుకున్నాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**ఆత్మవిశ్వాసం గలవారు సకల సామాగ్రిని, సాధించుకోగలుగుతాడు**



వినాయక చవితి ప్రత్యేకం

# శ్రీ సిద్ధి వినాయక వ్రతకల్పము

ముందుగా బొట్టు పెట్టుకుని, నమస్కరించుకుని, ఈ విధంగా ప్రార్థించుకోవాలి.

**ప్రార్థన:**

**శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్న వదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాంతియే ॥**
**అయం ముహూర్తస్సుముహూర్తోస్తు ॥**

**శ్లో॥ తదేవలగ్నం, సుదినం తదేవ,**
**తారాబలం చంద్రబలం తదేవ**
**విద్యాబలం దైవబలం తదేవ,**
**లక్ష్మీపతేతేంఘ్రి యుగం స్మరామి**
**సుముహుర్తోస్తు ॥**

**శ్లో॥ లాభస్తేషాం, జయస్తేషాం, కుతస్తేషాం పరాభవః**
**యేషామిందీవర శ్యామో హృదయస్థో జనార్దనః ॥**
**ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం**
**లోకాభిరామం శ్రీరామం భూయోభూయో**
**నమా మ్యహం ॥**
**సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణికః,**
**లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః**

**పూజా సన్నాహం**

వినాయక చవితి రోజు ఉదయాన్నే ఇంటిని శుభ్రం చేసుకొని మామిడి ఆకుల తోరణం కట్టుకోవాలి. వాకిళ్ళను అలంకరించుకోవాలి. కుటుంబ సభ్యులంతా తలంటుకొని స్నానం చేయాలి. దేవుని గది ఉంటే అందులో లేదా పరిశుభ్రమైన ప్రదేశంలో ఒక పీటవేసి, దానిపై మనం తెచ్చుకున్న వినాయకుడి విగ్రహాన్ని ఉంచాలి. తెచ్చిన పూజా సామాగ్రిని కూడా అందుబాటులో ఉంచుకోవాలి. వినాయకుడికి ఉండ్రాళ్ళు చాలా ఇష్టం. మిగిలిన భక్ష్యాలున్నా లేకున్నా వీటిని తప్పనిసరిగా తయారుచేసుకోవాలి. వినాయకుడి విగ్రహం ఎదుట పీటపై కొంచెం బియ్యం పోసి దానిపై రాగి లేదా వెండి లేదా మట్టి పాత్రను ఉంచాలి. దానికి పసుపు రాసి బొట్టు పెట్టాలి. దానిలో కొన్ని అక్షతలు, పూలు వేసి దానిపై మామిడి ఆకులు ఉంచి ఆపై కొబ్బరికాయతో కలశం ఏర్పాటు చేసుకోవాలి. ఆ తరువాత పసుపు ముద్దతో చిట్టి గ్లాసులో చెంచా లేదా ఉద్ధరిణి ఉంచుకొని పక్కన మరో చిన్న ప్లేటు పెట్టుకోవాలి. పూజ చేస్తున్నప్పుడు చేతికి పసుపు, కుంకుమలు అవుతాయి కాబట్టి చేతికింద ఒక శుభ్రమైన గుడ్డను ఉంచుకుంటే బాగుంటుంది.

**పూజకు కావలసిన సామగ్రి**

పసుపు, కుంకుమ, గంధం, అగరువత్తులు, కర్పూరం, తమలపాకులు, వక్కలు, పూలు, పూలదండలు, అరటి పండ్లు, కొబ్బరికాయలు, బెల్లం లేదా పంచదార, పంచామృతాలు, తోరము, దీపారాధన కుందులు, నెయ్యి లేక నూనె, దీపారాధన వత్తులు. వినాయకుడి ప్రతిమ, 21 రకాల ఆకులు, ఉండ్రాళ్ళు, పాయసం, భక్ష్యాలు.

**అథ ఏకవింశతి వ్రత పూజ**

(ఒక్కొక్క నామం చదువుతూ బ్రాకెట్‌లో పేర్కొన్న పత్రాలు తీసుకుని స్వామిని పూజించాలి)

ఓం సుముఖాయ నమః మాచీపత్రం పూజయామి (మాచిపత్రి)

ఓం గణాధిపాయ నమః బృహతీపత్రం పూజయామి (వాకుడాకు)

ఓం ఉమాపుత్రాయ నమః బిల్వపత్రం పూజయామి (మారేడు)

ఓం గజాననాయ నమః దూర్వాయుగ్మం పూజయామి (గరికె)

ఓం హరసూనవే నమః దత్తూరపత్రం పూజయామి (ఉమ్మెత్త)

ఓం లంబోదరాయ నమః బదరీపత్రం పూజయామి (రేగి)

ఓం గుహాగ్రజాయ నమః అపామార్గపత్రం పూజయామి (ఉత్తరేణు)

ఓం గజకర్ణాయ నమః తులసీపత్రం పూజయామి (తులసి)

ఓం ఏకదంతాయ నమః చూతపత్రం పూజయామి (మామిడి)

ఓం వికటాయ నమః కరవీరపత్రం పూజయామి (గన్నేరు)

ఓం భిన్నదంతాయ నమః విష్ణుక్రాంతపత్రం పూజయామి (విష్ణుక్రాంతం)

ఓం వటవే నమః దాడిమీ పత్రం పూజయామి (దానిమ్మ)

**అత్యాశ వలన దుర్గతి ప్రాప్తిస్తుంది**

ఓం సర్వేశ్వరాయ నమః దేవదారుపత్రం పూజయామి (దేవదారు)

ఓం ఫాలచంద్రాయ నమః మరువకపత్రం పూజయామి (మరువం)

ఓం హేరంబాయ నమః సింధువారపత్రం పూజయామి (వావిలి)

ఓం శూర్పకర్ణాయ నమః జాజిపత్రం పూజయామి (జాజి)

ఓం సురాగ్రజాయ నమః గండకీపత్రం పూజయామి (గండకీ)

ఓం ఇభవక్త్రాయ నమః శమీపత్రం పూజయామి (జమ్మి)

ఓం వినాయకాయ నమః అశ్వత్థపత్రం పూజయామి (రావి)

ఓం సురసేవితాయ నమః అర్జునపత్రం పూజయామి (మద్ది)

ఓం కపిలాయ నమః అర్కపత్రం పూజయామి (తెల్లజిల్లేడు)

ఓం శ్రీ గణేశ్వరాయ నమః ఏకవింశతపత్రాణి పూజయామి

## శ్రీ వినాయక వ్రతకథ

*(వ్రతకథ చెప్పుకునే ముందు కొన్ని అక్షతలు చేతిలో ఉంచుకోవాలి. కథ పూర్తయిన తరువాత ఆ అక్షతలను శిరస్సుపై వేసుకోవాలి)*

పూర్వం చంద్రవంశానికి చెందిన ధర్మరాజు జ్ఞాతుల వలన సిరిసంపదలన్నీ పోగొట్టుకున్నాడు. భార్యతోను, తమ్ములతోనూ వనవాసం చేస్తూ ఒకనాడు నైమిశారణ్యానికి చేరుకున్నాడు. అక్కడ శౌనకాది ఋషులకు అనేక పురాణ రహస్యాలను బోధిస్తున్న సూతమహామునిని దర్శించి, నమస్కరించి "అయ్యా! మేము రాజ్యాధికారము, సమస్త వస్తు వాహనములను పోగొట్టుకున్నాము. ఈ కష్టాలన్నీ తీరి, పూర్వవైభవము పొందేలా ఏదయినా సులభమైన వ్రతాన్ని చెప్పవలసింది" అని ప్రార్థించాడు. అంత సూతుడు ధర్మరాజుకు వినాయక వ్రతం చేస్తే కష్టాలు తొలగిపోయి, సమస్త సౌఖ్యాలు కలుగుతా యంటూ ఇలా చెప్పసాగాడు.

"ఒకసారి కుమారస్వామి పరమశివుణ్ణి దర్శించి – తండ్రీ! మానవులు ఏ వ్రతం చేయడం వలన వంశవృద్ధిని పొంది, సమస్త కోరికలు తీరి, సకల శుభాలను, విజయాలను, వైభవాలను పొందగలుగుతారో అటువంటి వ్రతాన్ని చెప్పవలసింది అని కోరాడు. అందుకు శివుడు – నాయనా! సర్వసంపత్కరము, ఉత్తమము, ఆయుష్కామార్థ సిద్ధిప్రదమూ అయిన వినాయక వ్రతమనేదొకటుంది. దీనిని భాద్రపద శుద్ధ చవితినాడు ఆచరించాలి. ఆరోజు ఉదయమే నిద్రలేచి, స్నానం చేసి, నిత్యకర్మలు నెరవేర్చుకుని తమ శక్తిమేరకు బంగారంతోగాని, వెండితోగాని, లేదా కనీసం మట్టితోగాని విఘ్నేశ్వరుడి బొమ్మను చేసి, తమ ఇంటికి ఉత్తర దిక్కులో బియ్యాన్ని పోసి మండపాన్ని నిర్మించి, అష్టదళ పద్మాన్ని ఏర్పరచాలి. అందులో గణేశుని ప్రతిమను ప్రతిష్ఠించాలి. అనంతరం శ్వేతగంధాక్షతలు, పుష్పాలు, పత్రాలతో పూజించి, ధూపదీపాలను, వెలగ, నేరేడు, చెరకు మొదలైన ఫలములను రకమునకు ఇరవై ఒకటి చొప్పున నివేదించాలి. నృత్య, గీత, వాద్యపురాణ పఠనాదులతో పూజను ముగించి, యథాశక్తి వేదవిదులైన బ్రాహ్మణులకి దక్షిణ తాంబూలాదులను ఇవ్వాలి. బంధుజనంతో కలిసి భక్ష్య భోజ్యాదులతో భోజనం చేయాలి. మరునాడు ఉదయం స్నాన సంధ్యలు పూర్తిచేసుకుని గణపతికి పునః పూజ చేయాలి. విప్రులను దక్షిణ తాంబూలాలతో తృప్తులను చేయాలి. ఈవిధంగా ఎవరైతే వినాయక వ్రతాన్ని చేస్తారో వాళ్ళకి గణపతి ప్రసాదం వలన సకల కార్యములు సిద్ధిస్తాయి. అన్ని వ్రతముల లోకి అత్యుత్తమమైన ఈ వ్రతం త్రిలోక ప్రసిద్ధమైన దేవ ముని గంధర్వాదులందరిచేత ఆచరింపబడింది అని పరమ శివుడు కుమారస్వామికి చెప్పాడు.

కనుక ధర్మరాజా నువ్వు కూడా ఈ వ్రతాన్ని ఆచరించి నట్లయితే – నీ శత్రువులను జయించి సమస్త సుఖాలను పొందుతావు. గతంలో విదర్భ యువరాణి దమయంతి ఈ వ్రతం చేయడం వలనే తాను ప్రేమించిన నలమహారాజును పెండ్లాడ గలిగింది. శ్రీకృష్ణుడంతటివాడు ఈ వ్రతం చేయడం వల్లనే శ్యమంతకమణితోబాటుగా జాంబవతీ సత్యభామలనే ఇద్దరు కన్యామణులను కూడా పొందగలిగాడు. ఆ కథ చెబుతాను విను అంటూ ఇలా చెప్పసాగాడు.

పూర్వకాలమున గజముఖుడయిన గజాననుడు అనే రాక్షసుడు ఒకడు శివుని గూర్చి తపస్సు చేశాడు. అతని తపస్సునకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరము కోరుకొమ్మన్నాడు. అంత గజాసురుడు పరమేశ్వరుని స్తుతించి, స్వామీ నీవు నాయుదరమందే నివసించాలి అని కోరాడు. దాంతో భక్తసులభుడగు శివుడు అతడి కుక్షియందుండి పోయాడు. జగన్మాత పార్వతి భర్తను వెదుకుతూ ఆయన గజాసురుని కడుపులో ఉన్నాడని తెలుసుకున్నది. ఆయనను దక్కించుకునే ఉపాయం కోసం విష్ణువును ప్రార్థించినది. అంత శ్రీహరి బ్రహ్మాది దేవతలను పిలిపించి చర్చించాడు. గజాసుర

**దైవత్వానికి పునాది మానవత్వం**

సంహారమునకు గంగిరెద్దు మేళమే తగినదని నిర్ణయించారు. నందీశ్వరుని గంగిరెద్దుగా అలంకరించారు. బ్రహ్మాదిదేవతలం దరిచే తలకొక వాయిద్యమును ధరింపజేశాడు. మహావిష్ణువు తానును చిరుగంటలు, సన్నాయిలు ధరించాడు. గజాసుర పురానికి వెళ్ళి జగన్మోహనంబుగా గంగిరెద్దులను ఆడించు చుండగా గజాసురడది విని, వారిని పిలిపించి తన భవనము ఎదుట గంగిరెద్దును ఆడించమని కోరాడు. బ్రహ్మాది దేవతలు రసరమ్యంగా వాద్యాలను వాయిస్తుండగా జగన్నాటక సూత్ర ధారియగు నా హరి చిత్రవిచిత్రముగా గంగిరెద్దు నాడించాడు. గజాసురుడు పరమానందభరితుడై “ఏమికావాలో కోరుకోండి... ఇస్తాను” అన్నాడు. అంతట శ్రీహరి గజాసురుని సమీపించి “ఇది శివుని వాహనమగు నంది, శివుని కనుగొనుటకు వచ్చింది, శివుడ్ని అప్పగించు” అని కోరాడు. ఆ మాటలకు గజాసురుడు నివ్వెరపోయాడు. వచ్చినవాడు రాక్షసాంతకుడగు శ్రీహరి అని తెలుసుకున్నాడు. తనకు మరణం నిశ్చయమను కున్నాడు. తన గర్భంలో ఉన్న పరమేశ్వరుడ్ని ఉద్దేశించి “స్వామీ! నా శిరస్సు త్రిలోక పూజ్యముగా చేసి, నా చర్మము నీవు ధరించు” అని ప్రార్థించాడు. తన గర్భంలో ఉన్న శివుడ్ని తీసుకోవచ్చునని విష్ణుమూర్తికి అంగీకారము తెలియజేశాడు. అంత శ్రీహరి నందిని ప్రేరేపించగా, నంది తన కొమ్ములతో గజాసురుని చీల్చి సంహరించాడు. మహేశ్వరుడు గజాసుర గర్భము నుండి బయటకు వచ్చాడు. విష్ణుమూర్తిని స్తుతించాడు. ‘దుష్టాత్ములకు ఇటువంటి వరమును ఇవ్వరాదు. ఇచ్చినచో పామునకు పాలుపోసినట్లు అవుతుందని సూచించాడు. బ్రహ్మాది దేవతలకు వీడ్కోలు చెప్పి శ్రీహరి వైకుంఠమునకు వెళ్ళగా, శివుడు నందినెక్కి కైలాసమునకు వెళ్ళాడు.

### వినాయకోత్పత్తి

కైలాసంలో పార్వతి భర్త రాకను గురించి విని సంతోషిం చింది. స్వాగతం చెప్పేందుకు స్నానలంకార ప్రయత్నములో తనకై ఉంచిన నలుగు పిండితో పరధ్యానముగా ఒక ప్రతిమను చేసింది. అది చూడముచ్చటైన బాలుడుగా కనిపించింది. దానికి ప్రాణం పోయాలనిపించి, తన తండ్రి ద్వారా పొందిన మంత్రంతో ఆ ప్రతిమకు ప్రాణప్రతిష్ఠ చేసింది. ఆ దివ్య సుందరుని వాకిట్లో ఉంచి, ఎవరినీ లోనికి రానివ్వరాదని చెప్పి లోపలకు వెళ్ళింది.

శివుడు తిరిగి వచ్చాడు. వాకిట్లో ఉన్న బాలుడు పరమ శివుడ్ని అభ్యంతర మందిరంలోనికి పోనివ్వకుండా అడ్డుకున్నాడు. తన ఇంట్లో తనకే అవరోధమా అని శివుడు కోపంతో రగిలిపోయాడు. రౌద్రంతో ఆ బాలుని శిరచ్ఛేదము చేసి, లోపలికి వెళ్ళాడు. జరిగిన దానిని విని పార్వతి విలపించింది. శివుడు కూడా చింతించాడు. వెంటనే తన వద్దనున్న గజాసురుని శిరమును ఆ బాలుని మొండెమునకు అతికించి ఆ శిరమునకు శాశ్వతత్వమును, త్రిలోక పూజ్యతను కలిగించాడు. గణేశుడు గజాననుడై, శివపార్వతుల ముద్దుల పట్టియైనాడు. ఆ తరువాత శివపార్వతులకు కుమారస్వామి జన్మించాడు.

### విఘ్నేశాధిపత్యం

ఒకనాడు దేవతలు, మునులు, మానవులు, పరమేశ్వరుని సేవించి విఘ్నములకు ఒక అధిపతిని ఇమ్మని కోరాడు. గజాననుడు తాను జ్యేష్ఠుడను గనుక ఆధిపత్యము తనకు ఇమ్మని కోరాడు. గజాననుడు మరుగుజ్జువాడు, అనర్హుడు, అసమర్థుడు, కాబట్టి ఆధిపత్యము తనకే ఇవ్వాలని కుమారస్వామి తండ్రిని వేడుకున్నాడు. అందుకు శివుడు తన కుమారులనుద్దేశించి “మీ ఇరువురిలో ఎవరు ముల్లోకములలోని పవిత్ర నదులన్నింటిలో స్నానము చేసి ముందుగా నా వద్దకు వస్తారో వారికి ఈ ఆధిపత్యం లభిస్తుంద”ని చెప్పాడు. అంత కుమార స్వామి చురుకుగా, సులువుగా సాగివెళ్ళాడు. గజాననుడు అచేతనుడయ్యాడు. మందగమనుడైన తాను ముల్లోకాలల్లోని నదులన్నింటిలో వేగంగా స్నానం చేసి రావడం కష్టసాధ్యమని, తరుణోపాయం చెప్పమని తండ్రిని వేడుకున్నాడు. వినాయకుని బుద్ధి సూక్ష్మతకు మురిసిపోయిన శివుడు ఫలదాయకమగు నారాయణ మంత్రమును అనుగ్రహించాడు. నారములు అనగా జలములు. జలములన్నియూ నారాయణుని అధీనములు. అనగా నారాయణ మంత్రం అధీనంలో ఉంటాయి. వినాయకుడు ఆ మంత్రం చదువుతూ తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణం చేయడం ప్రారంభించాడు. ఆ మంత్ర ప్రభావమున ప్రతి తీర్థ స్నానమందును కుమారస్వామి కన్నా ముందే వినాయకుడు ప్రత్యక్షం కావడం ప్రారంభించాడు. ఆ మంత్ర ప్రభావమున ప్రతి తీర్థస్నానమందును కుమారస్వామి కన్నా ముందే వినాయకుడు ప్రత్యక్షం కావడం ప్రారంభించాడు. ఇలా మూడు కోట్ల యాభైలక్షల నదులలో వినాయకుడే ముందుగా స్నానమా

**మానవత్వానికి పునాది దయాగుణం**

చరించడం చూసి కుమారస్వామి ఆశ్చర్య పడి కైలాసమునకు వెళ్ళాడు. తండ్రి సమీపమున ఉన్న గజాననుని చూచి నమస్కరించి "తండ్రీ! అన్నగారి మహిమ తెలియక ఆధిపత్యం అడిగాను. క్షమించండి ఈ ఆధిపత్యం అన్నగారికే ఇమ్మ" ని ప్రార్థించాడు.

### చంద్రుని పరిహాసం

అంత పరమేశ్వరుడు భాద్రపద శుద్ధ చవితినాడు గజాననునికి విఘ్నేశాధిపత్యం ఇచ్చాడు. ఆనాడు సర్వదేశస్థులు విఘ్నేశ్వరునికి తమ శక్తికొలది కుడుములు, అపూపములు మున్నగు పిండివంటలు, టెంకాయలు, తేనె, అరటిపండ్లు, పానకం, వడపప్పు మొదలగునవి సమర్పించి, పూజించగా, విఘ్నేశ్వరుడు సంతుష్టుడై కుడుములు మున్నగునవి కొన్ని భక్షించి, కొన్ని వాహనమునకిచ్చి, కొన్ని చేత ధరించి మంద గమనమున సూర్యాస్తమయవేళకు కైలాసమునకు వెళ్ళి తల్లిదండ్రులకు ప్రణామం చేయబోయాడు. ఉదరం భూమి కానక ఇబ్బంది పడుచుండగా, శివుని శిరమందున్న చంద్రుడు వినాయకుడి అవస్థ చూసి వికటముగా నవ్వాడు. అంత రాజ దృష్టి సోకిన రాలుగూడ నుగ్గవుతాయి అనే సామెత నిజమగునట్లు విఘ్నదేవుని గర్భంబు పగిలి, అందున్న కుడుములన్నీ ఆ ప్రదేశంలో పడ్డాయి. అతడు మృతి చెందాడు. అంత పార్వతి శోకించుచూ చంద్రుని చూచి "పాపాత్ముడా! నీ దృష్టి తగిలి నా కుమారుడు మరణించాడు కాబట్టి నిన్ను చూసినవారు పాపాత్ములై నీలాపనిందల పొందుదురుగాక'' యని శపించింది.

### ఋషిపత్నులకు నీలాపనిందలు

ఆ సమయంలో సప్తమహర్షులు యజ్ఞం చేస్తూ తమ భార్యలతో అగ్ని ప్రదక్షిణం చేస్తున్నారు. అగ్నిదేవుడు ఋషి పత్నులను మోహించి, శాపభయంతో అశక్తుడై క్షీణించడం ప్రారంభించాడు. అగ్ని భార్యయైన స్వాహాదేవి అది గ్రహించి అరుంధతి రూపం దక్క మిగిలిన ఋషిపత్నుల రూపం ధరించి పతికి ప్రియం చేసేందుకు ప్రయత్నించింది. అగ్నిదేవునితోనున్న వారు తమ భార్యలేయని శంకించి, ఋషులు తమ భార్యలను విడనాడారు. పార్వతీ శాపానంతరం ఋషిపత్నులు చంద్రుని చూచుటచే వీరికి ఈ నీలాపనింద కలిగింది.

దేవతలు, మునులు ఋషిపత్నులకు వచ్చిన ఆపదను పరమే భార్యయే తెలుపగా, అతడు సర్వజ్ఞుండగుటచే అగ్ని హోత్రుని భార్యయే ఋషి పత్నుల రూపం ధరించిందని చెప్పి ఋషులను సమాధానపరిచాడు. అంత బ్రహ్మ కైలాసమునకు వచ్చాడు. మహేశ్వరుని సేవించి, మృతుండై పడి ఉన్న విఘ్నేశ్వ రుని బ్రతికించాడు. పార్వతీపరమేశ్వరులు సంతోషించారు. అంత దేవాదులు "ఓ పార్వతీ! నీ శాపము వల్ల ముల్లోకాలకు కీడు వాటిల్లింది కాబట్టి శాపాన్ని ఉపసంహరించుకోవాలా"ని ప్రార్థించారు. తనయుడు మరల బతకడంతో పార్వతి చాలా సంతోషించింది. కుమారుని చేరదీసి ముద్దాడింది. "ఏ రోజున విఘ్నేశ్వరుని చూచి ఆ రోజున చంద్రుని చూడరాదు" అని శాపాన్ని సడలించింది. అంత బ్రహ్మాదులు భాద్రపద శుద్ధ చవితినాడు మాత్రము చంద్రుని చూడక జాగరూకులై సుఖంబుగ నుండిరి. ఇలా కొంతకాలము గడిచింది.

### శమంతకోపాఖ్యానం

ద్వాపరయుగమున నారదుడు ద్వారకావాసియగు శ్రీకృష్ణుని దర్శించి, స్తుతించాడు. మాటల సందర్భంగా స్వామీ! సాయం కాలమయింది, నేడు వినాయక చవితి కాబట్టి పార్వతీదేవి శాపం కారణంగా చంద్రుని చూడరాదు. ఇక సెలవు అని పూర్వవృత్తాంతమంతయూ శ్రీకృష్ణునికి చెప్పి నారదుడు స్వర్గ లోకమునకు వెళ్ళాడు. అంతట కృష్ణుడు ఆనాటి రాత్రి చంద్రుడ్ని ఎవరూ చూడరాదని పట్టణంలో చాటించాడు. క్షీరప్రియుడగు శ్రీకృష్ణుడు నాటి రాత్రి తాను ఆకాశం వంక చూడక గోష్టమునకు పోయి పాలుపితుకుతూ పాలలో చంద్రుని ప్రతిబింబమును చూశాడు. "ఆహా! ఇక నాకెట్టి అపనింద రానున్నదో" అని అనుకున్నాడు.

కొన్నాళ్ళకు సత్రాజిత్తు సూర్యవరముచే శమంతకమణిని సంపాదించి ద్వారకా పట్టణమునకు శ్రీకృష్ణ దర్శనార్థమై వెళ్ళాడు. శ్రీకృష్ణుడు మర్యాద చేసి ఆ మణిని మన రాజుకిమ్మని అడిగాడు. "రోజుకు ఎనిమిది బారువుల బంగారమిచ్చు దానిని ఏ ఆప్తునకైన నెవ్వరు ఇవ్వ"రని సత్రాజిత్తు తిరస్కరించాడు. అంత ఒకనాడు సత్రాజిత్తు సోదరుడు ప్రసేనుడు ఆ శమంతక మణిని కంఠమున ధరించి వేటాడటానికి అడవికి వెళ్ళాడు. ఒక సింహం ఆ మణిని మాంసఖండమని భ్రమించి అతడిని చంపి ఆ మణిని తీసుకుపోతుండగా ఒక భల్లుకం ఆ సింహాన్ని చంపి మణిని తన కుమార్తె జాంబవతికి ఆటవస్తువుగా ఇచ్చింది. మరునాడు సత్రాజిత్తు సోదరుడి మృతి విని, మణి ఇవ్వలేదని కృష్ణుడు నా సోదరుడుని చంపి రత్నం అపహరించా డని పట్టణమున చాటించాడు. అది కృష్ణుడు విని చవితినాడు

**అశ్లీల సాహిత్యం మంచివారికి, చెడ్డవారికి విషతుల్యం**

పాలలో చంద్రబింబమున చూచిన దోషఫలమని అను కున్నాడు. దానిని బాపుకొనుటకై బంధుసమేతుడై అరణ్యానికి పోయి వెదుకగా ఒకచోట ప్రసేనుని కళేబరం, సింహం కాలిజాడలు, పిదప ఎలుగుబండి అడుగులు కనిపించాయి. ఆ దారిన పోవుచుండగా ఒక పర్వత గుహ ద్వారంబును చూచి పరివారమును అక్కడ విడిచి కృష్ణుడు గుహలోపలికి వెళ్ళాడు. అచట బాలిక ఉయ్యాలపై కట్టిన మణిని శ్రీకృష్ణుడు చూశాడు. దానిని తీసుకొని వెనక్కు వస్తుండగా బాలిక ఏడవడం ప్రారంభించింది.

అంత జాంబవంతుడు ఆవేశంగా వచ్చి శ్రీకృష్ణునిపైబడి అరచుచు, గోళ్ళతో గుచ్చుతూ, కోరలతో కొరుకుతూ ఘోరముగా యుద్ధము చేసెను. కృష్ణుడు వానికి బడద్రోసి వృక్షములు, రాళ్ళతోను, తుదకు ముష్టిఘాతములతోను రాత్రింబవళ్ళు తెలియక ఇరవై ఎనిమిది రోజులు యుద్ధము చేసెను. క్రమంగా జాంబవంతుని బలం క్షీణించింది. తననే ఓడిస్తున్న వ్యక్తి రావణ హంతకుడగు శ్రీరాముడే అని తెలుసుకున్నాడు. అంజలి ఘటించి "దేవాదిదేవా! ఆర్తజనపోషా! భక్తజనరక్షా! నిన్ను శ్రీరామచంద్రునిగా తెలిసికొంటిని. ఆ కాలమున నాయందలి వాత్సల్యముచే వరం కోరుకొమ్మనగా, నా బుద్ధి మాంద్యమున మీతో ద్వంద్వ యుద్ధం జేయవలెనని కోరుకున్నాను. భవిష్యత్తులో నీ కోరిక నెరవేరుతుందని మీరు సెలవిచ్చితిరి. అది మొదలు మీ నామస్మరణ చేయుచూ అనేక యుగములు గడిపాను. ఇపుడు తాము నా నివాసమునకు దయచేసి నా కోరిక నెరవేర్చారు. నాకు ఇక జీవితేచ్ఛలేదు. నా అపరాధములు క్షమించి కాపాడుము. నీ కన్న వేరు దిక్కులేదు" అంటూ భక్తితో పరిపరి విధముల ప్రార్థింప శ్రీకృష్ణుడు దయాళుడై జాంబవంతుని శరీరమంతయూ తన హస్తములచే నిమిరి భయం పోగొట్టి ఇలా అన్నాడు. శమంతక మణిని అపహరించి నట్లు నాపై ఆరోపణ వచ్చింది. అపనింద బాపుకొనుటకు ఇటు వచ్చాను. కాబట్టి మణిని ఇవ్వమని కోరాడు. జాంబ వంతుడు శ్రీకృష్ణునికి మణి, సహితముగ తన కుమార్తెనగు జాంబవతిని కానుకగా ఇచ్చాడు. అంత తన ఆలస్యమునకు పరితపించు బంధుమిత్ర సైన్యంబులకు ఆనందం కలిగించి కన్యారత్నంతోను, మణితోను శ్రీకృష్ణుడు పురం చేరుకున్నాడు. సత్రాజిత్తును రప్పించి పిన్న పెద్దలను ఒకచోట చేర్చి యావత్ వృత్తాంతమును చెప్పాడు. శమంతకమణి సత్రాజిత్తుకు తిరిగి ఇచ్చేశాడు. దాంతో సత్రాజిత్తు "అయ్యో! లేనిపోని నింద మోపి దోషమునకు పాల్పడితి"నని విచారించి "మణి సహితముగా తన కూతురగు సత్యభామను భార్యగా సమర్పించి, తప్పు క్షమించు" మని వేడుకున్నాడు. శ్రీకృష్ణుడు సత్యభామను గైకొని మణి వలదని తిరిగి ఇచ్చాడు. శ్రీకృష్ణుడు శుభముహూర్తాన జాంబవతీ సత్యభామలను పరిణయమాడాడు. అంత దేవాదులు, మునులు స్తుతించి "మీరు సమర్థులు గనుక నీలాపనింద బాపుకొంటిరి మాకేమి గతి" యనీ ప్రార్థింప శ్రీకృష్ణుడు దయాళుడై "భాద్రపద శుద్ధ చతుర్థిని ప్రమాదవ శంబున చంద్రదర్శన మయ్యేనేని ఆనాడు గణపతిని యదావిధి పూజించి ఈ శమంతక మణి కథను విని అక్షతలు శిరంబున దాల్చువారు నీలాపనిందలు పొందకుందురుగాక" అని చెప్పాడు. అంత దేవాదులు సంతోషించి, తమ ఇళ్ళకు వెళ్ళి ప్రతి సంవత్సరం భాద్రపద శుద్ధ చతుర్థియందు దేవతలు, మహర్షులు, మానవులు తమతమ శక్తికొలది గణపతిని పూజించి అభీష్టసిద్ధి పొందుతూ సుఖసంతోషాలతో ఉన్నారు.

## సంకట నాశన గణేశ స్తోత్రమ్

ప్రణమ్యశిరసా దేవం గౌరీపుత్రం వినాయకమ్ ।
భక్తావాసం స్మరేన్నిత్యం ఆయుఃకామార్థసిద్ధయే ॥

ప్రథమం వక్రతుండంచ ఏకదన్తం ద్వితీయకమ్ ।
తృతీయం కృష్ణపింగాక్షం గజవక్త్రం చతుర్థకమ్ ॥

లంబోదరం పంచమంచ షష్ఠంచ వికటమేవచ ।
సప్తమం విఘ్నరాజేంద్రం ధూమ్రవర్ణం తథాష్టకమ్ ॥

నవమం ఫాల చంద్రం చ దశమంతు వినాయకమ్ ।
ఏకాదశం గణపతిం ద్వాదశంతు గజాననమ్ ॥

ద్వాదశైతాని నామాని త్రిసంధ్యం యః పఠేన్నరః ।
నచ విఘ్నభయం తస్య సర్వసిద్ధికరం ప్రభో ॥

విద్యార్థీలభతే విద్యాం ధనార్థీలభతే ధనమ్ ।
పుత్రార్థీలభతే పుత్రాన్ మోక్షార్థీలభతే గతిమ్ ॥

జపేత్ గణపతిస్తోత్రం షడ్భిర్మాసైః ఫలం లభేత్ ।
సంవత్సరేణ సిద్ధించ లభతే నాత్ర సంశయః ॥

అష్టభ్యో బ్రాహ్మణేభ్యశ్చ లిఖిత్వాయం సమర్పయేత్ ।
తస్య విద్యా భవేత్ సర్వా గణేశస్య ప్రసాదతః ॥

(ఇతి శ్రీ నారద పురాణే సంకష్టనాశనం
గణేశస్తోత్రం సంపూర్ణం)

**పరోపకారం పుణ్యం - పరపీడనం పాపం**

కుటుంబ నిర్మాణం

# ఆచరణ ద్వారా బోధించడం మంచిది

ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం వలన మిక్కిలి ప్రయోజనం ఉంది. అయితే ఆ మాటలు పై పై మాటలుగాక, లోతుల్లోకి పోవాలి. సామాన్యంగా చాలామంది ఒకరితో ఒకరు మాట్లాడు కుంటారు. గాని, అవి ఉబుసుపోక కబుర్లుగా మిగిలి పోతాయి. మనుష్యుని జీవన విధానం, ఆచరణ ముఖ్యములు. వాటితోనే వ్యక్తులు ప్రభావితులవుతారు. తాను ఆచరించకుండా, ఇతరులకు మాత్రమే చెప్పి మాటల వలన ప్రభావం గాని, ప్రయోజనం గాని ఉండదు.

చెడ్డ మార్గంలో నడిచే పద్ధతిని అతి తేలికగా బోధించవచ్చును. దుష్టులతో సాంగత్యం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. దుర్మార్గులు ఎంత పెద్దవానినైనా అతి తక్కువ ప్రయత్నంతోనే తమవైపుకు తిప్పుకొని లాక్కోగలరు. అయితే, ఉత్తమ ఆదర్శముల వైపుకు వెళ్ళడం అంత సులభం కాదు. అందుకొరకు కేవలం తర్కవితర్కాలు, ఉపదేశాలు సరిపోవు. ఉత్తమ గుణాలతో కూడిన వ్యక్తిత్వం ఎదుట ఉంటేనే అది కుదురుతుంది. జూదగాళ్ళు, దురాచారులు, దురలవాట్లు కలవారు తమవలె అనేకులను అతి తేలికగా తయారు చేయగల్గుతారు. వారికి ఆ విధమైన సాఫల్యత కలగడానికి కారణం దురాచారముల యందు వారికి గల అచంచల విశ్వాసం. దానిని తమ నడవడిలోనికి దింపి ప్రత్యక్షంగా చూపిస్తారు. వారి మాటలు, చేతలు ఒకే విధంగా ఉంటాయి. ఆ చేతలు చెడ్డవైనా అతి నమ్మకంగా ఆచరింప బడతాయి. వ్యక్తులను ఉద్ధరించటానికి, ఉన్నతులను చేయడానికి అనేక విధాలుగా ఉపదేశాలియ్యవచ్చు. కాని, ఉపదేశించేవారి నడవడికలో అవి లేకుంటే ఆ ఉపదేశాలు వ్యర్థములే అవుతాయి. అటువంటివారు చేసే ఉపదేశాలు అవతలివారి హృదయాంత రాళం వరకు చేరవు. అటువంటి స్థితిలో ఆ ఉపదేశాల ప్రభావం తగ్గిపోతుంది. ఈ విషయం కుటుంబాన్ని నిర్మాణం చేయడంలో ఎంతో ప్రధాన మైనది. ఇంటిలోని ముఖ్యులైన వారు అతి నీచమైన పద్ధతిలో జీవిస్తూ ఉంటే, తమ పని పాటలలో యోగ్యమైన విధానాన్ని చూపక వ్యవహరిస్తూ ఉంటే, అటువంటివారు ఇంటిని బాగుచేయ పూనుకుంటే సాఫల్యత ఎంత మాత్రము లభించదు. ఇతరులు మంచివారుగా, మంచి ఆశయాలు కలవారుగా ఉండవలెనని కోరుకుంటూ, తాము మాత్రం చెడుమార్గంలో సంచరిస్తే దాని వలన హాస్యాస్పదమైన స్థితి ఏర్పడుతుంది. అటువంటి వారి వలన ధూర్తత్వాన్ని నేర్చుకోవడం జరుగుతుందేగాని, మంచి తనాన్ని అలవర్చుకోవడం అసంభవం. నీటికి పల్లానికి ప్రవహిం చడం సహజ లక్షణం. భూమికి గల గురుత్వాకర్షణ శక్తి దేన్నైనా క్రిందకు లాక్కుంటుంది. పైకి ఎత్తవలెనన్న, ప్రక్కలకు పంపవలెనన్న విశేషమైన సాధన అవసరమవుతుంది. బావిలోని నీళ్ళు పైకి తోడవలెనంటే ఏవిధంగా ప్రయత్నించాలో అందరికీ తెలిసిన విషయమే. పైకి ఎక్కవలెనంటే అలసట కలుగుతుంది. కానీ క్రిందికి పడడం అతి తేలికగా జరుగుతుంది. కుటుంబములోని వారికి చెడు పద్ధతులను నేర్పడమెవరిచేతనైనా జరుగుతుంది. వాతావరణమంతా చెడుతో నిండిపోయేయున్నది. ప్రజా సముదాయములు కూడా చెడు ప్రవృత్తులు పాలబడియున్నారు. అందువలన నికృతనే వ్యావహారిక ప్రవర్తనగా భావించటం దానినే సొంతం చేసుకొనుట సహజమైకూర్చుంది. నిప్పు ఎండిన కట్టెలను అతితేలికగా మండిస్తుంది. బలహీనమైన మనస్సుగల వారు నేర్పరి యైన అనాచారిని మార్గదర్శకునిగా ఎంచుకోవడం జరుగుతుంది. తమ ఆదర్శవాదాన్ని ఆచరణలో చూపించ గలవారు తక్కువయి పోతే అటువంటివారిని సామాన్యులు వ్యవహార జ్ఞానములేనివారుగా భావిస్తారు. అట్లే మంచి మాటలను ఈ చెవితో విని ఆ చెవితో వదిలివేస్తారు.

ఎవరికి నిజంగా తమ కుటుంబము మీదను, తమ ప్రియ జనులమీదను ప్రేమ యుండునో అట్టివారు సన్మార్గంలో నడిచే వారై యుండాలి. దానివలననే భౌతిక జీవనంలోనూ, ఆధ్యాత్మిక జీవనంలోను ఉన్నతినందవచ్చును. ముందుకు సాగవచ్చును. ప్రగతి వలన కలిగే శాశ్వత ఫలితములు మంచి వ్యక్తిగతము గల వారికే చేతికి చిక్కుతాయి. దుర్బుద్ధిగలవారు నిజాయితీ లేనందున ఎవరి దృష్టిలోనైనా పనికిరానివారుగానే పరిగణించబడతారు. అటువంటివారికి నిజమైన మిత్రులుగాని, అభివృద్ధికి సహాయ మందించేవారు గాని ఎవరూ ఉండరు. అందువలన ఉజ్జ్వలమైన భవిష్యత్తును కోరుకొనువారందరూ నిజాయితీతో సద్గుణములతో కూడియుండటానికి ప్రయత్నించాలి.

ఇతరులను బాగు చేయడానికి ముందు తనను తాను బాగు చేసుకోవాలి. బొమ్మనుగానీ, పనిముట్టునుగాని తయారు చేయా లంటే ముందు సరియైన పద్ధతిలో దాని అచ్చును తయారు చేయాలి. ఆ అచ్చులో లోపముంటే దానితో తయారయ్యే దానిలోనూ లోప ముంటుంది. అదేవిధంగా కుటుంబాన్ని ఏవిధంగా తయారు చేయాలనుకుంటారో ముందు తాము ఆవిధంగా తయారు కావాలి.

**నవ్వడం ఒక యోగం**

నమూనా ఉంటే దానివలె వస్తువు తయారవుతుంది. ఈ తయారీలో మాయ, మర్మములు పనికిరావు నిజాన్ని దాచడానికి వీలులేదు. ప్రత్యేకంగా ఈ మాట చెడు ప్రవృత్తుల విషయములో నూటికి నూరుపాళ్ళు నిజం. దానిని తెరకప్పి దాచలేము. అవి తమ నిజరూపాన్ని ఇతరులకు అతి తేలికగా అవగతమయ్యేటట్లు చేస్తాయి. లోపలొకటి, పైకొకటి చెప్పే పద్ధతి పరిచయం లేనివారి ముందు నడుస్తుందేమోగాని నిరంతరమూ తెలిసిన వారి విషయంలో అది కుదరదు. వారు సద్గుణాల మీద దృష్టి పెట్టకపోయినా, దుర్గుణాల చెడు వాసననిట్టే పట్టేస్తారు. ఈ సత్యాన్ని విస్మరించడం కుదరదు.

ఇంటిలోని పెద్దలు తమ నడవడిని మిగిలిన వారికి ఆదర్శవంతంగాను అనుసరణీయంగాను మలుచుకోవాలి. ఆ కుటుంబముతో సంపర్కము ఏర్పరచుకొనే ఇతరులను కూడా వారి నుండి నడవడి ప్రభావితం చేయాలి.

ఎవరి మనసులో ఏముందో ఎవరు ఏ రకంగా ఆలోచిస్తున్నారో అన్నది తెలుసుకోవడం అతి కష్టం. అది తెలియాలంటే ప్రత్యక్షంగా కనబడే వారి నడవడి ద్వారానే తెలుస్తుంది. దానిని బట్టే ఎవరెట్టివారో లెక్కగట్టడానికి వీలవుతుంది. అందువలననే కేవలం ఉద్దేశ్యాలకే కాక వాటిని అమలుపరిచే ప్రవర్తనకు కూడా ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఎవరు ఏమి ఆలోచిస్తున్నారో ఏమి కోరుతున్నారోనన్నది వారి మాటలను బట్టి గాక వారు చేసే పని పాటలను బట్టి తెలుస్తుంది. కుటుంబాన్ని ఏ వైపుకు తీసుకువెళ్ళాలి అన్నది కేవలం మాటల ద్వారా చెబితే సరిపోదు. వారిముందు మంచి ఆశయాలు వ్యావహారికంగా ప్రత్యక్ష ప్రమాణంతో ఆచరణాత్మకముగా కనబడాలి. అటువంటి ఆదర్శం బయట వెతికితే సరిపోదు. తనకు తాను ఉత్తమ సంస్కారాలతో వ్యవహరించే వాడుగా తన ప్రభావం కుటుంబ సభ్యులమీద పడేటట్లుగా మసలుకోవాలి.

ప్రాచీన కాలంలో పిల్లలను గురుకులానికి పంపే అలవాటు ఉండేది. అక్కడ విద్యను బోధించడంతోబాటు వానిని నడిపే గురువుల స్థాయి అసాధారణంగాను అతి ఉన్నతంగాను ఉండేది. అక్కడి వాతావరణం మిక్కిలి క్రమశిక్షణతోకూడి ఉండేది. విద్యాబోధన ఒకటే గాక, అక్కడ గల పరిస్థితుల ప్రభావం కూడా విద్యార్థులపైన ఉండేది. ఇప్పటి విద్యాలయాల్లో ఆ వాతావరణం లేదు. వాటిలో కేవలం చదువు చెప్పడం తప్ప విద్యార్థుల యొక్క వ్యక్తిగత జీవితాల్లో జరిగే హెచ్చు తగ్గులను చూచేదెవరు?

విద్యను బోధించేవారిలో వ్యక్తి నిర్మాణంలో ఉత్సాహం కనిపించవు. అందువలన ఇంటినే గురుకులంగా తీర్చిదిద్దాలి. కుటుంబాన్ని నడిపే వ్యక్తి దాని కులపతి పాత్రను నిర్వహించే ప్రయత్నం చేయాలి. ఒక కన్ను పిల్లలపైనా, మరిమొక కన్ను వారిని సంస్కరించడం మీద పెట్టాలి.

ఈ విషయం పిల్లల వరకే పరిమితం కాదు. వ్యక్తిత్వం విషయంలో వయసు మళ్ళినవారు, ముసలివారు కూడా వికసించనివారి శ్రేణిలోకే వస్తారు. వారి వయసు ఎంతదైనా సరే. చదువుకున్నవారు, చదువులేని వారు కూడా ఆ శ్రేణిలోకి చేరతారు. అందరినీ కోపతాపాలు చుట్టుముట్టి ఉంటాయి. తమ అలవాట్లు, తాము చేసే పని పాటలు మంచివని వాదిస్తారు. పిల్లలతో కన్నా పెద్దలతో వ్యవహరించడం మరీ కష్టం. లేత మొక్కను వంచడం తేలిక. కానీ మానుని వంచడం కుదరదు. అందుకు ప్రయత్నిస్తే అది విరిగిపోయే ప్రమాదం ఉంది. అటువంటి స్థితిలో ఎంతో తెలివితేటలతో చాతుర్యంతో, నెమ్మది, నెమ్మదిగా అందుకు ప్రయత్నించాలి. ఆ విధంగా వారిని త్రోవకు తేవాలి. వారికి దోషాలను, వాటి వలన కలిగే హానిని తెలుపడం కన్న సత్ప్రవృత్తులను కలిగి ఉండుటవలన కలిగే లాభాలను వివరిస్తూ ఉదాహరణలను చూపుతూ ప్రబోధించగలగాలి. నిందించడం గాని నేరారోపణ చేయడం గాని లేకుండా మంచి మార్గంలోనికి తిప్పే ప్రయత్నం చేయాలి.

కుటుంబ యజమాని కుటుంబ ఏ త్రోవన నడవాలో ఆ త్రోవలో తాను ముందు నడవాలి. ఆ విధంగా మిగిలిన వారికి తాను ప్రమాణంగా ఆదర్శంగా మార్గదర్శనం చేయాలి. అదే సరి అయిన పద్ధతి.

సిద్ధాంతాలను అర్థం చేసుకోవడం అన్నది ముఖ్యమే. వాటిని పొగడవలసినదే. అయితే అంతటితో పని జరగదు. వాటిని ఆచరణలో, కార్యకలాపాలలో ప్రత్యక్షంగా చూపించ గలగాలి. అది అలవాటుగా మారాలి. సిద్ధాంతములకు ఆచరణకు సమన్వయము ఉండాలి. ఇతరులను భ్రమలో పడవేసేటట్లుగా మంచి ఆచరణను నటించవచ్చు. లోకాన్ని భ్రమింపచేయవచ్చు. అయితే ఆ పని మరల మరల చేయడం కుదరదు. దాని ప్రభావం నిరంతరం నిలబడి ఉండదు. వాస్తవానికి ఉన్న ప్రభావం నాటకానికి ఉండదు.

మన గుణ, కర్మ, స్వభావాలలో గల లోపాలను, దుర్గుణాలను జాగ్రత్తగా గమనించుకోవాలి. వాటిని తొలగించుకొనే ఉపాయం ఆలోచించుకోవాలి. ఆ ఉపాయం ద్వారా ఇంటిలోని అందరినీ ఆత్మీయతతో మంచి సంస్కారములు కలవారుగాను, భౌతికంగా తమకాళ్ళ మీద తాము నిలబడగలవారు గాను తీర్చిదిద్ద గలగాలి. ఈ సత్యం కుటుంబంలోని సభ్యులందరికీ హృదయం గమం అయితే వారు ప్రగతి పథంలో ముందుకు సాగగలుగు తారు. తాము సుఖముగా జీవించి తమకు చెందిన అన్ని రంగాలలో వారికి సుఖశాంతులను అందించగలుగుతారు.

## నవ్వలేకపోవడం ఒక రోగం

# భారతీయులు జీవనాన్ని మరింత సంకల్ప నిష్ఠతో సాగించాలి

మన భారతదేశ ప్రజలందరం ఈ నెలలో దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. అలాగే భారతదేశంలోని సత్యము, దాని స్వరూపము, దాని యొక్క అనేక కోణములను అన్వేషిస్తున్నాము. ఈసారి జరుపుకొనబోయే స్వాతంత్ర్య దినోత్సవపర్వంలో మనందరి జిజ్ఞాస తేలికగా జాగృతం చెయ్య బడుతున్నది. 'భారత్' ఒక దేశం అంటే అది పూర్తిగా నిర్వచించినట్లు కాదు. 'భారత్' ఒక భూగోళం, ఒక చరిత్ర, ఒక సమాజము. భారతదేశానికి ఒక సునిశ్చితమైన ఆర్థిక, రాజనైతిక, సాంస్కృతిక నేపథ్యం ఉన్నది. భారతదేశమునకు సంబంధించి తెలిపిన విషయములు ఎన్నో ఉన్నప్పటికీ-తెలియని అంశములు మరెన్నో ఉన్నాయి. ఎవరి పద్ధతిలో వారు అర్థం చేసుకుంటున్నది వర్తమానమైతే; అదే రీతిలో ఎవరికి వారు భవిష్యత్తును గురించి అవలోకిస్తున్నారు. ఈ విధంగా భారతదేశమును దానియొక్క భూత-వర్తమాన-భవిష్యత్తుల నేపథ్యంలోను, బహుముఖ భౌగోళిక నేపథ్యంలోను చూడవచ్చు. వాస్తవంగా ఇప్పుడు కనిపిస్తున్నదేదైతే ఉన్నదో దానిని నిన్న-నేడు-రేపు అనే సూత్రంతో బంధించవచ్చు. ఈవిధంగా చారిత్రిక ప్రణాళిక ద్వారా మనం మన దేశానికి సంబంధించిన సత్యమును అన్వేషించగలము. వైజ్ఞానిక ప్రణాళిక ద్వారా కూడా భారతదేశంలోని సత్యాన్ని అను సంధానం చెయ్యవచ్చు. చారిత్రక, వైజ్ఞానిక ప్రణాళికలకు సంబంధించిన ఈ సమ్మిళితమైన కార్యాచరణ మన ఆలోచన లకు మరింత ప్రామాణికతను చేకూర్చగలదు.

భారతదేశపు భౌగోళికస్థితిని గమనించి చూస్తే ఇందులో ప్రకృతి ప్రసాదితమైన ఒక ప్రత్యేక సౌందర్యము కనిపిస్తుంది. భారతదేశమునకు ఒకవైపు హిమాలయములు, మూడువైపుల సముద్రములు ఉన్నాయి. పూర్వకాలంలో భారతీయ సంస్కృతీ వైభవాన్ని కీర్తిస్తూ ఉత్తరాన హిమాలయములు మొదలుకొని గంగ, యమున, సింధు నదులతో పాటు దక్షిణతీరంలోని కృష్ణ, కావేరి నదులకు కూడా నమస్కరించటం సంప్రదాయంగా ఉండేది. ఈ భూభాగంలో అంతర్గతంగా ఉన్న మరిన్ని చిన్న చిన్న భాగాలు భారతదేశపు భౌగోళిక వైవిధ్యానికి మరింత పుష్టిని కలిగిస్తున్నాయి. అందుచేత ఆధునికకాలంలో ప్రత్యేకించి ఆంగ్లేయుల పాలననుండి విముక్తికోసం పోరాడే తరుణంలో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అంశంపై ఎక్కువగా దృష్టిసారించి యావత్ భారతదేశమును ఒకేత్రాటిమీదకు తీసుకువచ్చి ఆంగ్లేయుల శక్తిని ఎదుర్కొనటమే లక్ష్యంగా ఉద్యమించటం జరిగింది.

ఈ సందర్భంగా చరిత్రకు భౌగోళికస్థితియే ముఖ్యమైన ఆధారము అనే సత్యమును మనం తెలుసుకోవలసి ఉన్నది. చరిత్ర నిర్మాణంలో భౌగోళిక సత్యాలు ప్రముఖమైన పాత్రను పోషిస్తాయి. అందుచేత భారతదేశంలో 'భిన్నత్వంలో ఏకత్వం' అనేది భౌగోళిక సత్యమే కాదు, చారిత్రక సత్యం కూడా!

భూగోళం చరిత్రను ప్రభావితం చేసినట్లుగానే చరిత్ర కూడా భూగోళాన్ని ప్రభావితం చేస్తుంది' అన్న అంశమును స్వతంత్రదినోత్సవమనే జాతీయపండుగను జరుపుకుంటున్న ఈ తరుణంలో 'ప్రస్తుతం ఉన్న భారతదేశం కాదు' అనే సత్యం స్ఫురణకు వస్తుంది. భారతదేశ చరిత్రకున్నంత ప్రాచీనత, వైవిధ్యం యూరోపుఖండ చరిత్రలో కూడా లేవు. ప్రాచీన భారతదేశపు భౌగోళిక ఉనికిలోనే ఈనాడు పాకిస్తాన్, బంగ్లాదేశ్ అనే రెండు క్రొత్త దేశాలు ఆవిర్భవించాయి. భారతదేశమనే ఉపఖండంలో ఇలా జరగటం ఇదే ప్రథమం. ఐతే 'భిన్నత్వంలో ఏకత్వం' మరియు 'ఏకత్వంలో భిన్నత్వం' అనే అంశం నాటి వలెనే నేడు కూడా యథాతథంగా ఉన్నది అనేది సత్యం.

భౌగోళిక ఉనికితో పాటు భారతదేశపు చారిత్రక నేపథ్యం కూడా స్వచ్ఛమైనది. ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియా మొదలగు ఖండాల విషయం అటుంచితే భారతదేశ చరిత్ర కున్నంత వైవిధ్యం, ప్రాచీనతా నవీన నాగరికతకు కేంద్రంగా చెప్పబడే ఐరోపాఖండపు చరిత్రలో కూడా లేవు. అయితే చైనాదేశం భారతదేశానికన్నా పెద్దది. చైనా నాగరికత కూడా ప్రాచీన మైనదే. కానీ భారతదేశచరిత్రలో ఉన్నన్ని రంగులు, ఆరోహ-అవరోహణలు చైనా నాగరికతలో లేవు. భారతదేశపు ప్రాచీన నాగరికతకు హరప్పాను ఉదాహరణగా తీసుకొనవచ్చు. ఈ నాగరికత మహారాష్ట్ర, రాజస్తాన్, హర్యానా మరియు ఉత్తర

**మతం మానవ నిర్మితం - ధర్మం దైవదత్తం**

ప్రదేశ్‌ల వరకూ వ్యాపించినట్లుగా సాక్ష్యాధారాలు లభిస్తాయి. మొహంజదారో, హరప్పాలలో లభ్యమైన 'వ్రాతలిపి' లను ఈనాటికీ చదవటం సాధ్యం కాలేదు. అయినప్పటికీ యావత్ పశ్చిమోత్తర భారతదేశంలో వ్యాపించి ఉన్న ఈ నాగరికతలో సమానతలను, భిన్నత్వాలను మనం గమనించవచ్చు.

వీటిలో ఒక ప్రముఖమైన అంశంగా సరస్వతి నాగరికతకు చెందిన ఋజువులు రావలసియున్నది. ఆ ఋజువులు బహిర్గతమైననాడు భారతదేశపు చారిత్రక ప్రాచీనత గురించి ఒక క్రొత్త అధ్యాయం తెరవబడుతుంది. ఆర్యుల మూల నివాసం, వారి రాక మొదలగు అంశములను గురించి ఎన్నో విషయాలు చెప్పబడుతున్నాయి. ద్రావిడుల విషయము అలాగే చెప్పబడు తున్నది. ఈ ఇరువురు వేర్వేరు కాదనీ, ఇద్దరూ ఒకటే (ఆర్యులు-ద్రావిడులు) అనీ చెప్పటానికి కావల్సిన ఆధారాలతో క్రొత్త తథ్యములు ప్రస్తుతం మన ముందుకొస్తున్నాయి.

వేదాలు, ఉపనిషత్తులు వంటి సంస్కృత సాహిత్యమును, సంస్కృతభాషను ఆధారంగా చేసుకొని ఇప్పటివరకు చదవలేక పోయినటువంటి లిపులను చదవటం ఇకముందు సాధ్యమవు తుందని ప్రస్తుతం జరుగుతున్న కొత్త కొత్త పరిశోధనలు వెల్లడిచేస్తున్నాయి.

ఉత్తరభారతదేశంలోని గందరగోళాల మీద ఎక్కువమందికి దృష్టి ఉండేది. ఉత్తరభారతదేశంలోని కైబరు కనుమ గుండా గ్రీకులు, శకులు, సీథియనులు, కుషాణులు వస్తుండేవారు. ఉత్తర భారతదేశంలో ఎన్నోరకాలైన అలజడులు జరుగుతున్న ప్పటికీ సామరస్యం ఉండేది. ఎందుకంటే ఇతరు లెవరైనా భారతదేశాన్ని రాజకీయంగా జయించినప్పటికీ సంస్కృతీ పరంగా పరాజితులవటమే కాక భారతీయ సమాజంలో వాళ్ళు కూడా కలిసిపోయేవారు. క్రీ.శ.8వ శతాబ్దంలో మహమ్మద్ బీన్ కాసిమ్ దండయాత్ర వలన సింధునదీ ప్రాంతంలో ఇస్లామ్ వ్యాప్తిచెందింది. అంతకన్నాముందే అరేబియా వ్యాపారులు భారతదేశపు పడమటితీరం నుండి దేశం లోపలికి జొరబడే వారు. అందుచేత దక్షిణ భారతదేశంలో ముస్లిమ్‌ల విజయం గానీ, విధ్వంసం గానీ వాటి తాలూకు చిహ్నాలేవీ లేవు. ఉత్తర భారతదేశంలో గజనీమహమ్మద్ పలుమార్లు దండ యాత్రలు చేయటంతో పాటు అంతులేని వినాశనాన్ని సృష్టించాడు. చివరకు అతడి సేవకుడైన కుతుబుద్దీన్ ఐబక్ భారతదేశంలో ఒక మహ్మదీయ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. కొన్ని శతాబ్దాల పాటు వారి పరిపాలన సాగింది. ఆఖరుకు క్రీ.శ.1757లో ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలాను ఓడించి లార్డ్‌క్లైవ్ నేతృత్వంలో ఈస్ట్ ఇండియా కంపెనీ విజయం సాధించిన తరువాతనే భారత దేశ చరిత్రలో మహ్మదీయుల వైభవం అంతమైనది.

దక్షిణ భారతదేశంలో కూడా అలజడులు తక్కువేమీ జరగ లేదు. ఢిల్లీ, పారిస్, లండన్ వంటి మహానగరాల వైభవానికి ఏమాత్రం తీసిపోని వైభవ ప్రతిష్ఠలు కలిగిన విజయనగరం రాజధానిగా విజయనగరసామ్రాజ్యం దక్షిణభారతదేశంలో స్థాపించబడినది. ఈ నగరానికి చెందిన విశేషాలను విదేశీ యాత్రికులు అద్భుతంగా వర్ణించారు. వాటిని నేటికీ మనం విజయనగర సామ్రాజ్య శిథిలాలలో చూడగలం. సంగమ రాజుల నాటి సాహిత్యంలో దక్షిణభారతదేశపు చరిత్రకు సంబంధించిన నాగరికత, సంస్కృతి విశేషాలు వాటి ఋజువు లతో సహా ఎంతో భద్రంగా జాగ్రత్తచెయ్యబడినాయి. నీలకాంత శాస్త్రిగారు ఎన్నో శ్రమలకోర్చి చేసిన అధ్యయనం దీనియొక్క బహుముఖకోణములను దర్శింపజేస్తుంది.

ఇదేవిధంగా ఈశాన్యభూభాగంలో కూడా బాగా అలజడులు చెలరేగాయి. ఆగ్నేయాసియా, టిబెట్‌ల నుండి రాకపోకలు ఎక్కువగానే జరుగుతుండేవి. ఒకసారి ఆగ్నేయాసియా నుండి వచ్చిన ప్రజలంతా కలిసి అహోమ్ రాజ్యాన్ని స్థాపించారు. దానినే ఇప్పుడు అస్సాం రాష్ట్రం అంటున్నాము. ఈశాన్య భారత దేశంలోని ఏడుగురు అక్కచెల్లెళ్ళుగా పిలవబడే ఏడు రాష్ట్రములకు (అస్సాం, అరుణాచలప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరామ్, త్రిపురా) సంబంధించిన ఇతి వృత్తములు కూడా కుతూహలాన్ని కలిగించేవే. ఈనాటి చారిత్రక అధ్యయన నేపథ్యములో భారతదేశ చరిత్రలో వీటన్నింటినీ కూడా ఒకేసారి కలిపివెయ్యవల్సిన ఆవశ్యకత ఉన్నది. అప్పుడు 'భిన్నత్వంలో ఏకత్వం' మరియు 'ఏకత్వంలో భిన్నత్వం' అనే అంశం సహజంగానే నిరూపించబడుతుంది.

భారతదేశపు చారిత్రక నేపథ్యంతో పాటు గమనించినట్లైతే ఇక్కడి సామాజిక సౌందర్యం కూడా తక్కువైనదేమీ కాదు. మానవుని సామాజిక వికాసక్రమంలో అన్నింటికన్నా ముందు నదులు, లోయల ప్రాంతములలో సాంఘిక జీవన వ్యవస్థ అభివృద్ధి చెందినట్లు చరిత్ర చెప్తున్నది. అందులో భారతదేశం ప్రథమస్థానాన్ని ఆక్రమించినదని చెప్పటానికి భారతదేశ చరిత్రలో లెక్కలేనన్ని సాక్ష్యాధారాలున్నాయి. భారతదేశంలో

**భగవంతుని భజనల రవం - మనస్సుకు సాత్విక ఆహారం**

సాంఘిక వ్యవస్థ అభివృద్ధిచెందింది. ధర్మము-అర్థము-కామము- మోక్షము అనే నాలుగు అంశములు జీవితానికి విలువలుగా నిర్ణయించబడిన వర్ణాశ్రమ విధానముతో కూడిన ఆదర్శవంతమైన జీవనవ్యవస్థ ఈ దేశంలో సాంఘికంగా అభివృద్ధిచెందింది. నేటికీ ఈ ఆదర్శముల వెనుక ఉన్న రహస్యాన్ని గమనిస్తే అందులో ఇమిడి ఉన్న సకారాత్మకమైన భావాలు అర్థమౌతాయి. వర్ణాశ్రమవ్యవస్థ అంటే 'ప్రతీ వ్యక్తి తాను దేనికి యోగ్యుడో ఆ పనిని మాత్రమే చెయ్యాలి. అలాగే నూరు సంవత్సరముల తన జీవనకాలాన్ని నాలుగు భాగములుగా విభజించుకుని అందులో మొదటి 25 సంవత్సరములు-బ్రహ్మచర్యాశ్రమంగా భావించి విద్యాధ్యయనం చేస్తూ జీవితం గడపటానికి సన్నద్ధుడు కావాలి. తర్వాత 25 సంవత్సరములు గృహస్థాశ్రమాన్ని స్వీకరించి జీవితాన్ని అనుభవించాలి. ఆపైన 25 సంవత్సరములు నెమ్మదినెమ్మదిగా గృహస్థాశ్రమం నుండి తనకు తాను విడివడుతూ ప్రజాసేవకు జీవితాన్ని ఉపయోగించాలి. ఆఖరు 25 సంవత్సరములు సన్యాసాశ్రమంలో నిర్లిప్తంగా ఉంటూ సంపూర్ణంగా సామాజికసేవ చేస్తూ విరాట్ అస్తిత్వంలోనికి లయమైపోవాలి' అని నిర్దేశించబడినది.

'తన-పర' అనే ఈ రెండింటి మధ్య ఆరోగ్యకరమైన సంబంధమును వృద్ధిచెయ్యగలిగినప్పుడే సంఘం పురోగమిస్తుంది. భారతీయ సమాజంలో దీనికి సర్వోచ్చమైన ప్రాధాన్యత ఇవ్వబడింది. **పరోపకారమే జీవితంలో అన్నింటి కన్నా గొప్ప లక్ష్యంగా నిర్ధారించబడినది. ఈ విధివిధానంలో ఒక అపశృతి చోటు చేసుకుంది. అదేమిటంటే ప్రాచీనకాలంలో వ్యక్తి చేసే కర్మను బట్టి ఏర్పడిన వర్ణవ్యవస్థ కాలక్రమంలో జన్మను బట్టిగా మారిపోయింది.** నిహితస్వార్థపరులు ఈ విభజనకారియైన వ్యవస్థను పెంచి పోషించి దానికి ఘనతను కట్టబెట్టారు. బ్రిటీష్ సామ్రాజ్య పాలకులు భారతదేశంలోని ఈ సామాజిక భేదాలకు మరింత ప్రాముఖ్యతనివ్వటంతో సమాజం హాహాకారాలు చేసింది. ధర్మము-అర్థము-కామము-మోక్షములలో లక్ష్యం 'అర్థం' లోనే కేంద్రీకృతం కాబడింది. తత్ఫలితంగా పరమార్థాన్ని మరచి స్వార్థం పరాకాష్ఠకు చేరుకుంది.

'అందరికీ న్యాయం లభించేవిధంగా అందరు అభివృద్ధి చెందే విధంగా ఒక ఆదర్శసమాజాన్ని నిర్మించే ప్రయత్నం భారతదేశంలో ప్రాచీనకాలంలోనే ప్రారంభమైనది' అని తెలియజేసే సాక్ష్యాధారాలు భారతదేశచరిత్రలో ఎన్నో మనకు లభిస్తాయి. భారతదేశంలోని అత్యంత పురాతన గణరాజ్యము ప్రాచీన సంస్కృతిలో చర్చించబడిన 'సభ-సమితి-విదథ' వంటి సంస్థల నిర్మాణమును బట్టి చూస్తే 'భారతదేశంలో పూర్వకాలం నుండే ఒక రాజనైతికవ్యవస్థను అభివృద్ధిచేసే ప్రయత్నం ప్రారంభించబడినదనీ, కాలక్రమేణా పరిపాలనలో అనుభవజ్ఞులు, ఆలోచనాపరులైన వ్యక్తులు పాల్గొనేవారనీ' మనకు అర్థమవుతోంది. ఈవిధంగా యావత్ప్రపంచంలో 'భారతదేశపు రాజనైతిక వ్యవస్థలోని ప్రజాపాలనాభారాన్ని ఒక విస్తృత ఆధారంగా తయారు చేసిన ప్రయత్నం మనకు కనిపిస్తుంది.

స్వయంగా ప్రకృతి కూడా అప్పట్లో భారతదేశానికి చాలా సహకరిస్తుండేది. భారతదేశంలోని నదులన్నీ పూర్తి స్థాయిలో నీటితో నిండి ఉండేవి. భూమి సారవంతంగా ఉండేది. పర్వతాలు ఋతుపవనాలను అడ్డగించి నేలను తడపటంలో తమవంతు కర్తవ్యాన్ని పరిపూర్ణంగా నిర్వహించేవి. రబీ-ఖరీఫ్ ఈ రెండూ కాలానుగుణ్యంగా పండవలసిన పంటలు సమృద్ధిగా పండటం చేత రైతులకు కుటీర పరిశ్రమలను వృద్ధిచెందించే అవకాశం కూడా లభించేది. ఇంత ప్రాచీనమైన చారిత్రక నేపథ్యం కలిగి ఉండటం చేత భారతదేశం 'బంగారుపిట్ట'గా పిలువబడుతుండేది. తర్వాతి కాలంలో కూడా కొంతవరకూ ఇదే స్థితి కొనసాగింది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యం స్థాపించబడిన పిదప ప్రపంచంలోనే మొట్టమొదటి పుస్తకంగా చాణక్యుడు అర్థశాస్త్రమును రచించినప్పుడు సమాజంలో చీలికలు వస్తున్నట్లు స్పష్టంగా అర్థమయ్యింది.

అయినప్పటికీ భారతదేశంలో అశోకుడు, కనిష్కుడు వంటి మహాచక్రవర్తులెందరో మనకు కనిపిస్తారు. వీరు ఐరోపా ఖండంలోని మారియోథెరిసా, రెండవ జోసెఫ్ వంటి గొప్ప గొప్ప రాజుల కన్నా గొప్ప పాలకులుగానే పేరుగాంచారు. అప్పుడే ప్రపంచంలోని మొట్టమొదటి ప్రసిద్ధ చరిత్రకారుడైన హెచ్.జీ.వేల్స్ 'ప్రపంచ చరిత్రలో అశోకుడు ధృవతార!' అని వర్ణించాడు. విక్రమాదిత్య చక్రవర్తి కూడా అదే కోవలోకి వస్తాడు. ప్రపంచంలో 'ప్రజాతంత్రపరిపాలన' ప్రారంభమై 500 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ 'మంచి పరిపాలనను' గురించి చర్చించేటప్పుడు మాత్రం తప్పకుండా అశోకుని పేరే వినిపిస్తుంది. ఇదేవిధంగా 16వ శతాబ్దంలో యూరోప్‌లోని ఎలిజబెత్, బ్రిటన్‌లో 4వ హెన్రీల పేర్లు ఘనంగా కీర్తించబడినాయి. తర్వాత 18వ శతాబ్దంలో పర్షియాలో ఫ్రెడరిక్,

**స్వర్గం అనే దివ్య సామ్రాజ్యం - భావనలోనే విరాజమానం**

ఫ్రాన్స్‌లో 14వ లూయి, 17వ శతాబ్దంలో రష్యాలో పీటర్ దిగ్రేట్ గొప్ప రాజనైతిక విధానాలను అందించినవారిగా వినుతి కెక్కారు.

'సత్యం-శివం-సుందరం' అనే మూడు అంశములు భారతదేశ సామాజిక, సాంస్కృతిక ప్రత్యేకతలుగా ఖ్యాతి గాంచాయి. ప్రపంచంలో బహుశః ఏ దేశ నాగరికత కూడా తన సంస్కృతిని ఇంత అర్థవంతంగా చిత్రీకరించలేదేమో!

సత్యం అంటే నైతికత పట్ల సత్యాన్ని కాపాడటం!

శివం అంటే మేలు లేదా హితం... అనగా నీతికి హితం చేకూరటం!

సుందరమ్ అంటే సాహిత్యం, కళలలోని సౌందర్యాన్ని గురించిన జ్ఞానం పట్ల అవగాహన కలిగి ఉండటం! వీటికి కొలమానంగా చెప్పబడ్డాయి. ఈవిధంగా ఈ సూత్రంలో మొత్తం జీవనశైలి ఇమిడ్చివేయబడింది.

17వ శతాబ్దంలో ఏంగల్స్ కూడా సంస్కృతిని గురించి విస్తృతమైన వ్యాఖ్యానం చేశాడు. ఒక పరిపూర్ణ మానవుడు అనగా ఒక సంస్కృతిపరమైన వ్యక్తి జీవితంలోని మహత్త్వా కాంక్షలు నెరవేర్చబడాలంటే ఆర్థిక, రాజనైతిక సంఘర్షణలు అనివార్యమని మార్క్స్ తెలియజేశాడు.

ప్రపంచంలోని అన్ని సంస్కృతులు మానవ జీవనాన్ని నిరంతరం సుఖవంతం చెయ్యటానికీ, మరింత ఉన్నతమైన సంస్కృతి వైపు నడిపింపజెయ్యటానికీ మార్గములు ఆలోచించాయి. అయితే భారతదేశం అందులో కూడా ముందరే ఉన్నది. ఈ దేశంలో అన్ని యుగాలలోను సంస్కృతి సాధనములు ఉత్పన్నమైనాయి. ఋషులు, మనీషులు, సాధుసత్పురుషులు, తపస్వులు, మనస్వులు వారి జీవితకాలమంతా ఇదే సాధనను చేసేవారు. మానవ జీవితం యొక్క ఔన్నత్యం కొరకు వారు సిద్ధాంతాలను ప్రతిపాదించటమే కాక వ్యావహారిక విషయాలను కూడా సూచించారు. 'భారతదేశం నాగరికత కన్నా సంస్కృతికే అధిక ప్రాముఖ్యతనిచ్చింది' అనేది వాస్తవం. భారతీయ సంస్కృతిలో సర్వేభవంతు సుఖినః మరియు వసుధైవ కుటుంబకం అనే ఆదర్శములు రేఖాంకితం చెయ్య బడ్డాయి. వీటి సారాంశంలో మనిషి-సమాజం ఈ ఇద్దరి అభివృద్ధి నిహితమై ఉన్నది. ఇవి వ్యక్తి, సమాజం ఈ రెండింటి పరిపూర్ణమైన వాస్తవిక అభివృద్ధికి రూపురేఖలు. ఇందులో మానవజీవితంలోని సృజనశీలత, ముక్తి, ఆనందం చరితార్థము కాగలవు.

ఆధునికయుగంలో స్వామివివేకానంద దీనినే 'ఆత్మనో మోక్షార్థ జగత్ హితాయచ' అని చెప్పారు. అంటే ఆత్మహితాన్ని, లోకహితాన్ని ఒకే సూత్రంలో బంధించారు. ఇదే సత్యాన్ని యుగఋషి పరమపూజ్య గురుదేవులు 'మానవునిలో దైవత్వం ఉదయించాలి. భువిపై స్వర్గం అవతరించాలి' అని చెప్పారు. ఇన్ని గొప్ప సాంస్కృతిక ఆదర్శములున్న మన దేశంలో కొన్ని వికృతులు వ్యాపిస్తూవచ్చాయి. ఎప్పటికప్పుడు వాటిని తొలగించే ప్రయత్నాలు చేస్తూవచ్చారు. ఇకముందు కూడా ఆ ప్రయత్నాలు కొనసాగించవలసి ఉంటుంది. కానీ ప్రపంచంలో ఒక అపవాదు ఉన్నది. అదేమిటంటే ఫలానా ఫలానా చక్రవర్తులు గొప్పవారు అని చెప్పారే కానీ ఫలానా సంస్కృతి, ఫలానా సాధకులు, సత్పురుషులు గొప్పవారు అని చెప్పలేదు. బుద్ధుడు, కన్‌ఫ్యూసియస్, సుకరాతు, స్వామీ వివేకానంద, శ్రీఅరవిందులు, యుగఋషి పరమపూజ్య గురుదేవులు మొదలైనవారిని 'ఎవరో ఒక గొప్ప చక్రవర్తికన్నా మరింత గొప్పవారు' అని గౌరవించి నప్పుడే సంస్కృతి యొక్క అర్థం సూచించబడుతుంది.

భారతదేశం నాగరికత, సంస్కృతిల ప్రక్రియను నిరంతరాయంగా నిలబెట్టటానికిగాను అవరోధాలు లేని విద్య యొక్క ఆవశ్యకత మీద కూడా దృష్టిసారించింది. గురుకులాలతో పాటు ఆరణ్యకాలను కూడా నిర్వహించే సంప్రదాయం ఈ దేశంలో ఉండేది. 'జీవితపు తొలిదినాలలో అందించబడే విద్య చాలు' అని భారతదేశ ప్రజలు ఎప్పుడు సరిపెట్టుకొనలేదు. ప్రౌఢవయస్సులో కూడా విద్యను అభ్యసించాలనే అంశానికి వారు ఎక్కువ ప్రోత్సాహమిచ్చేవారు. అందుచేతనే బ్రహ్మచారుల కోసం గురుకులాలు నిర్వహించబడ్డాయి. వానప్రస్థుల కోసం ఆరణ్యకాలు ఏర్పాటుచేయబడ్డాయి. భారతీయ నాగరికతలో విద్యకు సర్వోన్నత స్థానం ఇవ్వబడింది. మానవులలోని సమస్త సామర్థ్యాలను అద్భుతంగా ఆవిష్కరించగలిగే విధంగా శిక్షకులు ఉండేవారు. ప్రస్తుతకాలంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. ఇది భారతదేశమునకు మంచిది కాదు.

భారతదేశం తన యొక్క విశిష్టమైన భౌగోళికస్థితి, విస్తృతమైన చారిత్రక నేపథ్యము, సున్నితమైన సంస్కృతి, విశాలమైన నాగరికత, వైవిధ్యంతో కూడిన సమాజం... మొదలైన వివిధ అంశములలో ఏకత్వమనే శక్తిని కలిగి ఉండటం చేతనే

**లక్ష్యం లేని వ్యక్తి పేదవాడే**

మహోన్నతమైన దేశంగా ఖ్యాతిగాంచింది. భారతదేశ చరిత్రకు సంబంధించిన ఇంత సుదీర్ఘ కాలంలో ఎన్నో ఇబ్బందులు, లెక్కపెట్టలేనన్ని అవరోధాలు ఎదురయ్యాయి. వాటిలో కొన్నింటిని సహించారు. కొన్నింటిని ఎదిరించారు. ప్రతి సందర్భంలోనూ ఈ దేశపు సంస్కృతి వారి పాలిట సంజీవినీగా భాసిల్లినది. ఇక్కడి ప్రజల ఆధ్యాత్మిక శక్తి దేశానికి రక్షాశక్తిగా, జీవనీశక్తిగా పనిచేసింది.

'మేరా భారత్ మహాన్' అని పలికినప్పుడల్లా ఆ మహానత లేక ఔన్నత్యం ఒకవిధంగా మన భారత ప్రజలలో తన ఉనికిని చాటుకుంటుంటుంది. మనందరి జీవితాలలోనూ మనం ఈ 'మహానత' అనే తత్త్వాన్ని కాపాడుకొనలేకపోయినప్పుడు దేశం యొక్క గొప్పతనం కూడా క్షీణిస్తుంది.

మనది భారతదేశమైనా లేక ప్రపంచంలోని మరే ఇతర దేశమైనాసరే... దాని యొక్క ఔన్నత్యానికి కొలబద్ద ఏ వ్యక్తైనా లేక దేశమైనా పొందవలసినది ఈ జీవితవిలువలే! వ్యక్తి లేక దేశం... వీటిని పొందుటలో ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొనవలసి ఉంటుంది. ఈ ఒత్తిళ్ళు పరిస్థితుల కారణంగా కావచ్చు లేదా మానసికస్థితి నుండీ ఏర్పడవచ్చు. ఏ వ్యక్తి అయినా లేదా దేశమైనా ధైర్యంతో, నైపుణ్యంతో వీటిని ఎదుర్కొనగలిగినప్పుడే ఉన్నతమార్గం పైన నిరంతరం అగ్రగాములవుతారు. దేశ ప్రజలందరూ కలసిమెలసి సామూహికంగా తమ స్వంత అభ్యుదయంతో పాటు దేశాభ్యున్నతిని గురించి కూడా ఆలోచించినట్లయితే ఇది తప్పక సాధ్యపడుతుంది. స్వాతంత్ర్య దినోత్సవం ఈవిధమైన సంకల్పనిష్ఠతో కూడిన జీవితాన్ని గడుపుతామని మనందరినుండి ఆశిస్తున్నది. వీటికి అక్షరరూపాన్నిస్తే ఆ పంక్తులు ఈ క్రింది విధంగా ఉంటాయి. 'మంచి సంకల్పంతో మేల్కొంచు! మంచి పనులు చేసి నిద్రించు! ఉదయాన్నే నీవెక్కడ మేల్కొన్నావో అక్కడి నుండి పురోగమించి నిద్రించు!'

– అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి

---

## పిరికితనం కట్టిపెట్టి - ధైర్యము చేపట్టుమురా!

*రెండు ధాన్యపు గింజలు అనుకొనని రీతిలో నేలపై రాలిపడ్డాయి. అవి మట్టితో పూర్తిగా కప్పబడ్డాయి. రెండు రాత్రులు అవి సుఖంగా ఆదమరచి నిద్రించాయి. తరువాత రోజు ప్రాతఃకాలములో అవి నిద్రమేల్కొనగా, ఒక గింజ నుండి మొలక వెలుపలికి వచ్చింది. దీనిని చూచిన, మొలకెత్తని రెండవ విత్తనము, "సోదరా! భూమిలోనుండి పైకిరాకు! వెలుపల భీతిగొల్పెడి వాతావరణమున్నది! జనులు నిన్ను త్రవ్వి చంపేస్తారు!" అన్నది. రెండవది అంతా వింటూ, నిశ్శబ్దంగా ఎదగసాగింది. నెమ్మది నెమ్మదిగా ఎదుగుతూ, చేతికి అందనంత ఎత్తు ఎదిగి ప్రకృతి సౌందర్యాన్ని చూచి పులకించిపోయి చిరునవ్వులు చిందించసాగింది. సూర్యదేవుని కాంతిలో జలకాలాడింది. వాయుదేవుని చిరుగాలులకు వయ్యారాలొలుకుచూ ఊగింది. వరుణదేవుని చల్లని కృపావర్షములో తనివితీరా జలపానం చేసింది. పొలము యజమాని వచ్చి ఈ మొక్కను చూచి, కలియతిరిగి తృప్తితో వెళ్ళాడు. మొలకెత్తిన విత్తనము నుండి వచ్చిన మొక్క దినదిన ప్రవర్ధమానం కాసాగింది. గాలికి ఊగుతూ, పచ్చగా, ఆనందంగా ఎదుగుతూ, సంపూర్ణంగా వృక్షంగా ఎదిగింది. వృక్షంగా మారి పూలు, మొగ్గలు అనేకానేక విత్తనాలతో నిండిన పండ్లను ఇస్తు ఒకనాడు ఆ వృక్షము శాశ్వతంగా మాడువారిపోయింది. ఆత్మ సంతోషంతో నిండిన ప్రాణిలా తనలాంటి అసంఖ్యాక బీజాలను తన సంతతిగా, వారసులుగా విడచి ఆనందంగా వెళ్ళిపోయింది.*

*దీనినంతా ఆసక్తిగా మట్టి క్రింద నుండి చూస్తున్న రెండవ విత్తనము భయంతో కూడిన పశ్చాత్తాపానికిలోనై తన స్థితికి చింతిస్తూ తాను ఎక్కడ పడ్డదో అచ్చటనే ఉండిపోయిందినానని బాధపడసాగింది. తన మిత్రుడు దీనికి భిన్నంగా ధైర్యంతో ఎదిగి తన సంతతిని, అపారంగా విడచివెళ్ళుట చూచి తన దుస్థితిని తలచుకొని దుఃఖించింది. తనలోని భయానికి ఉత్సాహలేమికి చింతించింది. ఉత్సాహంతో అనునిత్యం వికసిస్తూ ఉద్యమించేవారు గొప్పవారుగా, మహాత్ములుగా ఎదుగుతారు. ఇది సత్యం.*

*హిందీ మూలం: యుగనిర్మాణ్‌యోజన, జూన్ 2017*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

---

**హృదయంలో స్వార్థం లేకపోతే - మనస్సుకు రాదు వృద్ధాప్యం**

బోధ కథ

# జీవితం క్షణభంగురం - జ్ఞానం శాశ్వతం

వేణువనం చేరుకుని రాణి కొంచెం ఆశ్చర్యపడింది మరియు కొంచెం కోపగించుకున్నది. ఆమె దృష్టి అంతా మగధ నరేశుడిని వెదుకుతూ ఉంది. తనను ఇక్కడే కలుసుకోమని అతను చెప్పాడు. కానీ మగధీశుడు ఇక్కడెక్కడా కనిపించడం లేదు. చక్రవర్తి కనిపించకపోవడం వల్ల ఆమెకు రోషం పెరిగిపోతూ ఉంది. రోషంతో, కోపంతో ఉడికిపోతున్న ఆమెను చూసి వెంట వచ్చిన దాసీజనం అంతా భయభీతులై చింతిస్తున్నారు. ఈ ఉక్రోషం, కోపం పెరిగిపోయి ఆమె ఆ దాసీలందరికీ ఏ దండన విధించ నుందో అని భయపడసాగారు.

కానీ ఆమె ధ్యాసంతా దాసీల గురించి కాక మగధ చక్రవర్తిని వెదుకుటలో ఉంది. ఆమె ఇలా వెదుకుతూనే వేణు వనంలో చాలా దూరం వచ్చేసింది. ఎంత దూరం వెదకినా కూడా ఆమెకు చక్రవర్తి దొరకలేదు. కానీ రావిచెట్టు నీడలో శాంతంగా కూర్చుని ఉన్న ఒక వ్యక్తిని చూసింది. ఆయన అర్ధ నిమీలితనేత్రుడై ఉన్నాడు. తెల్లని మేనిఛాయతో, దివ్యమైన తేజస్సుతో వెలిగిపోతున్న ముఖం గల ఒక అద్భుత సుందరాంగు డిని చూసింది. ఆయనను చూడగానే ఆమెకు ఆశ్చర్యం ఇంకా ఎక్కువైంది. ఆమె ఇంతకుముందు ఏ పురుషునిలోను ఇంతటి సౌందర్యమును చూడలేదు.

ఆమె ఆలోచిస్తూ 'ఈయనెవరు? ఈయన ఇంతటి అందగా డైయ్యుండి కూడా ఈ వనంలో కళ్ళుమూసుకుని ఎందుకు కూర్చున్నాడు? ఈయనను ఈ అందమైన ప్రపంచం ఆకర్షించటంలేదా?' అని అనుకున్నది. అంతేకాదు ఇలాంటి అనేక ప్రశ్నలు ఆమె మనస్సును బాధిస్తున్నాయి. ఆమె ఎవరో కాదు మగధదేశ మహారాణి! ఆమె రూపం మరియు అద్భుత సౌందర్యం గురించి మగధలోని ప్రజలు చర్చించుకుంటారు. స్వయంగా ఆమె కూడా తన అందాన్ని చూసుకుని చాలా గర్వ పడుతుంది. ఆమెకు తెలుసు మగధ చక్రవర్తి తన సమక్షంలోకి రాగానే సమ్మోహితుడై వివశుడౌతాడు అని. ఆమె శరీరం ఎంత కోమలంగా మరియు కమనీయంగా ఉంటుందో మనస్సు అంత పాషాణం. బహుశః గర్వాతిశయము ఆమె మనస్సును రాయి లాగా కఠోరం చేసిందేమో!!

ఈ గర్వాతిశయముతో ఆమె 'సృష్టిలో ఏ పురుషుడు తనను వంచలేడు, తన మాటను మీరలేడు, తన మనస్సును కరిగించ లేడు' అని అనుకునేది. కానీ ఈరోజు పాషాణం లాంటి తన మనస్సు కరుగుతున్నట్లు, కఠోరమైన తన భావాలు మారు తున్నట్లు, తన అతిశయం బీటలువారినట్లు అనిపించసాగింది. అతి కష్టం మీద తనను తాను నియంత్రించుకుంది. ఆయనతో ఏమి మాట్లాడాలో, ఏమి చేయాలో ఆమెకు తోచటం లేదు. అప్పుడే ఆమె పరిచారికలు ఆమె వద్దకు వచ్చారు.

అందులో ఒక పరిచారిక ఆ శాంత స్వభావుడిని చూపిస్తూ మహారాణితో ఇలా అంది. 'దేవీ! ఈయన తథాగతుడు! జ్ఞానం యొక్క ప్రకాశం పొందటానికి అందరు ఇక్కడకు వస్తారు. ఈయన సమక్షంలో జీవితం సఫలం అయ్యి సంపూర్ణంగా మారుతుందని అంటారు.' దాసీ మాటలు విని ఆమె కొంచెం ఉలిక్కిపడింది. కొన్ని విషయాలు గుర్తుకొచ్చాయి. ఈ తథాగతుడిని గురించి మగధచక్రవర్తి చర్చించగా చాలాసార్లు విన్నది. చక్రవర్తి స్వయంగా ఈయన దర్శనానికి పలుసార్లు వచ్చాడు.

చక్రవర్తి మహారాణిని కూడా తనతో వారి దర్శనానికి రమ్మని ఎన్నోమార్లు అడిగాడు. కానీ ప్రతిసారి ఆతని ఆహ్వానమును తిరస్కరించి వెళ్ళటానికి విముఖత చూపింది. జీవితమంటే సుఖసంతోషములు అని అనుకొనేది. ఈ రూప విలాసములలోనే సుఖమయమైన జీవితం ఉందనుకొనేది. సుఖమయమైన క్షణాలను విస్మరించి సౌందర్యమును ఈ తపస్సులో వాడిపోయేటట్లు చేయటం మూర్ఖత్వం అనుకొనేది. ఆమె ఈరోజు కూడా ఇక్కడకు వచ్చేదికాదు. కానీ చక్రవర్తి బింబిసారుడు ఆమెను వనవిహారానికి వేణువనంలోకి రమ్మని పిలిచాడు. దీనిని చక్రవర్తి యొక్క యుక్తి అని అనుకోవచ్చు లేదా విధివిలాసం అని అనుకోవచ్చు. ఇది మంచి శుభయోగం లేదా అనుకోకుండా జరిగిన సంఘటన అని అనుకున్నా... ఏది ఏమైనా ఆమె ఈరోజు ఇక్కడకు చేరుకున్నది.

ఏది ఎలా ఉన్నా ఇప్పటికీ ఆమె తన ఆలోచనలే సరైనవనే దృఢచిత్తంతోనే ఉన్నది. తథాగతుని దేహ సౌందర్యం ఆమెను స్పృశించిందిగానీ ఆయన భావాల యొక్క సౌందర్యం ఆమెను

**ఆత్మనిర్మాణమే అదృష్ట నిర్మాణం**

ఇంకా తాకలేదు. కానీ ఎక్కడో అనుకోకుండానే, తెలియకుండానే ఆ తథాగతుని వ్యక్తిత్వం ఆమెను అయస్కాంతంలా ఆమె అనుజ్ఞ లేకుండానే ఆయన వైపు లాగుతూ ఉంది. ఇంతలో బుద్ధ భగవానుడు తన నేత్రాలను తెరిచాడు. ఆయన కళ్ళు తెరవగానే అనేక సూర్యులు కలిస్తే వచ్చే అద్భుత ప్రకాశం ఆ వేణువనం అంతా పరచుకుందా? అని అనిపించింది. మహారాణి క్షేమ కూడా ఆశ్చర్యపడింది. కానీ తన మనస్సులోని ఆ భావనల తొట్రుపాటును ఏమాత్రం బయటకు కనిపించనీయలేదు. బుద్ధుడు తన ముందున్న ఆమెను చూసి కూడా చాలా శాంతంగా, సహజంగా ఉన్నాడు. ఆయన అదే సహజమైన స్వరంతో ఆమెను ఈవిధంగా అడిగాడు. 'అంతఃపురం వదిలి ఉన్నపాటుగా ఇక్కడకు రావటానికి గల కారణం ఏమిటి మహారాణి? రాజమందిరం లోని రాజభోగాలపై వైరాగ్యం కలిగిందా ఏమిటి?'

జవాబుగా మహారాణి క్షేమ తన రోషాన్ని ధిక్కారస్వరంలో దాచి ఇలా అన్నది. 'ఓ భిక్షుకుడా! నాకు వైరాగ్యం రాలేదు. అంతేకాక నా మనస్సులో దానిని పొందాలనే ఆలోచన కూడా లేదు. నేను నా వర్తమాన జీవితంతో చాలా తృప్తిగా ఉన్నాను. దయచేసి మగధచక్రవర్తి ఎక్కడ ఉన్నారో చెప్పండి. నేను ఆయనను వెదుక్కుంటూ ఇక్కడకు వచ్చాను.'

మహారాణి యొక్క ప్రశ్న వినగానే తథాగతుడి పెదాలమీద చిన్నపాటి మందహాసం ఉదయించింది. తథాగతుడు ఇలా అన్నాడు. 'మహారాణి! ఈ స్థానం చక్రవర్తి యొక్క వనవిహారానికి కాదు. ఇది జీవితం యొక్క విహారానికి సంబంధించిన స్థానం. చక్రవర్తి జీవితంలో ధర్మాన్ని అనుసంధానం చేయటానికి ఇక్కడకు అప్పుడప్పుడూ తప్పకుండా వచ్చేవాడు. మగధచక్రవర్తి ఇక్కడ ఉన్నాడనే భ్రమలో ఉన్నట్లున్నావు. అయినా అది స్వాభావికం కూడా. నీవు ఇప్పుడు కూడా చాలా భ్రమలను నిజం అని భ్రమపడుతున్నావు. నీవు నీ జీవితంలో చాలా తృప్తిగా ఉన్నాను అని అంటున్నావు. కానీ కొద్దిగా నిజం చెప్పు. రుచికరమైన భోజనం కడుపునిండా తిన్న కొద్ది సమయం తర్వాత నీకు మళ్ళీ అలాంటి భోజనం తినాలనే కోరిక కలగదా ఏంటి? జీవితంలో నిరంతరం సుఖసంతోషాలు సదా నిండి ఉండాలనే కోరిక కలగదా?'

తథాగతుడి ఈ ప్రశ్నలకు మహారాణి ఫక్కున నవ్వి ఇలా సమాధానం ఇచ్చింది. 'ఓ భిక్షుకుడా! నీవు నీకు ఎలా తోస్తే అలా మాట్లాడుతున్నావు. శరీరం కోసం భోజనం కావాలనే కోరిక ఏర్పడుతుంది. భోజనాన్ని వదిలేస్తే శరీరం యొక్క రక్షణ ఎలా సంభవం? అలాగే సుఖసంతోషాలు కూడా అనివార్యాలు. ప్రేమ అనేది మనస్సు యొక్క స్వాభావిక గుణం. ఆటపాటలు, సుఖసంతోషాలు మరియు భోగలాలసలల్లో పరమానందం ప్రాప్తిస్తుంది. ఇది ప్రకృతి యొక్క నియమం!'

ఈ సమాధానం విని ఆ తథాగతుడు ఇలా అన్నాడు. 'కానీ మహారాణి! ఈ ఆనందం క్షణికం కదా?'

మహారాణి ఇలా జవాబిచ్చింది. 'భిక్షుకుడా! కచ్చితంగా నిజమే!'

తథాగతుడు మళ్ళా ప్రశ్నించాడు. 'అందచందాలు స్థిరమా!'

'కాదు.' ఈసారి మహారాణి స్వరం కంపించింది.

తథాగతుని ప్రశ్నలు ఇంకా పూర్తికాలేదు. ఆయన 'మన శరీరంలోని స్థితులు పరివర్తన చెందవా?' అని అడిగాడు.

సమాధానంగా 'ఓ సౌమ్యుడా! తప్పకుండా మారుతాయి' అని అన్నది.

మహారాణి స్వరంలో తిరస్కారభావం క్రమక్రమంగా తగ్గుతూవచ్చింది. కానీ తథాగతుడు ఏమాత్రం చలించక ముందులానే శాంతంగా ప్రశ్నించాడు. 'నీ యొక్క రూపలావణ్యాలు నశించిపోయాయనుకో! నీ దంతాలు ఊడిపోయాయి. నల్లని తుమ్మెద లాంటి నీ కేశాలు శ్వేతవర్ణానికి వచ్చేస్తే, లేడి కళ్ళవంటి నీ అందమైన కనులలో కాంతి మందగిస్తే అలాంటి స్థితిలో కూడా మగధచక్రవర్తి నీయందు ఆకర్షింపబడతాడా? ఆయనకు నీ సాన్నిహిత్యంలో ఉండాలనే కోరిక కలుగుతుందా? నీమీద ఆయనకు విరక్తి కలగదా?'

ఈ ప్రశ్నలను విన్న వెంటనే మహారాణి యొక్క మనస్సు యొక్క సమ్మోహనం పటాపంచలయ్యింది. తథాగతుడు ఆమె యొక్క మనస్సు లోపల ఎక్కడో దాక్కున్న భయానికి మరియు సందేహాలకు ప్రశ్నల రూపం ఇచ్చి ఆమె ముందు ఉంచాడు. మహారాణికి తన దర్పమంతా కదిలిపోతున్న భావం కలిగింది. తన దర్పం మరియు అహంకారాన్ని ఖండించిన స్వరం తన స్వరంలో ప్రతిధ్వనించింది. తథాగతుడి ఈ ప్రశ్నలను విన్న తరువాత మహారాణి క్షేమకి అనేకమంది వృద్ధమహిళల ముఖాలు కళ్ళముందు కదలాడాయి. వారి దంతాలు లేని ముఖాలతో పాటు వారి వృద్ధాప్యంలోని దుర్దశ కూడా స్మరణకు వచ్చింది.

**ఆధ్యాత్మికతకు మూలమంత్రం ప్రేమ**

తన కళ్ళముందు భీతావహమైన భవిష్యత్తు యొక్క చిత్రం స్పష్టంగా కనిపించడం ప్రారంభించింది. ఆమె చలించిపోయింది. శరీరం కంపించడం మొదలయ్యింది. కాళ్ళలో వణుకు పుట్టింది. ఆమె నిశ్చేష్టురాలైంది. ఆమె ఎక్కడైతే నుంచున్నదో అక్కడే క్రింద కుప్పకూలిపోయింది. మహారాణి యొక్క ఈ పరిస్థితిని చూసి బుద్ధుడు 'ఓ మగధేశ్వరి! నువ్వు భయంతో కంపించిపోతూ ఉన్న నీ భావావస్థే నా ప్రశ్నలకు నీ సమాధానం. ఇప్పుడు నీ అంతట నువ్వు నిశ్చయించుకో. రూపం మీద దురభిమానంతో, భోగవిలాసాలలో, ఆటపాటలలో మంచిని, శుభాన్ని చూడటం 'మనకు భగవంతుడిచ్చిన బహుమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవడం అనేది మూర్ఖత్వం కాదా?' ఇలా చెప్పి తిరిగి బుద్ధుడు తన మాటను కొనసాగించాడు.

**సుభానుపస్మి విహరన్తం ఇన్ద్రియేషు అసంవ్రతం ।**
**భోజనమ్హి అమత్తుఞ్ఞం కుసీతం హీన వీరియం ।**
**తం వే పసహతి మారో వాతో రుక్ఖం వ దుర్బలం ॥**

అర్థం: తుఫాను బలహీనమైన వృక్షమును కూకటివ్రేళ్ళతో సహా పెకలించి ఎలా కూల్చివేస్తుందో అలాగే ప్రాపంచిక విషయాల మీద మోహంతో తిరిగేవాడు, ఇంద్రియలోలుడు, వ్యక్తిత్వం లేనివాడు, భోజనంలో మితాన్ని పాటించనివాడు, సోమరిపోతు కూడా అలాగే కూలిపోతాడు.'

బుద్ధుని ఈ బోధనలను విన్న మహారాణి క్షేమకు ధైర్యాన్ని తెచ్చుకోవటం కఠినతరమయ్యింది. ఆమె బుద్ధుని చరణములపై పడి ఇలా అన్నది. 'ఓ బుద్ధదేవా! మీరు నామీద చాలా దయ చూపారు. మీరు నా మోహాన్ని భగ్నమొనరించారు. నేను ఇప్పటి వరకూ అంధకారంలో తిరుగుతూ ఉన్నాను. మీరిప్పుడు నన్ను మీ శరణులోకి తీసుకోండి.' మహారాణిలో మహత్త్వపూర్ణమైన మార్పు వచ్చిన క్షణాలలోనే చక్రవర్తి బింబిసారుడు కూడా అక్కడకు చేరుకున్నాడు. ఆయన కూడా మహారాణితో పాటు 'బుద్ధం శరణం గచ్ఛామి!' అనే సత్యం యొక్క అనుభూతి చెంది కృతార్థుడయ్యాడు. – అనువాదం: *శ్రీమతి స్వప్న*

---

## అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం - 2018 మంగళగిరి
## 10.09.2017న జరుగబోవు కార్యకర్తల సమావేశానికి ఆహ్వానం

*ఆదరణీయ సోదర, సోదరీమణులారా,*

*మీరంతా ఆనందంగా, ప్రసన్నంగా ఉన్నారని భావిస్తున్నాము. పరమపూజ్యగురుదేవులు జ్ఞానాన్ని లాల్‌మషాల్ రూపంలో (ఎర్రకాగడా) వెలిగించారు. దాని ప్రకాశంలో లక్షలాది ఆత్మల ద్వారా భగవంతుని పనులు నెరవేర్చబడుచున్నాయి. తద్వారా మనుష్యులలో దైవత్వం మరియు భూమిపై స్వర్గీయ వాతావరణం నెలకొనెడి స్వప్నం నిజరూపం దాల్చుచున్నది. ఈ పుణ్యకార్యంలో మీరు చూపిన సమర్పణ, శ్రద్ధ చూసి మా హృదయం పరవశించి పోవుచున్నది.*

*ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి పట్టణం, అమరావతి రాజధాని ప్రాంతంలో **5 నుండి 8 జనవరి 2018లో అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము** సంపన్నం కానున్నది. ఈ మహాయజ్ఞ వ్యవస్థను నిర్మించుటకై దక్షిణ దేశంలోని వరిష్ఠ పరిజనులతో ఒక గోష్ఠిని **10 సెప్టెంబరు 2017 మంగళగిరిలో ఎన్.ఆర్.ఐ. వైద్యకళాశాలలోని యజ్ఞస్థలి ప్రాంగణంలో ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు నిర్వహింపనున్నాం.** ఈ సమావేశంలో అశ్వమేధ యజ్ఞం బాధ్యతలను ఆయా కార్యకర్తలకు అప్పగించబడును. ఈ సమావేశంలో మీ వ్యక్తిగత హాజరు తప్పనిసరి. కావున మీ రాకను తెలుపుచూ మాకు తప్పనిసరిగా ఈ-మెయిల్ ద్వారా లేక వ్రాతపూర్వకంగా లేక టెలిఫోన్ ద్వారా తెలియజేయగలరు. గురుపూర్ణిమ సందర్భంగా గాయత్రీ పరివార్ అందరికి, వారి కుటుంబ సభ్యులకు ఉజ్జ్వల భవిష్యత్తు మరియు మంగళ మయజీవనం గురుదేవుల కృపతో నిండిన ఆశీర్వాదం అందరికి లభించాలని కోరుచూ ఆ గురుసత్తాను ప్రార్థిస్తున్నాం. మీ కుశలతను, మీ కోర్కెలను తెలుపుచూ మాకు వ్రాయండి.*

ఇట్లు మీ సోదరి
**శైలబాల పండ్యా**

---

**ప్రేమ ఇస్తుంది, క్షమిస్తుంది**

వ్యక్తి నిర్మాణం

# విజయానికి మూడు మెట్లు

పుట్టుకతో ఒకే రకమైన సామర్థ్యాలు కలిగినప్పటికీ కొందరు ఏ రంగంలోనైనా రాణించి మంచి ఫలితాన్ని పొందుతారు. కొందరు జీవన పర్యంతం దీనావస్థలో దారిద్ర్యంలో ఉంటూ ఏ రంగంలో కూడా విజయం సాధించలేరు. వీరు జీవితాంతం ఇతరుల మీద ఆధారపడుతూ జీవితాన్ని భారంగా నెట్టుకుంటూ వస్తారు. ఒకరి సఫలతకు, మరొకరి అసఫలతకు మూల కారణాలేమిటనే ప్రశ్న మనసులో మెదులుతుంది. ఒకరిలో ఉన్న ప్రత్యేకత ఏమిటి? మరియొకరిలో లోపించినదేమిటి?

ఏ రంగంలోనైనా సఫలత పొందాలంటే మూడు సూత్రాలను ఆలంబనగా తీసుకోవాలి. 1) లక్ష్యాన్ని నిర్ణయిం చడం, 2) దాని యందు అభిరుచి లేదా ఆసక్తి. 3) సమర్థత యొక్క సదుపయోగం. ఈ సూత్రాలననుసరించిన వారికి విజయము ఎక్కడైనా తథ్యం.

సమాజంలో చాలామందికి ఒక లక్ష్యమంటూ ఉండదు. ఇతర వ్యక్తుల సఫలతలను చూచి తమకు కూడ అలాంటి అదృష్టం ఉండాలనుకుంటారు. కానీ చేసే పనులలో స్థిరత్వ ముండదు. ఒకసారి ఒక పనిని చేయాలనుకుంటారు. తరువాత వేరే పని మీద మనసుపోతుంది. ఒకు విద్వాంసుని చూచి విద్వాంసుడు కావాలనీ, కళాకారుని చూచి కళాకారుడు కావాలనీ మనస్సు ఉవ్విళ్ళూరుతుంది. ఒకసారి బలవంతుడు కావాలని ఆలోచిస్తే, మరొకసారి ధనవంతుడు కావాలని అనుకుంటాడు. తనదంటూ ఒక లక్ష్యాన్ని నిర్ధారించుకోలేడు. కోతిలాగ మనసు చంచలమవుతుంటుంది. ఫలితంగా తనకున్న యోగ్యతను ఏ దిశలోనూ వినియోగించుకోలేకపోతాడు. చంచలత్వము వలన ప్రయోజనం సవ్యంగా నెరవేరదు. అసఫలతే అన్నీ చోట్లా ఎదురవుతుంది.

దేశాటనం చేయడానికి నావికునికి ఆ దేశపటం దిక్సూచీ ఎలా అవసరమో, అలా మానవునికి జీవితంలో ఒక నిర్దిష్టమైన లక్ష్యం ఆవశ్యకం. తాను ఏమి కావాలి ఏ పని చేయాలి అనే ఆలోచనలను నిరంతరం కలిగి ఉన్నప్పుడు ఆ విధంగా అతను శ్రమిస్తాడు. నావికునికి తాను చేరవలసిన చివరి రేవోదో తెలియనప్పుడు అతడికి అనుకూలమైన గాలి వీచదు, అనేది ఒక సామెత. అంటే అతను సముద్రంలో నిరర్థకంగా తిరుగు తుంటాడని.

సఫలతకు రెండవ సూత్రం ఆసక్తిని లేదా అభిరుచిని కలిగి ఉండడం. ఏ లక్ష్యాన్ని ఎంచుకుంటారో దాని పట్ల ఉత్సాహం, ఉల్లాసం ఉండాలి. ఆ పని మీదే మనస్సును కేంద్రీకరించాలి. లక్ష్యాన్ని గురించి ఏ విధమైన ఉల్లాసం గాని ఉత్సాహం గాని లేకుండా మనస్సును లగ్నం చేయకుండా పనిచేస్తే సఫలత ఎప్పుడూ అనుమానస్పదమే. సగం మనస్సుతో ఎన్నడూ లాభించదు. మనోవిజ్ఞాన సిద్ధాంత ప్రకారం ఉత్సాహ ఉల్లాసాలతో శక్తి ప్రవహిస్తుంది. ఇవి లేకపోతే మానసిక శక్తి పరిపూర్ణంగా ఉన్నప్పటికీ కార్యం సక్రమంగా నెరవేరదు.

ఏ పనికైనా ఉత్సాహం ప్రాణం. శరీరంలో ప్రాణవాయువు లాగా అది మన లక్ష్యాన్ని గతిశీలం చేయడంలో మహత్తరమైన భూమిను నిర్వహిస్తుంది. ఉత్సాహమనే అగ్ని కార్యసంచలనానికి ఆవిరిని ఉత్పన్నం చేస్తుంది. అది యౌవన లక్షణం. అభిరుచి అంటే ఏ లక్ష్యన్నయితే నిర్ధారించుకున్నామో దాని ముందు మనస్సును పూర్తిగా లగ్నం చేయడం, ఉత్సాహం ఏ మాత్రం తగ్గకుండా ఉండడం. సాధారణంగా ఏ పనిలోనైనా పని ప్రారంభించినప్పుడున్న ఉత్సాహం తరువాత ఉండదు. లక్ష్య సాధన కొరకు ఎంతటి తత్పరత, తన్మయత అవసరమో అంతటి తత్పరత తన్మయత తప్పనిసరిగా ఉండాలి. లేనట్లయితే పూర్తి సఫలత లభించదు.

విజయాన్ని సాధించడానికి మూడవ సూత్రం సామర్థ్యాన్ని సదుపయోగం చేసుకోవడం. మనకున్న అన్ని సంపదల్లో సమయం అత్యంత మహత్తరమైనది. శరీరం మస్తిష్కం మనస్సు వీటి సామర్థ్యంతోపాటు సమయమనే సంపదను కూడా సరైన రీతిలో ఉపయోగించాలి. అప్పుడే అసామాన్యమైన లబ్ధిని పొందడం సాధ్యమవుతుంది. నిర్ధారిత లక్ష్యం దిశగా ప్రతి క్షణాన్ని సదుపయోగపరచినట్లయితే అద్భుతమైన ఫలితాలు కలుగుతాయి. ఒక్క శరీర పరిశ్రమే చాలదు. మెదడు యొక్క

**స్వార్థం తీసుకుంటుంది, మరచిపోతుంది**

శక్తిని పరిపూర్ణంగా వినియోగించాలి. మెదడులో ఎన్నో భావాలు ఉంటాయి. భావాలు అస్తవ్యస్తమై సరైన దిశలో ప్రయాణించి నప్పుడు ఆ శక్తిలో అధికాంశము వ్యర్థమైపోతుంది. శక్తి అటూ ఇటూ చెదిరినప్పుడు విశేషలాభం కలుగదు. సూర్యకిరణాలు అంతటా వ్యాపించినందున ఆ తీవ్రత మనకు తెలియదు. భూతద్దము పైన కేంద్రీకృతమైనప్పుడు అగ్ని కనిపిస్తుంది. మెదడుకూ ఈ సూత్రం వర్తిస్తుంది.

సఫలురు, అసఫలురు వీరిద్దరి సామర్థ్యం, యోగ్యత ఇతర బాహ్య పరిస్థితులను పోల్చినప్పుడు పెద్ద వ్యత్యాసమేమీ కనపడదు. కానీ ఇద్దరి పరిస్థితులలోనూ ఆకాశానికి, భూమికి ఉన్నంత వ్యత్యాసం కనపడుతుంది. దీనికి ఒకటే కారణం. ఒకరు తన సామర్థ్యాన్ని నిర్ణీత లక్ష్యం వైపు వినియోగించాడు. రెండవ వాని జీవితం లక్ష్యవిహీనం. అందువల్ల అస్తవ్యస్త మయింది. సఫలము, శ్రేష్ఠమూ అయిన జీవితానికి వీటిని అవగతం చేసుకోవడం ముఖ్యం. కానీ మంచి, చెడుల వివేకం ఎల్లప్పుడూ ఉండదు. మనస్సు వికలమైనప్పుడు మనిషి దుష్కర్మల వైపు ప్రేరేపించబడతాడు. ఏవో కొన్ని లోపాలు అందరిలోనూ ఉంటాయి. సంపూర్ణ సదాచార సంపన్నులు బహుకొద్ది మందే ఉంటారు. అధిక శాతం వ్యక్తుల్లో ఏదో కొంత చెడు తప్పక ఉంటుంది. ఈ ప్రపంచం మంచి చెడుల సమ్మేళనం.

మానవుని జీవితంలో లోపాలుండడం సహజం. కానీ నూటికి 99 మంది తాము ఎంత పెద్ద తప్పును చేసినా తాము దోషులమని తలంచరు.

తప్పును ఒప్పుకోవడంలో నష్టమేమీ ఉండదు. మనస్సు నిర్మలమైనప్పుడు భవిష్యత్తులో మనస్సు ఆరోగ్యంగానూ, జాగరూకతతోనూ ఉంటుంది. తన తప్పును తప్పుగా ఒప్పుకోని మనిషిలో దుస్సాహసము పెంపొంది, అతడు నేరాలు చేయడంలోనే ఆనందాన్ననుభవిస్తాడు. దాచిన తప్పులు ఎన్నో అనర్థాలను సృష్టిస్తాయి. వాతావరణం ఎక్కువ విషపూరితం కాకుండా ఉండాలంటే దోషాలను బయటకు తెలపాలి. దోషాలను అంగీకరించక దాచినట్లయితే వాటి వ్రేళ్ళు మస్తిష్కంలో లోతుగా నాటుకుపోయి బలిష్టమవుతాయి. అలాంటప్పుడు వందసార్లు దండన విధించినా అవి వదిలిపోవు. ఆనకట్టతో అడ్డుకొన్న నీళ్ళలా ఎక్కడ బలహీనత కనిపిస్తే అక్కడకే పరుగెత్తుతాడు. దాంతో అతనికి అశాంతి పెరిగి శక్తంతా దుర్వినియోగమవుతుంది. నిర్మాణాత్మకం, గుణాత్మకం అయిన జీవితంలోని సుఖాన్ని, ఆనందాన్నీ అతడు పోగొట్టుకుంటాడు. ఆత్మకళ్యాణాన్ని కోరుకొనేవాడు మనోగత దోషాల్ని సవరించు కోవడానికి చాలా ప్రయాసపడాలి. దోషాల్ని ప్రకటించినప్పుడు మస్తిష్కంలోని బరువు తగ్గి అది తేలిక అవుతుంది. ఆత్మవికాసం దిశగా మనిషి పురోగమిస్తాడు.

– *అనువాదం: కె. అరవిందమ్మ*

## త్యజించవలసింది గృహాన్ని కాదు - మనోవికారాలను

*"ఒక వ్యక్తి తన నలుగురు బిడ్డలను అనాథలను చేసి అర్థరాత్రి ఇల్లు వదలి ఆత్మకళ్యాణానికి బయలుదేరాడు. ఒక మహాత్ముడిని దర్శించి తాను సంసార సాగరంలో పడి కొట్టుకుపోతున్నానని, మోహబంధాలైన భార్యబిడ్డలను త్యజించివచ్చానని భగవత్ సాక్షాత్కారానికేదైనా దారిచూపు మని ప్రాధేయపడసాగాడు. దానికి మహాత్ముడు "మూర్ఖుడా! భార్యాబిడ్డలు మోహబంధాలు ఎంతమాత్రం కాదు. వారి రూపంలోనే దైవం నీ ఇంట కొలువున్నాడు. నీ వద్దనే ఉన్న దైవాలను వదలివచ్చి ఇక్కడేమి దర్శించగలవు? వెళ్ళి వారిని సేవించు. ఉద్ధరించబడతావు. కర్తవ్య నిర్వహణను మించిన ఆత్మ సాక్షాత్కారం లేదు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ జీవితాన్ని గడుపు. ఆధ్యాత్మికత అనేది భార్యాబిడ్డలను వదలి పారిపోయే పిరికివాళ్ళకు, సాధ్యం కాదు. శూరులు, వీరులే ఆధ్యాత్మిక జగత్తులో జీవించ గలుగుతారు. గృహస్థాశ్రమంలో సాధన దానంతట అదే జరిగిపోతుంది. కాబట్టి ఇంటికి తిరిగివెళ్ళి నీవు త్యజించాలనుకొంటే నీ మనోవికారాలను, భ్రమలను త్యజించు. ఇంటిని, భార్యాబిడ్డలను త్యజించటం వలన ప్రయోజనమేమీ ఉండదని తెలియజేశాడు. ఆ మాటలు, వచ్చిన వ్యక్తికి పశ్చాత్తాపాన్ని కలిగించాయి. మహాత్మునికి పాదాభివందనం చేసి, వ్యవహారిక సాధనాక్షేత్రమైన తన ఇంటికి ఆనందంగా తిరిగి వెళ్ళాడు.*


– ప్రజ్ఞాపురాణం నుండి
అనువాదం: *శ్రీమతి గౌరీ సావిత్రి*

**ఆరోగ్యం లేకుంటే ఎన్ని ఆస్తులున్నా వృథా**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికత యొక్క అసలైన సంపదలు-3

*ఆధ్యాత్మికతకు సమయానుసారమైన వ్యాఖ్యానాన్ని తెలియజేస్తూ 'భగవంతుడు ఆధ్యాత్మికతను మానవ జీవితానికి సర్వోత్తమమైన సంపదరూపంలో ప్రసాదించాడు' అని పరమపూజ్య గురుదేవులు ప్రవచించినట్లు గత సంచికలో మీరు చదివి ఉన్నారు. సాధారణమైన మనుష్యులు ఆధ్యాత్మికత అంటే 'ఏదో ఒక గారడీ, అద్భుతం' వంటివాటితో ముడిపడి ఉందనుకుంటుంటారు. కానీ నిజానికి ఆధ్యాత్మికత యొక్క అసలైన అర్థం 'దృష్టికోణంలో మార్పుతెచ్చుకోవటం'గా మనం తెలుసుకోవాలి' అని చెప్తూ పూజ్యగురుదేవులు ఆధ్యాత్మికతకు భౌతికమైన నిర్వచనాన్ని ఇస్తూ 'ఆధ్యాత్మికపథంపై పయనించే వ్యక్తి భౌతికపరమైన అన్ని సంపదలకు అధికారి కాగలడు, వాటికోసం అతడు విశేషమైన ప్రయత్నాలు చెయ్యవలసిన పనిలేదు. బుద్ధభగవానుడు, స్వామివివేకానందలతో పాటు స్వయంగా తమను తాము ఉదాహరించుకుంటూ యుగఋషియైన పూజ్యగురుదేవులు 'ఆధ్యాత్మిక చింతనే ధ్యేయంగా కలిగిన వ్యక్తి సమస్త సంపదలకు హక్కుదారుడు కాగలడు' అని వివరిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమం చేసుకుందాం!*



## ఆధ్యాత్మిక సంపద యొక్క ఒక ఉదాహరణ

బుద్ధభగవానుని జన్మస్థానం గురించి చరిత్రకారులు చాలా పరిశోధనలు చేశారు. నేపాల్‌లోని 'కపిలవస్తు' నగరంగా కొంతమంది అభిప్రాయపడితే, కొంతమంది అసలు కచ్చితమైన సమాచారం ప్రకారం బుద్ధుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఒక బస్తీకి చెందిన 'హరైయ్యా' అనే గ్రామంలో జన్మించినట్లు తెలుస్తున్నది. హరైయ్యాగ్రామంలోని ఒక చిన్న జాగీర్దారు కుటుంబంలో ఆయన జన్మించాడు. ఆయన తండ్రి జమిందారు. ఈ విషయములన్నీ అక్కడ లభించిన అనేకానేక ప్రాచీన శిలాఫలకాల ద్వారా బుజువుచెయ్యబడ్డాయి.

## ఆధ్యాత్మిక శక్తి యొక్క భౌతిక ఉపలబ్ధులు

బుద్ధభగవానుడి జీవితంలో ఆధ్యాత్మికత ప్రవేశించిన పిదప ఏమి జరిగింది? ఆధ్యాత్మికత ద్వారా లభించే అత్యంత శక్తివంతమైన భౌతికపక్షమును గురించే మనం చెప్పుకుంటున్నాము. బుద్ధుని ధనసంపదలను మీరు చూసుందరు. ఎల్లోరా, అజంతా గుహలు, సాంచీస్థూపం, రంగూన్‌లోని స్వర్ణమందిరము ఆయన వైభవానికి కొన్ని ఉదాహరణలు. 'జావాద్వీపంలో' సుమారు $4^1/_2$ టన్నుల బంగారంతో తయారైన బుద్ధ భగవానుడి స్వర్ణ ప్రతిమతో కూడిన ఆలయం ఉన్నది. ఇంకా బుద్ధుని భవనాలు అంకోర్‌వాట్‌లోను, కంబోడియాలోను ఉన్నాయి. అవి ఎంత వైభవోపేతంగా, ఘనంగా ఉంటాయో చూసి తీరవల్సిందే. వాటిని పరిరక్షించటానికి యునెస్కో తగిన ఏర్పాట్లు చేసింది. ప్రతి పదిహేను రోజులకు ఒక విమానం అందులో ప్రయాణీకులు నిండినా-నిండకపోయినా సరే కంబోడియాకు వస్తుంది. యాత్రికులు అక్కడున్న ఘనమైన శిథిలాలను చూసి ఆనందిస్తారు.

## బుద్ధుని ఆధ్యాత్మిక సంపద

ఎల్లోరాగుహలలోను, నలందా విశ్వవిద్యాలయంలోను ఒక్కసారే 30,000 మంది విద్యార్థులు చదువుకుంటుండేవారు. అంతమంది విద్యార్థుల చదువు, భోజనం, బట్టలు మొదలైన వాటన్నింటికయ్యే ఖర్చును ఆ విశ్వవిద్యాలయమే భరించవలసి వచ్చేది. ఆకాలంలో బేంక్‌లు, మనిఆర్డర్‌లు, చెక్‌బుక్‌ల లాంటి సదుపాయాలేవీ లేవుకదా! సమస్తము బుద్ధుడే ఏర్పాటు చేసేవాడు. తక్షశిల విశ్వవిద్యాలయం దీనికన్నా మరింత పెద్దది. బుద్ధుడు అక్కడినుండి ఆసియాఖండం మొత్తంలోను బౌద్ధ మతాన్ని వ్యాపింపజెయ్యటానికి ఏర్పాటుచేశాడు. ఈ విశ్వ విద్యాలయానికి సంబంధించిన ఖర్చునంతటినీ హర్షవర్ధనుడనే రాజు భరించేవాడని మనం చరిత్రలో చదువుకున్నాం. చమురు

అదృష్టం మీద నమ్మకం పెట్టుకోవడం, ఒక మానసిక దౌర్బల్యం

బావులు సమృద్ధిగా ఉన్న అరబ్బుదేశాలలో కూడా ప్రాచీన కాలపు భవంతులను, వస్తువులను పరిశీలిస్తే పూర్వం అక్కడ బౌద్ధవిహారాలు ఉండేవని తెలుస్తుంది. ప్రస్తుతకాలంలో చైనాలో కమ్యూనిస్ట్ ప్రభుత్వం నడుస్తున్నది. ఇంతకుముందు చైనాదేశం యావత్తూ బౌద్ధమతమే నిండి ఉండేది. ఇక్కడినుండి ఆయా దేశాలకు ఎంతోమంది ప్రచారకులను, సాహిత్యాన్ని పంపించటం జరిగింది. హర్షవర్ధనుడు తన సమస్త సంపదలను బుద్ధుని పాదాలచెంత సమర్పించాడు.

ఆమ్రపాలి వద్ద సుమారు 30,35 కోట్ల రూపాయల విలువ చేసే సంపద ఉండేది. బౌద్ధభిక్షిణిగా మారిన పిదప ఆమె తన సంపదనంతా బుద్ధునికి సమర్పించింది. సింగపూర్ మొదలుకొని ఇండోనేషియా వరకూ పడవలపై ప్రయాణిస్తూ ఆమె బౌద్ధమత ప్రచారానికి కృషిచేసింది.

## అంగుళీమాలుని హృదయపరివర్తన

అంగుళీమాలుని వద్ద కూడా దాదాపు అంత సంపద ఉండేది. అతడు కూడా తన సంపదనంతా బుద్ధునికి సమర్పణ చేశాడు. ఆమ్రపాలి, అంగుళీమాలుడు, హర్షవర్ధనుడు, అశోకుడు ... ఇంకా ఎందరెందరో లెక్కపెట్టలేనంతమంది తమతమ అపూర్వ సంపదలనన్నింటినీ బుద్ధునికి సమర్పించుకున్నారు.

అంగుళీమాలుడు కత్తిదూసి వధిస్తానంటూ బుద్ధుని పైకి వచ్చాడు. బుద్ధుడు 'మంచిది. ఖండించు నా శిరస్సును' అంటూ తలవంచాడు. కొద్ది క్షణాల పిదప తలెత్తి చూస్తే అంగుళీ మాలుడు నేలపైబడి రోదిస్తూ 'స్వామి! నేను మిమ్మల్ని బాధించటానికి వచ్చాను' ఈ దుర్మార్గుడిని క్షమించండి అని ప్రార్థించాడు. బుద్ధుడు అతనిని పైకి లేవనెత్తి హృదయానికి హత్తుకున్నాడు. అలాగే వేలాదిమందిని పతనంలోకి తోసివేసిన స్త్రీ ఆమ్రపాలి. కన్నులు మిరుమిట్లు గొలిపే సౌందర్యంతో ఆమె బుద్ధభగవానుడి బ్రహ్మచర్యాన్ని సవాలుచేస్తూ ఆయనను ఎదుర్కొన్నది. కానీ బుద్ధుడు దృష్టిసారించిన మరుక్షణమే ఆమెలో వివేకం జాగృతమై బౌద్ధభిక్షిణిగా మారింది. బుద్ధుడు అంగుళీమాలునితో 'నువ్వు బందిపోటు వేషాన్ని ధరించావే కానీ వాస్తవానికి నీవు ఒక సాధుసన్యాసివి. ఆ బందిపోటు చిహ్నాలన్నీ తొలగించివెయ్యి' అనగానే అతడు తన మెడలోని అంగుళీమాలను తీసివేశాడు. అంతకు పూర్వం అతడు బంది పోటుగా జీవిస్తున్నప్పుడు వేలాదిమంది ప్రజలను కొట్టి, హింసించి వారి దగ్గరున్న వస్తుసంపదనంతటినీ దోచుకునేవాడు. వేలాదిమంది పిల్లల కాలివ్రేళ్ళను ఖండించి వాటిని మాలగా గ్రుచ్చి మెడలో వేసుకునేవాడు. అటువంటి వ్యక్తి ఈనాడు సాధుపురుషుడైనాడు. ఇది బుద్ధుని యొక్క ఆధ్యాత్మిక శక్తి. ఆయన ధర్మచక్రప్రవర్తనను మాధ్యమంగా తీసుకొని లక్షలాది, కోట్లాదిమంది ప్రజల హృదయాలను, మస్తిష్కాలను మార్చివేయ గలిగాడు. ఆనాడు సమాజంలో అమలుజరుగుతున్న అనేక దురాచారాలను రూపుమాపాడు. ఝంఝూమారుతం వలె ప్రజలను చైతన్యపరచి సమాజాన్ని చక్కదిద్దాడు.

## స్వామి వివేకానంద - ఒక మంచి ఉదాహరణ

ఈ సందర్భంగా మరో ఉదాహరణను చెప్పుకొనగలము. వారే శ్రీవివేకానందులవారు. ఆయన శ్రీరామకృష్ణపరమహంస గారి చెంతకు ఉద్యోగం కావాలని వచ్చాడు. అంతకు కొద్దికాలం క్రితమే వివేకానందుని తండ్రి మరణించాడు. ముగ్గురు అన్న దమ్ములు, ఒక సోదరి, తల్లి, తాను నిరాధారంగా మిగిలి పోయారు. కడుపునిండే మార్గమేదీ కనపడటం లేదు. అటువంటి పరిస్థితులలో ఏదైనా ఉద్యోగం ఇప్పించమని పరమహంస గారిని వేడుకున్నాడు వివేకానందుడు. అయితే ఆయన తాను స్వయంగా ఉద్యోగం ఇప్పించకుండా కాళీమాతను వేడుకొనమని చెప్పాడు. సరే వివేకానందుడు కాళీమాతను ప్రార్థించగా ఆమె ప్రత్యక్షమైంది. దేవిని దర్శించిన పిదప వివేకానందుని దృష్టి కోణం మారిపోయింది. ఆధ్యాత్మికత ఆయనలో జాగృతమైనది. 'అమ్మా! నాకు భక్తి, శాంతి, వైరాగ్యములను ప్రసాదించు తల్లీ! ఉద్యోగం కావాలని నేను ఎంతమాత్రము కోరను' అని వేడుకున్నాడు. దేవి ప్రసన్నురాలై 'మంచిది. నీవు కోరుకున్న మూడింటిని ప్రసాదిస్తున్నాను' అని పలికింది. వివేకానందుడు ఆ ఆధ్యాత్మిక బలంతో యావత్ప్రపంచమును ఒక ఊపు ఊపాడు. అమెరికా, చికాగో... ఇంకా మరెన్నో ప్రపంచ నగర ములన్నీ పర్యటించి హిందూసంస్కృతి గురించి ఉపన్యసించాడు. ప్రపంచమంతా ఉలిక్కిపడింది. భారతదేశ సంస్కృతి గురించి పునరాలోచించింది. కలకత్తా నగర వీధులలో ఆయనను ఊరేగిస్తుంటే హైకోర్టు జడ్జీలు, ఇతర న్యాయవాదులు 'ఆ రథానికి కట్టిన గుఱ్ఱాలను తొలగించండి. ఆ బండిని మేము లాగుతాము' అని అడిగారట. ఒక యోగికి ఎంతటి గౌరవం లభించిందో ఆలోచిస్తే ఆధ్యాత్మికశక్తికి ఉన్న శ్రేష్ఠత్వం ఏమిటో అర్థమౌతుంది. ఆయన స్థాపించిన రామకృష్ణమిషన్‌లు భారతదేశంలో ఉన్నవాటికంటే నాలుగైదు రెట్లు ఎక్కువ ఆశ్రమాలు విదేశాలలో ఉన్నాయి.

**సఫలత కలుగలేదంటే ఎక్కడో ఏదో లోపం ఉన్నది**

## స్వామి వివేకానంద యొక్క విలక్షణమైన చమత్కారం

వివేకానందుడు ప్రదర్శించిన ఒకానొక అద్భుతాన్ని గురించి తెలుసుకుందాం. 'జమ్‌షెడ్‌జీ టాటా ఉక్కు పరిశ్రమ పెట్టడానికి గాను అనుమతిని ప్రసాదించమని అడగటానికి ఇంగ్లండ్ వెళ్ళాడు. క్వీన్‌ఎలిజెబెత్ 'మీరు కోరుకుంటే కర్మాగారమును పెట్టుకోవచ్చు' అన్నది. సరే అనుమతి దొరికింది. కానీ దానికి కావలసిన ముడిఇనుము, బొగ్గు, నీరు... మొదలైనవి కావాలి. అవన్నీ ఒక్కచోట లభించడమనేది అంత తేలికైన విషయం కాదు.

జమ్షెడ్‌జీ ఒకరోజు వివేకానందులవారి దగ్గరకు వచ్చాడు. భారతదేశంలో ఒక ఇనుప కర్మాగారమును స్థాపించాలని ప్రయత్నిస్తున్నాను. దేశం ఆర్థికంగా ప్రగతిని సాధిస్తుంది. ఇనుముపై విదేశాల ఆధిపత్యం కొనసాగుతున్నది. మనం కూడా ఇనుము కర్మాగారమును పెట్టగలిగినచో అది చాలా సంతోషించదగిన విషయమవుతుంది' అని వేడుకున్నాడు. 'యోగులకు అన్ని విషయాలు కరతలామలకంగా తెలుస్తాయని విన్నాను. భారతదేశంలో లోహం-నీరు-బొగ్గు పుష్కళంగా ఉండే ప్రదేశాన్ని మీరు చెప్పండి. మీ సహాయం మాకు ఎంతో అవసరం' అని వేడుకున్నాడు. మరునాడు వివేకానందులవారు ధ్యానస్థులై యావత్ భారతదేశాన్ని ఎక్సరే దృష్టితో వీక్షించారు. వారికి ఈ మూడు పుష్కలంగా ఉండే ఒక ప్రదేశం కనిపించింది. అది బీహారు రాష్ట్రంలోని సింహభూమిజిల్లాలో ఒక చిన్న కుగ్రామం. ఆరోజులలో అది పూర్తిగా అడవి. 50 మైళ్ళ పొడవునా వ్యాపించిన రాళ్ళురప్పలు-పొదలు. అక్కడ మనిషి సంచారమే లేదు. వివేకానందులవారు ఆ ప్రదేశాన్ని చూపించి ఈ స్థలంలో మీరు కోరుకున్న మూడు పుష్కలంగా లభిస్తాయి. దీనినే మీ కర్మాగారమునకు ఎన్నుకోండి' అని చెప్పారు.

ఎంతో డబ్బు ఖర్చుపెట్టి స్థలం కొంటున్నాం. ఇబ్బందులేమీ రావుకదా? అని అడిగాడు టాటా. ఎలాంటి ఇబ్బంది రాదు. మీరు కంగారుపడకండి. ఆ ప్రదేశంలో మీకు కావల్సిన మూడు లభిస్తాయి అన్నారు వివేకానందుడు.

టాటా ఆ స్థలాన్ని వెతికించాడు. ఎంతో ప్రయాసపడి పట్టుకోగలిగారు. ఆ స్థలాన్ని కొనుగోలుచేసి కర్మాగారం నిర్మించాడు. ఈనాటికీ అక్కడ పరిశ్రమకు కావల్సిన మూడు వస్తువులు తగినంత పరిమాణంలో లభిస్తూనే ఉన్నాయి. దీన్ని అద్భుతం కాక మరేమంటారు? ఇది భౌతికజీవితంలో జరిగిన అద్భుతం.

స్వామి వివేకానందులవారితో 'మీరు ఏమి చెయ్యాలనుకున్నా ఖర్చుకు ఏమాత్రం వెనుకాడవద్దు' అని చెప్పేవాడు టాటా. వివేకానందులు తమ గురువు పేరిట బేలూరులో చలువరాతి మఠాన్ని నిర్మింపజేశారు. అందుకోసం కోటానుకోట్ల ధనం వెచ్చించబడింది. ఆయన ఎప్పుడు ఎవ్వరినీ చందాలు ఇవ్వమని అడుగలేదు. రసీదులు వేయించలేదు. సమావేశాలు పెట్టలేదు. దానం చెయ్యమని యాచించలేదు. డబ్బు దానంతట అదే ప్రతిరోజు, ప్రతినెలా కోట్లాదిరూపాయల విరాళాల రూపంలో వస్తూండేది. ఆయన దేశమంతటా ఎన్ని మఠాలు కట్టించారో చెప్పలేం. అదీ ఎంతో వేగంగా. ఇంతాచేస్తే ఆయన వయస్సు 31!!

## ఆధ్యాత్మికత ద్వారా సిద్ధించిన అద్భుతాలు

స్వామి ద్వారా లబ్ధిపొందినవారు వివేకానందులవారికి సంపూర్ణంగా సహాయం చేస్తామని ఒప్పుకుని, తదనుగుణంగా ధనాన్ని సమర్పించుకునేవారు. మీరు మూడురకాలైన ఆధ్యాత్మికతలను గురించి అర్థం చేసుకోవాలి. 1) మీకు ధనాన్ని తద్వారా లభించే ఖ్యాతిని తెచ్చిపెడుతుంది. మీకు కావల్సింది అదేగా! ఇప్పటి వరకూ మీరు బుద్ధుడి గురించి, వివేకానందుల గురించి... తెలుసుకున్నారు. ఆధ్యాత్మికత యొక్క ఆధ్యాత్మిక పక్షాన్ని గురించి వింటే కనుక మీరు మహాపురుషులైపోతారు. ఆధ్యాత్మిక పక్షమును ఎప్పుడైతే అర్థం చేసుకుంటారో అప్పుడే మీరు భగవంతుడు, అవతారపురుషుడు అయిపోతారు. 'యోగి' కావలెననే సంకల్పం మీలో ఉండాలి. అప్పుడే మీరు ఆధ్యాత్మిక పక్షంలోకి ప్రవేశించగలరు.

## పూజ్యగురుదేవుల స్వయం ఉదాహరణ

ఇంకొక్క ఉదాహరణను మీరు పరిశీలించండి. ఇందుకోసం మా జీవితాన్నే ప్రస్తుతీకరిస్తున్నాము. ఆధ్యాత్మికపథం పైన పయనించిన పిదప ఒక వ్యక్తికి ప్రాపంచిక జీవితంలో మేలు కలుగుతుందా? లేదా? మీరే గమనించండి. మేము ఒక్కరమే ఐదుగురు మనుష్యులు చేసే పనిని చేశాం. ఇప్పుడు మా వయస్సు 71. 1980 నాటి మా ఈ 71 ఏళ్ళ వయస్సు వరకు మా పనితీరును పరిశీలించండి. మా పని, శ్రమ, నైపుణ్యం... అన్నింటినీ లెక్కకడితే మేము ఒక్కరే చేసిన పని ఐదుగురు మనుష్యులు చేసే పనికన్నా తక్కువకాదు. ఐదుగురు వ్యక్తులు రోజుకు 8 గంటలు చొప్పున మనస్సు శరీరాలను సంపూర్ణంగా ఏకాగ్రమొనర్చి చెయ్యగలిగిన పనిని మేము ఈ శరీరంతో చేశాము. *(సశేషం)*

*- అఖండజ్యోతి, డిసెంబరు 2016*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**సఫలత కొరకు నిరంతరం ప్రయత్నిస్తుండాలి**

నావారితో నా మాట

# తొమ్మిది సంవత్సరాల మాతృశక్తి శ్రద్ధాంజలి నవసృజన మహాపునశ్చరణ-2

### బాల్యాన్ని పరిరక్షించాలి - సంస్కారవంతమైన యువతరాన్ని నిర్మించాలి

***క్రిందటి సంచికలో యువశక్తి, నారీశక్తి మరియు పరిజనులందరు చేయవలసిన ఉపాసన, సాధన, ఆరాధనాపరమైన కార్యక్రమాల గురించి చర్చించుకున్నాం. ప్రస్తుతం యువక్రాంతి సంవత్సరం రెండవ భాగం కొనసాగుతోంది. దీనికి సంబంధించి మరికొన్ని విషయాలు తెలుపవలసి ఉన్నది. షిర్డీ (నాసిక్)లో ప్రస్తుతం కన్యా కౌశల శిబిరం జరుగుతున్నది. పిల్లలకి జన్మనిచ్చేది మాతృశక్తి. బాల్యం బహుమూల్యమైన కాలం. తల్లి, తండ్రి, గురువు ఈ ముగ్గురి సంరక్షణ అందితే బాల్యం సురక్షితంగా ఉంటుంది, ఒక ఆదర్శపౌరుడి నిర్మాణం జరుగుతుంది. బాల్యం ఎంత ముఖ్యమో అర్థం చేసుకోగలిగితే, సంస్కారాలకు ప్రాణం పోయగలిగితే దృఢమైన పునాదులు వేసినట్టే. రండి! బాల్యం నుండి మొదలుపెడదాం***

## బాల్యానికి ముందు



తల్లి గర్భంలో ఒక పిండం రూపంలో శిశువు స్థాపించబడతాడు. శిశువు ఆరోగ్యం తల్లి యొక్క శారీరిక మరియు మానసిక ఆరోగ్యం మీద ఆధారపడి ఉంటుంది. వైద్యరంగంలో ప్రీ-నేటల్ కేర్, నియో-నేటల్ కేర్‌కి చాలా ప్రాముఖ్యత నిస్తారు. తల్లి పోషణపై చాలా దృష్టిపెడతారు. శిశువుకి ఆహారం తల్లి నుండే అందుతుంది, ఒక మినీ సాగరంలో ఈదుతూ ఉంటుంది. రక్తనాళాల ద్వారా పిండం తల్లితో సంపర్కం ఏర్పర్చుకుంటుంది. దాని ద్వారా నిరంతరం తల్లి రక్తం నుండి అందే పోషకాలను, ప్రాణ వాయువును స్వీకరిస్తుంది. శ్వాస కూడా అక్కడి నుండే లభిస్తుంది. తల్లి ఆలోచనలు ఎలా ఉంటే, శిశువు ఆలోచనలు అలాగే ఉంటాయి. గర్భంలోనే సంస్కారాలు సంక్రమిస్తాయి. కోపం, మొండితనం, చిరాకు, ప్రసన్నత, ఆనందం అన్నీ క్రమంగా అప్పటి నుంచే శిశువులో ప్రవేశిస్తాయి.

అందుకే మన సంస్కృతిలో గర్భం ధరించినప్పటినుండే శిశువు మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తల్లిని ఎటువంటి మనోవికారాలకు లోనుకానివ్వరు. సరైన పోషణ అందిస్తారు. ప్రయాణం తొమ్మిది నెలల ముందే మొదలవుతుంది. శిశువు శరీరం పుట్టకముందే అతని భావనాత్మక, ఆధ్యాత్మిక, శారీరిక వికాసం భవిష్య రూపకల్పన అన్నీ మొదలైపోతాయి. మదాలస కథ మనందరికీ తెలిసిందే. తన ముగ్గురు కొడుకులు తేజస్వులైన మహాపురుషులుగా వికసిస్తారు. తండ్రి బాధపడతాడు. ఆధ్యాత్మిక చింతన కలిగిన మదాలస ముగ్గురు సాధుబాలకులకు జన్మ నిచ్చింది. ఇప్పుడు రాజ్యాన్ని ఎవరు చూసుకుంటారు? ఆ తరువాత ఆయన కోరిక మేరకు నాలుగవ కొడుకు రాజపురుషుడిగా ఎదిగాడు. అలర్క్ తన తండ్రి సింహాసనాన్ని అధిరోహించాడు. ఎంతో సూక్ష్మ మైన, గంభీరమైన ప్రక్రియ ఇది. దేశ పౌరుల నిర్మాణం గురించి చర్చించే ముందు గర్భస్థశిశువు మీద ధ్యాస పెట్టాలి. తల్లి యొక్క మనోవైజ్ఞానిక, ఆధ్యాత్మిక, శారీరిక వికాసం మీద ధ్యాస పెట్టాలి. దానితో పాటే తల్లికి సహకరించే తండ్రి మీద కూడా ధ్యాస పెట్టాలి. అత్యుత్తమమైన కుటుంబ నిర్మాణం ఇలాగే జరగాలి. ఆధ్యాత్మిక మార్గదర్శనానికి గురువు దారి చూపించాలి. తల్లిదండ్రులిద్దరు వారికి తగ్గట్టు స్వాధ్యాయ, సత్సంగాలను ఏర్పాటు చేసుకోవాలి. శ్రేష్ఠమైన ఆలోచనలు శ్రేష్ఠమైన సంతానానికి జన్మనిస్తాయి. 'నెగిటివిటీ'తో చుట్టు ముట్టిన తల్లి కడుపున మనోవికారాలు కలిగిన పిల్లలు పుడతారు.

శాంతికుంజ్, హరిద్వార్ ద్వారా దేశమంతటా గర్భ సంస్కార (సీమంతం) క్రమాలు జరుగుతున్నాయి. ఇప్పుడు చాలాచోట్ల ప్రభుత్వం దీనిని తప్పనిసరి చేసింది. సుసంతతి కావాలని ఎవరికి మాత్రం ఉండదు? అన్ని ధర్మాల వారూ ఇందులో పాల్గొంటున్నారు. నిజమైన నరరత్నాలు, నారీశక్తుల నిర్మాణం జరుగుతోంది. ఈ విషయం అర్థమైతే బాల్యాన్ని

**ఓటమిని అంగీకరించామంటే నిరాశను ఆహ్వానించినట్లే**

మనం పరిరక్షించగలం. ఆ తరువాతే యువశక్తి నిర్మాణం గురించి ఆలోచించగలం. శక్తివంతమైన యువత ఉంటే దృఢమైన దేశనిర్మాణం గురించి ఆలోచించవచ్చు. కాబట్టి మొదటి అడుగు గర్భస్థశిశువు, తల్లి, మరియు కుటుంబ వాతావరణం ఆధ్యాత్మికతతో నింపాలి. అప్పుడు ప్రయాణం సులువవుతుంది.

## బాల్యాన్ని గడపాల్సిన సరైన విధానం

నేడు బాల్యం ఒకరకమైన దుస్థితిలో ఉంది. ప్రజలు, చదువుకున్న పౌరులు, పెద్దలు, కొత్త తల్లిదండ్రులు తలుచుకుంటే ఈ పరిస్థితిని సరిదిద్దగలరు. దేశానికి పునాది బాల్యం. అన్ని మనోవికారాలు, రోగాలకు మూలాలు బాల్యంలోనే పుట్టి, పెరుగుతాయి. యువతగా ఎదుగుతున్నకొద్దీ అవీ పెరుగుతాయి. అలాంటివారినే మనం 'ప్రోబ్లమ్ చైల్డ్' అంటాం, కాని అందరు కలిసి ఒకేసారి ధ్యాస పెడితే ఈ దుస్థితి రాకుండా అరికట్టవచ్చు.

1. **చిన్నప్పుడే పిల్లల్ని వృద్ధులుగా మార్చే కుట్ర:** అతిగా మహత్త్వాకాంక్షలను రేకెత్తించడం. బాల్యాన్ని అణచివేసే కుచక్రం–సోషల్ మీడియా పుట్టక ముందు ఒక పదిహేను సంవత్సరాల క్రితం పిల్లలతో పోలిస్తే, నేటి పిల్లల బాల్యం నాశనం అవుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది. చిన్న చిన్న పిల్లలు సూపర్ మాన్లు, డ్యాన్స్ గర్ల్స్, ఇండియన్ ఐడల్ అయిపోవాలని ఆశిస్తూ తల్లిదండ్రులు తమ కలలను వారిపై రుద్దుతున్నారు. ఈవిధంగా బాల్యం మాయమైపోతోంది. ఈ ఆధునిక తరం వారిని చిన్నప్పుడే ముసలివాళ్ళను చేయాలని కుట్ర పన్నుతోంది.
2. **అపారమైన జ్ఞానబరువు కింద నలిగిపోతున్న బాల్యం:** నిరక్షరాస్యులు, లేదా తక్కువ విద్యావంతులైన తల్లిదండ్రులు తమ పిల్లలకి అవసరానికి మించిన జ్ఞానం తొందరగా అందించాలని చూస్తున్నారు. వారి మనోవిజ్ఞానాన్ని పరీక్షించకుండా శిక్షకులు ఇష్టం వచ్చినట్టు వారి మెదడులో జ్ఞానాన్ని కుక్కుతున్నారు.
3. **స్కూల్, కోచింగ్, ట్యూషన్, హోంవర్క్‌ల వల్ల అధిక ఒత్తిడి:** ఈ తరంలో అందరూ కోచింగ్ అనేది ప్రొఫెషనల్‌గా అందుకోవాలని చూస్తున్నారు. ప్రతి ఒక్కరు డాక్టరు, ఇంజనీరు, మానేజర్ అవ్వాలని చూస్తున్నారు. కానీ ఎవరిలోనైనా కళాకారుడు, చిత్రకారుడు, కవి, గాయకుడు, రచనాత్మక మనసు దాగి ఉందేమో అని గమనించడమే లేదు.
4. **ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్, సాఫ్ట్ డ్రింకులతో నాశనం అవుతున్న ఆరోగ్యం:** రోజు ఉదయం పళ్ళు, మొలకలు వంటి ఆరోగ్య కరమైన అల్పాహారం కాకుండా స్కూలు బాక్సుల్లో కూడా చిప్స్, జంక్ ఫుడ్ లాంటివి తింటుంటే మానసిక వికాసం కుంటుపడుతుంది.
5. సంయమరహిత–నియమరహిత–శ్రమరహితంగా– టి.వీ సీరియళ్ళు చూస్తూ భోజనం చేయడం లాంటి జీవనశైలి.
6. **పుస్తకాల బరువు:** వెన్నుముక సమస్యలు నిరంతరం పెరుగుతున్నా కూడా విద్యావేత్తలు పట్టించుకోకుండా, హోంవర్కుల పేరిట గంపెడు పుస్తకాలు మోస్తుంటే, ఇక ఆడుకునేది ఎప్పుడు? వ్రాసుకునేది ఎప్పుడు? నేటి వెన్నెముక సమస్యలకి పునాదులుగా ఈ స్కూలు బ్యాగులు తయారవుతున్నాయని న్యూరోసర్జన్లు పేర్కొంటున్నారు.
7. **బాధ్యతగా భాష:** ఆంగ్లంలో మాట్లాడడం అనివార్యం అయిపోయింది, అదే స్మార్ట్‌గా ఉండడానికి ప్రతీకగా భావిస్తున్నారు. మాట్లాడలేకపోతే దండిస్తున్నారు. ఒకప్పుడు సంస్కృతం, హింది అనివార్యంగా ఉండే ఈ దేశంలో మరో భాష నేర్చుకోవాల్సిన ఒత్తిడి.
8. **చెవులు దద్దరిల్లిపోయే పాశ్చాత్య సంగీతం, అశ్లీల దృశ్యాలు:** రోడ్డు మీదే సహజంగా కనిపించే అశ్లీల బానర్లు, పాశ్చాత్యీకరణను రేకెత్తించే ప్రకటనలు. సినిమాల భీభత్సం. వాటి మీద ఎవరి అదుపు లేదు.
9. **ఇంటర్నెట్ దురుపయోగం:** 3,4 సంవత్సరాల పిల్లలు కూడా స్మార్ట్ ఫోన్ సులువుగా ఉపయోగిస్తున్నారు. సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఇంటర్నెట్ వల్ల అశ్లీల చిత్రాలు సులువుగా అందుబాటులోకి వచ్చాయి. తల్లిదండ్రులు, శిక్షకులు, పెద్దల దగ్గర పర్యవేక్షించడానికి సమయమే లేదు. 3జి, 4జి అంటూ పెరుగుతూ, ఎక్కడ ఆగుతుందో ఏమో. ఇప్పుడు గనక బాల్యన్ని సంరక్షించుకోలేకపోతే మెల్లిమెల్లిగా మానసిక వికాసం దెబ్బతింటుంది.
10. **శిక్షణ మాత్రమే, విద్య లేదు:** సంస్కారం, అణుకువ నేర్పించే

**నిరాశ ఎన్నో దుష్ఫలితాలకు మూలం**

విద్య అందివ్వబడటం లేదు. శబ్దజ్ఞానాన్ని పెంచే విద్య, కడుపు నింపే విద్య మాత్రమే అందిస్తున్నారు. విద్య, సంస్కారాలు, కుటుంబ విలువలు, ఆధ్యాత్మికతకు ప్రాముఖ్యత ఇవ్వట్లేదు.

**11. లింగభేదం:** ఆడ, మగ పిల్లల్లో తేడా చూడడం. అందుకే గర్భంలోనే ఆడపిల్లల్ని చంపేయడం (చట్టరీత్యా నేరమైనా కూడా) 21వ శతాబ్దంలో పెద్ద సమస్యగా మారింది.

**12. బాలకార్మికులు, దోపిడీలు, అపహరణలు, లైంగిక అత్యాచారాలు:** అక్షరాలు దిద్ది, చదువు నేర్చుకోవాల్సిన వయసులో పిల్లలు దాభాలలో పనిచేయడం మన దౌర్భాగ్యం. చిన్నపిల్లల్ని అపహరించడం, వారిని హింసించడం సాధారణమైపోయింది. నోబల్ బహుమతి పొందిన మన దేశ పౌరుడు శ్రీ కైలాశ్ సత్యార్థి ఇప్పటికి 85,000 మంది పిల్లలను రక్షించారు. ఇంకా కృషి చేస్తూనే ఉన్నారు. కానీ ఆయన ఒక్కరు చేస్తే సరిపోతుందా? సమాజంలో అవగాహన పెంచాల్సిన బాధ్యత లేదా? 15-16 ఏప్రిల్‌లో జరిగిన దేవసంస్కృతి విశ్వవిద్యాలయం దీక్షాంత సమారోహానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారిని కలిశాక, వారి కార్యక్రమాలలో గాయత్రీ పరివార్ సహకరించాలని అనిపించింది. మనకి పేరక్కర్లేదు, పురస్కారాలు అక్కర్లేదు, పిల్లల అమూల్యమైన బాల్యవికాసం కావాలి.

## పరిష్కార సూత్రాలు

1. **గర్భ సంస్కారాలు:** పుంసవన సంస్కారాలతో తల్లి శారీరిక, మానసిక ఆరోగ్యం పూర్తిగా సంరక్షించబడుతుంది. జాతి, ధర్మ, ప్రాంత భేదాలు లేకుండా దేశమంతటా జరగాలి. శిబిరాల ఏర్పాటు, జనజాగృతి కల్గించాలి.

2. **పుట్టుక తరువాత:** నామకరణం, అన్నప్రాసన, చూడాకర్మ, అక్షరాభ్యాసం, ఉపనయన సంస్కారాలు. అక్షరాభ్యాసం చేస్తూనే స్కూళ్ళల్లో, గురుకులాలలో ప్రవేశం ఇవ్వాలి. అన్ని శక్తిపీఠాలు, ప్రజ్ఞాపీఠాలు, మండళ్ళు, చేతనా కేంద్రాలలో దీనికి తగిన వ్యవస్థ ఉండాలి. దేశంలోని అన్ని ఆంగన్‌వాడీ కేంద్రాల సహకారం తీసుకోవడం.

3. **బాలసంస్కార శిబిరాల ఏర్పాటు:** ఈ దిశలో గాయత్రీ పరివార్ అమోఘమైన ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికి లక్షన్నర పైగా శిబిరాల ఏర్పాటు జరిగింది. శక్తిపీఠాలలో, ప్రజ్ఞామండళ్ళల్లో, ఇంట్లో తల్లుల ద్వారా, స్టేషన్ల ప్లాట్‌ఫారాల మీద అనాథ పిల్లలకి (ఉదా: పాట్నా), బేర్‌ఫుటెడ్ స్కూళ్లు, వేసవి బాలసంస్కారశాలల ఏర్పాటు.

4. **బాలసంస్కారశాలల విధానంలోనే కిశోర సంస్కారశాలలు:** ఇది ఎంతో సున్నితమైన వయసు. ఈ దిశలో ఎవరైనా ముందుకు వస్తే గాయత్రీ పరివార్ సహకరించడానికి సిద్ధంగా ఉంది.

5. **కన్యా కౌశల శిబిరాల ఏర్పాటు:** సంస్కార కుటుంబాలకు దృఢమైన పునాదిని ఏర్పరుస్తాయి. నారీజాగరణ-సశక్తీకరణ - విద్య, భద్రత, సంస్కారం, ఆరోగ్యం, స్వావలంబన మొదలైనవాటికి చాలా ముఖ్యమైన వ్యవస్థ.

6. **కుటుంబ యువ సమ్మేళనం:** కొడుకు కోడలు, కూతురు అల్లుళ్ళలో దివ్య సంస్కారాల వికాశం. ఈ ప్రయోగం ఎంతో సఫలమైంది.

మాతృసత్తా శతాబ్ది పునశ్చరణ సందర్భంగా ఈ అంశాలపై మరింత చింతన వచ్చే సంచికల్లో.

*- అఖండజ్యోతి, జులై 2017*

*అనువాదం: ఎం.వి.ప్రసాద్*


దైవీశక్తుల తోడ్పాటుకై
కష్ట నష్టముల నివారణకై
చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై
జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై
జీవితంలో స్థిరపడుటకై

యుగశక్తి గాయత్రి

మాసపత్రిక చదవండి!
చదివించండి!!

ప్రతుల కొరకై సంప్రదించండి:
ఫోన్: 040-23700722, 9949111175


మంచి ఫలితాలను ఆశిస్తూ నిరంతరం కృషి చేయడమే మన కర్తవ్యం

# అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018 (కౌంట్‌డౌన్-5)

**2018 జనవరి 5 నుండి 8 వరకు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రము, మంగళగిరి పట్టణము, గుంటూరు జిల్లా, ఆం.ప్ర**

అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము సమీపించుచున్నకొలది రాష్ట్రం నలుదిశలా గాయత్రీమహామంత్ర జపము, గాయత్రీ మంత్ర లేఖనము ఊపందుకొనుచున్నది. రాష్ట్రములోని వివిధ క్షేత్రములలో జపము చేయుచున్నవారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుచున్నది.

**మంగళగిరి పట్టణ శివారునందలి ఎన్.ఆర్.ఐ. వైద్యశాల మరియు వైద్యకళాశాల ప్రాంగణమందలి మహర్షి గౌతమి పర్ణశాలలో నిత్యము చేసెడి జపసంఖ్య ఒకకోటి ఇరువది ఆరు లక్షల సంఖ్యను అధిగమించింది. (1,26,36,000)** దీనికి రాష్ట్రములోని వివిధ ప్రాంతాలలో మరియు తెలంగాణా రాష్ట్రములో కూడా జపము సంఖ్య వేలసంఖ్యను చేరుకొన్నది.

అనేకానేక మంది, కార్యకర్తలు నూతనంగా సంకల్పము చేయుచూ జపము చేసెడివారి సంఖ్య పెంపుదలకై అనునిత్యము కృషిచేయుట అత్యంత ముదావహం. దీనిలో భాగంగా అరువది వసంతాలు పూర్తిచేసికొన్నవారు సైతము 100 మంది నుండి వెయ్యిమంది వరకు జపసాధకులను తయారుచేయుటకై కంకణ బద్ధులగుచున్నారు. ప్రతి ఒక్కరు 50 నుండి 100 మందికి తక్కువ కాకుండా జపసాధకులను తయారుచేసెడి కార్యక్రమాన్ని చేపట్టి తమ తమ చుట్టుప్రక్కల ప్రదేశాలలో ప్రచారము చేయుచున్నారు.

అశ్వమేధ యజ్ఞము యొక్క అర్థాన్ని, లక్ష్యాన్ని తెలుపుచూ ఒక కరపత్రము మరియు అశ్వమేధ యజ్ఞము చేయవలసిన ఆవశ్యకతను మరో కరపత్రాన్ని తెలుగులో ముద్రించి ప్రచార నిమిత్తము కార్యకర్తలకు వేలసంఖ్యలో అందించుట ప్రారంభమైంది. సమాజములోనున్న వివిధ సమూహాలను లక్ష్యంగా చేసికొని, ఆయా ప్రాంతాలలో జపసాధకుల నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం జులై, ఆగస్టు మాసాల వరకూ కొనసాగనున్నది. ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొనుటకై నూతన కార్యకర్తలు ముందుకు వస్తున్నారు.

**పై కార్యక్రమానికి అనుగుణంగా, కార్యకర్తల పేర్ల నమోదు మరియు కలశయాత్రలో పాల్గొనెడి (40 సంవత్సరముల వయస్సులోపు) స్త్రీల పేర్ల నమోదు కార్యక్రమము ప్రారంభమైనది. దాదాపుగా ఐదువేల మంది పై చిలుకు స్త్రీలను కలశయాత్రలో పాల్గొనుటకై సంసిద్ధుల చేయుట జరుగుచున్నది. పాఠశాల, కళాశాల విద్యార్థినులు మరియు గృహిణుల వరకు దీనిలో పాల్గొనుటకై ఉత్సుకతను చూపుచున్నారు.**

పై కార్యక్రమాన్ని అందిపుచ్చుకొనెడి వారికి కావలసిన సహాయ సహకారాలను గాయత్రీ చేతనా కేంద్రము, మూసాపేట, హైద్రాబాద్ అందించుచున్నది. కావున పై అద్భుత పుణ్యప్రదమైన పుణ్యకార్యక్రమంలో పాల్గొనదలంచిన వారంతా, జాతి, వర్ణ, కుల, మత, వయో, వర్ణ భేదాలు లేకుండా మాతో చేతులు కలుపవలసిందిగా ప్రార్థించుచున్నాం.

**సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:**
**99491 11175 / 040-23700722**

## ప్రచార రథ చోదకులు & నిర్వాహకులు కావలెను

*అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము జనవరి 2018లో 5 నుండి 8 తేదీల మధ్య మంగళగిరి, గుంటూరు జిల్లాలో జరుగనున్నది. ఈ మహాక్రతువు సంపూర్ణ విజయానికై రెండు ప్రచార రథములు (శక్తి కలశాలతో) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో దాదాపు నాలుగు మాసములు ప్రచారాన్ని నిర్వహిస్తాయి. ఈ వాహనములను నడుపుటకై మరియు నిర్వహించుటకై సమయదానీలు కావలసి ఉన్నారు. (1) వాహన చోదకులు (డ్రైవర్లు) (2) ప్రచార నిర్వాహకులు*

*ఆసక్తిగలవారు వారి పూర్తి వివరములను మరియు ఎంతకాలము, ఎప్పటినుండి వారి సమయాన్ని ఇవ్వగల్గెడి దానిని తెలుపుచూ ఈ క్రింది చిరునామాకు తెలియజేయప్రార్థన.*

**గాయత్రీ చేతనాకేంద్రము, హెచ్.పి.రోడ్, మూసాపేట,**
**హైదరాబాద్ - 500 018. తెలంగాణ.**
**ఫోన్: 040-23700722, సెల్: 9949111175**

అడుగులు ముందుకు వేస్తుంటే గమ్యాన్ని తప్పనిసరిగా చేరుకోగలము

వార్తలు

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## చీరాలలో

ప్రకాశం జిల్లా చీరాల పట్టణంలో జూన్ 17 నుండి 19 వరకు శాంతికుంజ్ హరిద్వార్ వారి తత్త్వాధానంలో, గాయత్రీ పరివార్, చీరాల శాఖ ఆధ్వర్యంలో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము అత్యంత వైభవోపేతంగా జరిగింది. డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్, శ్రీ కాళీచరణ్‌శర్మ దిశానిర్దేశంలో శ్రీ ఉమేష్ శర్మ, శ్రీమతి ప్రశాంతి శర్మ, డి.వి.ఆర్.మూర్తిగార్లు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొదటిరోజు కలశయాత్రలో 1500 మంది పాల్గొన్నారు. తదనంతరం శ్రీ కాళీచరణ్‌శర్మగారు మహిళా జాగరణ ఉద్యమం గురించి చేసిన ప్రసంగం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. రెండవరోజు 432 మంది దంపతులతో దేవపూజన కార్యక్రమం ఉదయం 7 గం॥లకు ప్రారంభమైంది. ప్రారంభంలో గాయత్రీ యజ్ఞము, మంత్ర విజ్ఞానం గురించి శ్రీ డి.వి.ఆర్.మూర్తిగారి ప్రసంగం సభ్యులను అలరించింది. సాయంత్రం 7 గం॥లకు యువ సమ్మేళనంలో శ్రీ గౌర్‌జీ, కాళీచరణ్‌శర్మగార్లు, యువవర్గానికి దిశానిర్దేశం చేశారు. తదనంతరం 11,116 దీపాలతో గాయత్రీ దీపమహాయజ్ఞం భక్తుల ఆనందోత్సాహాల మధ్య వైభవోపేతంగా జరిగింది. మూడవరోజు పూర్ణాహుతితో ముగిసిన ఈ కార్యక్రమంలో 15000 మంది పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ ప్రాంతాల నుండి 300 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక కార్యకర్తలైన బాపయ్య, జనార్దన్, ఆంజనేయులు, చలపతిరావు, చన్న నారాయణ, భాస్కర్, శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, లక్ష్మీనారాయణ, రామారావు, కుమారి, పద్మజ, అమరవాణి, సి.రమాదేవి, సుగుణ, రామయ్య, ఉమమహేశ్వరరావు, కె.రమాదేవి, సుమలత, సవాయిసింగ్, యన్.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, సోమశేఖరరావు తదితరులు రేయింబవళ్లు చెమటోడ్చి పని చేశారు.

## గాయత్రీ జ్ఞానమందిర్, బోయినపల్లిలో

దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం, శాంతికుంజ్, హరిద్వార్ ప్రొ వైస్ ఛాన్సలర్, గౌ॥ డా॥ చిన్మయ పండ్యాగారు మొదటి సారిగా హైదరాబాదు నగరానికి విచ్చేసిన సందర్భముగా తేది 06.07.2017 నాడు, ఓల్డ్‌బోయినపల్లి, సికింద్రాబాద్‌లోని గాయత్రీ జ్ఞానమందిరానికి విచ్చేశారు. ఆరోజు సా॥ 5 గం॥లకు మందిరాన్ని దర్శించిన తరువాత నూతనముగా నిర్మించబోవు 'యుగవేదవ్యాస భవనము'నకు వారి పుణ్యహస్తములతో శంఖుస్థాపన చేశారు. గాయత్రి మంత్ర లేఖన స్థాపన మరియు మందిర ప్రాంగణములో మొక్కను నాటడం మొదలగు కార్యక్రమములు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాయత్రీ సాధన వలన కలుగు లాభములు చెప్పి, అందరూ కూడ గురుదేవుల మార్గములో జీవనం సాగిస్తూ వారు చెప్పిన సప్తసూత్ర కార్యక్రమములను అమలుచేయటానికి ప్రయత్నించి దేశము మరియు సమాజ వికాసానికి తోడ్పడి జీవితాలను ధన్యం చేసికొనవలసినదిగా కోరారు మరియు 2018 జనవరిలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని మంగళగిరిలో జరుగబోవు అశ్వమేధ యజ్ఞంలో అందరూ పాల్గొని యజ్ఞాన్ని సఫలం చేయవలసినదిగా కోరుతూ తమ సందేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో 200 మంది వరకు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## బోయినపల్లిలో

గురుపౌర్ణమి సందర్భముగా తేది 09.07.2017వ తేది నాడు గాయత్రీ జ్ఞానమందిరం ఓల్డ్‌బోయినపల్లి సికింద్రాబాద్‌లో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 300 మంది భక్తులు పాల్గొని గురుపూర్ణిమ సందేశాన్ని గ్రహించారు. తదుపరి భోజన ప్రసాద వితరణ జరిగింది.

**మన గడ్డు పరిస్థితులకు ఇతరులకు కారణం అని భావించరాదు**